Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 93 మేడ్చల్ మల్కాజ్‌గిరి 25 ఏప్రిల్ 2023 మంగళవారం పేజీలు : 4

### కనిష్ఠాల నుంచి కోలుకున్నా.. నష్టాల్లోనే ముగిసిన మార్కెట్లు!

ముంబయి: అంతర్జాతీయ ప్రతికూల సంకేతాల మధ్య ఉదయం భారీ నష్టాలతో ప్రారంభమైన దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు చివరకు కనిష్ఠాల నుంచి కోలుకున్నాయి. కానీ, లాభాల్లోకి మాత్రం రాలేకపోయాయి. మిశ్రమ కార్పొరేట్ ఫలితాలు, ఫెడ్ వడ్డీరేట్ల పెంపు, రష్యా-ఉక్రెయిన్ యుద్ధం వంటి పరిణామాలు ఇంట్రాడేలో మదుపర్లను కలవరపెట్టాయి. చైనాలో కరోనా వ్యాప్తి నేపథ్యంలో విధిస్తున్న కఠిన లాక్‌డౌన్‌లు కూడా సెంటిమెంటు ను దెబ్బతీశాయి. అయితే, అమెరికా ఫ్యూచర్స్ ప్రస్తుతం లాభాల్లో ట్రేడవుతుండడంతో సూచీలకు చివర్లో కాస్త మద్దతు దొరికింది. మరోవైపు గత కొన్ని రోజుల భారీ నష్టాల నేపథ్యం లో కనిష్ఠాల వద్ద మదుపర్లు కొనుగోళ్లకు ఆసక్తి చూపారు.

## క్యాడర్‌లో నూతనోత్తేజం నింపేలా

# ప్లీనరీకి ముందే

## నియోజకవర్గాల్లో సంబరాలు!!



హైదరాబాద్ : ఎన్నికలను టార్గెట్ చేసుకుని ప్రజాక్షేత్రంలోకి వెళ్లడానికి, పార్టీ కేడర్ ను బలోపేతం చేయడానికి బీఆర్ఎస్ పార్టీ అధినేత కెసిఆర్ నయా ప్లాన్ వేశారు. బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈసారి ఎన్నికల సాధన సంబరాలుగా నిర్వహించాలని నిర్ణయించారు. ఈ మేరకు పార్టీ అధిష్టానం ఒక బృహత్ ప్రణాళికను రూపొందించి ఏప్రిల్ 25 వ తేదీన సంబరాలను నిర్వహించాలని పేర్కొంది. ఏప్రిల్ 27వ తేదీన బీఆర్ఎస్ ప్లీనరీకి ముందే రాష్ట్రవ్యాప్తంగా ఈ సంబరాలను నిర్వహించడానికి నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాలలో ఎమ్మెల్యేలు, పార్టీ ఇన్చార్జ్ లు నియోజకవర్గాలలో అత్యంత ఘనంగా ప్లీనరీలను నిర్వహించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా సాగనున్న ఈ నియోజకవర్గ స్థాయి ప్లీనరీలలో క్యాడర్ కు దిశానిర్దేశం చేయనున్నారు. ముఖ్యంగా త్వరలో రాష్ట్రంలో ఎన్నికలు జరగనున్నందున,ముందస్తుగా కేడర్ ను సిద్ధంచేసే క్రమంలోనే నియోజకవర్గాలలో సభలు నిర్వహించడానికి ప్లాన్ చేశారు. పండుగ వాతావరణంలో, ప్రజలందరినీ మమేకం చేస్తూ, పార్టీ ముఖ్య నాయకులు, అనుచరులు, కేడర్ అందరూ పాల్గొనేలా ఈ సమావేశాలను ఒక సంబరం జరిపినట్టు పండుగ వాతావరణంలో నిర్వహించనున్నారు. ఇప్పటికే నియోజకవర్గాల పరిధిలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించి పార్టీ క్యాడర్ ను బలోపేతం చేసుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

ఇక తాజాగా నియోజకవర్గ సంబరాల పేరుతో పండుగ వాతావరణం ఉండేలా నియోజకవర్గాలలో ఒక రోజు వేడుకలు జరపనున్నారు. తోరణాలు, ఫ్లెక్సీలు కట్టి, గ్రామగ్రామాన పార్టీ గద్దెలకు రంగులు పూసి, జెండా ఆవిష్కరణ చేసి వేడుకలు జరుపనున్నారు. నియోజకవర్గాల వ్యాప్తంగా జరగనున్న సమావేశాల సందర్భంగా పార్టీ గొప్పతనాన్ని ప్రభుత్వ పథకాలను, కేంద్రం తెలంగాణ రాష్ట్రానికి చేస్తున్న అన్యాయాన్ని ప్రజాక్షేత్రంలో ప్రజలకు చెప్పాలని నిర్ణయించారు. ప్రతి నియోజకవర్గంలోనూ మూడు వేల మందికి తగ్గకుండా, పార్టీ బలగమంతా హాజరయ్యే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని తీసుకున్న ఈ కొత్త నిర్ణయం ప్రజాక్షేత్రంలోకి పార్టీని బలంగా తీసుకువెళ్ళడమే కాకుండా, మంచి మైలేజ్ ను కూడా తీసుకు వస్తుందని గులాబీ బాస్ భావిస్తున్నారు.

### పెండింగ్ బిల్లులపై నిర్ణయం.. ఒకటి తిరస్కరించిన గవర్నర్

హైదరాబాద్: రాజ్‌భవన్ వద్ద పెండింగ్‌లో ఉన్న బిల్లులపై గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ కీలక నిర్ణయం తీసుకున్నారు. గతంలోనే కొన్ని బిల్లులకు ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. మరో మూడు బిల్లులపై నిర్ణయం తీసుకోవాల్సి ఉండగా వాటిలో తాజాగా ఒకదాన్ని తిరస్కరించి.. మిగిలిన రెండు బిల్లులపై రాష్ట్ర ప్రభుత్వ వివరణ కోరారు. డీఎంఈ (డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్) సహా వైద్యవిద్యలో పాలనాపరమైన పోస్టుల పదవీ విరమణ వయస్సు పెంపునకు ఉద్దేశించిన చట్టసవరణ బిల్లును తమిళిసై తిరస్కరించారు. పురపాలికల్లో అవిశ్వాస తీర్మానం గడువును మూడు నుంచి నాలుగేళ్లకు పొడిగింపు, కో-ఆప్షన్ సభ్యుల సంఖ్య పెంపునకు ఉద్దేశించిన పురపాలిక చట్టసవరణ బిల్లు, కొత్తగా మరికొన్ని ప్రైవేట్ విశ్వవిద్యాలయాలకు అనుమతిస్తూ తీసుకొచ్చిన చట్టసవరణ బిల్లులపై రాష్ట్ర ప్రభుత్వం నుంచి వివరణ కోరారు. దీంతో ప్రస్తుతం రాజ్‌భవన్‌లో ఎలాంటి బిల్లులు పెండింగ్‌లో లేనట్లైంది. గతంలో 3 బిల్లులను ఆమోదించిన గవర్నర్.. మరో రెండింటిని పరిశీలన, ఆమోదం కోసం రాష్ట్రపతి వద్దకు పంపించిన విషయం తెలిసిందే.

ఉభయసభలు ఆమోదించిన బిల్లులను గవర్నర్ ఆమోదించకుండా జాప్యం చేస్తున్నారని రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. మొత్తం 10 బిల్లులలో మూడు బిల్లులను ఆమోదించినట్లు, రెండింటిని రాష్ట్రపతి పరిశీలనకు పంపినట్లు, మరో రెండింటిపై రాష్ట్ర ప్రభుత్వ వివరణ కోరినట్లు రాజ్‌భవన్ తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. మరో మూడు గవర్నర్ పరిశీలనలో ఉన్నట్లు అప్పట్లో పేర్కొన్నారు. పెండింగ్ బిల్లుల అంశంపై ఇవాళ విచారణ ఉన్న నేపథ్యంలో మిగతా మూడింటిపైనా గవర్నర్ తమిళిసై నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు ఇవాళ సుప్రీంకోర్టుకు ఇదే అంశాన్ని నివేదించనున్నట్లు తెలుస్తోంది.

## కన్నడ ఎన్నిక గెలిస్తే... కాంగ్రెస్ పుంజుకున్నట్టే

### జాతీయ స్థాయి అంచనాలు



దేశవ్యాప్తంగా జారుడు బండ పై విన్యాసాలు చేస్తున్న కాంగ్రెస్ పార్టీకి.. కర్ణాటక ఎన్నికలు ఊపిరి పోయనున్నాయా? ముఖ్యంగా రాహుల్ గాంధీ ఇమేజ్.. వ్యక్తిగతంగా ఆయనకు జరిగిన పరాభవం(పార్లమెంటు సభ్యత్వం రద్దు) వివిధ రాష్ట్రాల్లో ఆ పార్టీ ఓటమి చెందినతీరు వంటివి.. కూడా ఈ ఎన్నికలతో కొట్టుకుపో యే అవకాశం ఉందా? అంటే.. జాతీయ స్థాయిలో జరుగుతున్న చర్చలు ఔననే అంటున్నాయి. ప్రస్తుతం పెద్ద రాష్ట్రాల్లో బీజేపీ వేళ్లూనుకుంది. ఒక్క రాజస్థాన్లో తప్ప.. కాంగ్రెస్ ఎక్కడా పెద్ద రాష్ట్రాల్లో అధికారంలో లేదు. దీనికితోడు.. గెలుస్తామని అనుకున్న రాష్ట్రాలు కూడా.. ఇటీవల కాలంలో కోల్పోయింది.ఈ పరిణామాలతో కాంగ్రెస్ పరిస్థితి తిరోగమనంలో సాగుతున్నట్టు కనిపిస్తోంది. ఈ పరిస్తితి నుంచి అంతో ఇంతో కోలుకుని తన ఉనికిని కాపాడుకునేందుకు ఉన్న ఏకైక మార్గం.. కర్ణాటకే నని అంటున్నారు పరిశీలకులు. ప్రస్తుతం కర్ణాటకలో వస్తున్న ముందస్తు ఎన్నికల ఫలితాలు కూడా కాంగ్రెస్కు సానుకూలంగానే ఉన్నా యి. ఏ రిపోర్టు చూసినా కాంగ్రెస్కు అనుకూలంగానే ఉంది. అంతేకాదు.. కాంగ్రెస్ సంపూర్ణ మెజారిటీ కూడా దక్కించుకుంటుందనే అంచనాలు వస్తున్నాయి. ఇదే జరిగితే.. 40 ఏళ్ల కర్ణాటక చరిత్రలో కాంగ్రెస్ రికార్డును సృష్టించినట్టే అవుతుంది. నాలుగు దశాబ్దాలుగా.. ఇక్కడ ఏ పార్టీకీ కూడా.. ప్రజలు సంపూర్ణ మెజారిటీ కట్టబెట్టడం లేదు. తాజాగా కాంగ్రెస్కు సానుకూల పవనాలు వీస్తున్నాయని చెబుతుండడం.. ముందస్తు ఎన్నికల సర్వేలు కూడా కాంగ్రెస్ పరిస్థితి మెరుగు పడుతుందని చెబుతుండడం వంటివి ఆ పార్టీలో కొంత జోష్ నింపు తున్నాయి. రోజు రోజుకు కాంగ్రెస్లో చేరేవారు కూడా పెరుగుతున్నారు. ఈ సర్వేలు చెప్పినట్టుగా కాంగ్రెస్ అధికారంలోకి వస్తే.. ఆ పార్టీ జాతీయ స్థాయిలో పుంజుకునేందుకు మార్గం సుగమం అయినట్టేనని అంటున్నారు పరిశీలకులు.



## ప్రత్యర్థులు కొట్లాడుకుంటున్న వేళ

# కేసీయార్ ఫుల్ ఖుషీ

హైదరాబాద్ : రాజకీయాల్లో ప్రత్యర్థులు ఎంత బలంగా ఉంటే అధికారంలో ఉన్న వారు కంగారు పడతారు. కానీ వారిలో వారే కలహించుకుంటూ కవ్వించుకుంటూ రచ్చ చేసుకుంటే ఏలిన వారికి హ్యాపీ కాకుండా మరేముంటుంది. ఇపుడు తెలంగాణా రాజకీయాల్లో అదే జరుగుతోంది. కాళ్లరిగేలా పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి పాదయాత్ర పేరిట మండుటెండలలో తిరిగారు. కాంగ్రెస్ ని ఏదో విధంగా ఒడ్డున పడేయాడానికి ఆయన తన వంతుగా తాపత్రయపడుతున్నారు. ఆయనకు సొంత పార్టీలో సీనియర్ల నుంచి సహకారం చూస్తే అంతంతమాత్రంగా ఉంది. అయినా సరే తానుగా జోక్యం చేసుకుని వారిని కలుపుకుంటూ ముందుకు పోతున్నారు. ఈ నేపథ్యంలో ఆయనకు బీజేపీ నుంచి పోటీ కూడా ఎదురవుతోంది. తెలంగాణాలో ఈ ఏడాది డిసెంబర్ లో ఎన్నికలు ఉన్నాయి. ముక్కోణపు పోటీ కచ్చితంగా ఉంటుంది. కేంద్రంలోని బీజేపీ ఈసారి తెలంగాణా మీద ఆశలు బాగానే పెట్టుకుంది. మొత్తం 119 సీట్లలో పోటీ చేసేందుకు బీజేపీకి అభ్యర్థులు ఉన్నా లేకపోయినా సై అంటోంది. అయితే చివరి నిముషంలో అధికార పార్టీ నుంచి బాగానే జనాలు వచ్చి బీజేపీ తీర్థం పుచ్చుకోవచ్చు అని అంటున్నారు. అది కూడా బీయారెస్ కి లాభమే తమ నేతలు వేరే పార్టీ నుంచి పోటీ చేసి వ్యతిరేక ఓట్లు ఎన్నో కొన్ని చీలిస్తే అది తమకు లాభ అవుతుందని బీయారెస్ నేతలు అంచనా కడుతున్నారు. ఇక కాంగ్రెస్ కి క్యాడర్ బాగా ఉంది. గ్రౌండ్ లెవెల్ లో పార్టీ పటిష్టంగా ఉంది. లేనిదల్ల నేతలలో ఐక్యత. ఆ సమస్య అలా ఉంటే ఇపుడు సాటి విపక్షం బేజేపీ కూడా కాంగ్రెస్ మీదనే గురి పెట్టి ఆరోపణలు చేస్తోంది. బీయారెస్ లో సుదీర్ఘ కాల్మ ఉండి బీజేపీలోకి వచ్చిన ఈటెల రాజేందర్ తాజాగా రేవంత్ రెడ్డి మీద చేసిన సంచలన ఆరోపణలతో ఇపుడు తెలంగాణా రాజకీయం హీటెక్కిపోయింది. భాగ్యలక్ష్మి ఆలయం వద్దకు వచ్చి అమ్మవారి సాక్షిగా తాను బీయారెస్ నేతల నుంచి పైసా కూడా ముట్టలేదని రేవంత్ రెడ్డి కన్నీళ్ళు పెట్టుకుని మరీ ప్రమాణం చేశారు. తన జీవితం వడ్డించిన విస్తరి అన్నారు. తాను కేసీయార్ ఎన్ని బాధలు పెట్టినా పంటి బిగువున భరించాను అని ఆయన అన్నారు. గడచిన తొమ్మిదేళ్ళుగా కేసీయార్ పాలన మీద పోరాటం చేస్తూ నిద్ర లేని రాత్రులు ఎన్నో చూశానని రేవంత్ అన్నారు. తనను కేసీయార్ నిలువెత్తు ధనం పోసినా తన వెంట్రుక కూడా కొనలేరని హాట్ కామెంట్స్ చేశారు.కేసీయర్ ఫ్యామిలీతో రెండు తరాలుగా పోరాడుతున్నానని మరో నాలుగు తరాలు వచ్చినా పోరాడుతాను అని రేవంత్ రెడ్డి అంటున్నరు. తన మీద ఈటెల చేసిన ఆరోపణలు వెనక్కి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. తాను పాతిక కోట్లు కేసీయార్ నుంచి తీసుకున్నానని నిరూపించకపోతే ఆయన క్షమాపణ చెప్పాలని కోరారు. తన కంట నీరు తెప్పించిన ఈటెల చేస్తున్నది ఫక్తు నీచ రాజకీయం అని రేవంత్ దుయ్యబెడుతున్నారు. ఇక్కడ చూస్తే రేవంత్ కేసీయార్ కి వ్యతిరేకం అలాగే ఈటెల కూడా వ్యతిరేకం. నిజానికి ఈ ఇద్దరూ కలసి కేసీయార్ పాలన మీద పోరాడాలి. కానీ జరుగుతుంది వేరు. రేవంత్ రెడ్డి మీద ఈటెల ఆరోపణలు చేస్తే రేవంత్ ఈటెల మీద చేస్తున్నారు. ఈ మొత్తం ఎపిసోడ్ లో ఫుల్ ఖుషీ అవుతోంది మాత్రం కచ్చితంగా కేసీయార్ అనే చెప్పాలి. అధికారం కోసం పోటీ పడుతూ ప్రతిపక్షాలు రెండూ పరస్పరం విమర్శలు చేసుకోవడం అంటే అది బీయారెస్ కి సరిగ్గా ఈ టైం లో కలసివచ్చే పరిణామం అంటున్నారు. దీని మీద బీజేపీ నేత విజయశాంతి కూడా ఒక సలహా ఇస్తూ ఇద్దరు నేతలూ కేసీయార్ మీద పోరాటం చేయాలని అన్నారు. అలా కాకుండా ఎవరిని వారు విమర్శలు చేసుకుంటే అది బీయారెస్ కే లాభం అని అంటున్నారు. నిజానికి వచ్చే ఎన్నికల్లో జరగబోయేది అదే అని బీయారెస్ అంచనా కడుతోంది. విపక్షాల మధ్య ఉన్న భయంకరమైన చీలిక వల్ల సులువుగా తాము మూడవసారి అధికారంలోకి వస్తామని ధీమాను వ్యక్తం చేస్తోంది. కాంగ్రెస్ కి ఒక ఆశ అయితే ఉంది. కర్నాటక ఎన్నికల్లో ఆ పార్టీ విజయం సాధిస్తే దాని ప్రభావం కచ్చితంగా తెలంగాణా మీద ఉంటుంది. పక్కనే ఉన్న తెలంగాణాను అన్ని రకాలుగా ఆదుకునేందుకు రాజకీయంగా దన్నుగా నిలిచేందుకు కర్నాటక కాంగ్రెస్ నేతలు ముందుకు వస్తారు. దాంతో అనైక్యంగా ఉన్న కాంగ్రెస్ అప్పటికి సర్దుకుని ముందుకు దూసుకుని వస్తే కచ్చితంగా ఓట్ల చీలిక లేకుండా జనాలు తీర్పు ఇచ్చే చాన్స్ ఉంటుందని అంటున్నారు. చూడాలి మరి ఏమి జరుగుతుందో.

# సంపాదకీయం

## వడగాల్పుల్లో తెలుగు రాష్ట్రాలు స్థానం ఎక్కడ?

వేసవి వచ్చిందంటే మండే ఎండలు ఒక ఎత్తు అయితే.. చెట్టంత మనిషిని కుదేలు చేసి.. నీరసంతో వడలిపోయేలా చేసే వాటిల్లో వడగాల్పుల తీవ్రత కీలక భూమిక పోషిస్తుంది. పర్యావరణం మీద మన దేశ ప్రజలకున్న అవగాహనారాహిత్యానికి.. ప్రభుత్వాల ప్రాధాన్యతలేమికి మూల్యం చెల్లించే పరిస్థితుల్లోకి ఇప్పుడు మనం చేరుకున్నాం. మనం చేసిన తప్పులకు శిక్షలు అనుభవించే టైం వచ్చేసింది. గతంతో పోలిస్తే దేశంలో వడగాల్పులు.. అధికఉష్ణోగ్రతలు నమోదు కావటం లాంటివి ఈ మధ్యన ఎక్కువ అవుతున్నాయి. దీనికి తోడు పెరిగిన వాయు కాలుష్యం.. హిమాలయ పర్వత ప్రాంతాల్లో మంచుకొండలు కరిగిపోవటం లాంటి పరిణామాలు తీవ్రమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. ఇప్పటికే పరిస్థితి ఇబ్బందికరంగా ఉంటే.. రానున్న రోజుల్లో వీటి తీవ్రత మరింత ఎక్కువ అవుతుందన్న విషయాన్ని తాజాగా వెల్లడైన ఒక అధ్యయనం స్పష్టం చేస్తోంది. 2050 నాటికి ఈ సమస్య తీవ్రత మరింత ఎక్కువ అవుతుందని కేంబ్రిడ్జి వర్సిటీ చేసిన అధ్యయనం వెల్లడించింది. దేశంలోని 80శాతానికి పైగా ప్రజలు ఎండ తీవ్రతతో పాటు వడగాల్పుల ప్రభావాన్ని ఎదుర్కొంటున్నారు. రానున్న రోజుల్లో ఈ పరిస్థితి మరింత ఎక్కువ అవుతుందని.. ధీని కారణంగా వ్యవసాయ దిగుమతుల మీద.. కార్మికుల సామర్థ్యం మీద పడుతుందని చెబుతున్నారు. 1992 నుంచి దేశంలో వడగాల్పుల కారణంగా ప్రాణాలు కోల్పోయిన వారి సంఖ్య 24వేలుగా ఉంది. ఇది కూడా అధికారిక లెక్కల ప్రకారం. అనధికారికంగా ఇది మరింత ఎక్కువగా ఉంటుందని చెబుతున్నారు. ఉష్ణోగ్రతలు పెరగట.. వడగాల్పుల తీవ్రత ప్రజల జీవన ప్రమాణాల్ని దెబ్బ తీయటతో పాటు.. వారి సామర్థ్యం మీదా ప్రభావాన్ని చూపుతుంది. కార్మికులకు ఇది మరింత కష్టకాలం. 2050 నాటికి వీటి ప్రభావం 31-48 కోట్ల మంది ప్రజల జీవనం మీద పడుతుందని అంచనా వేస్తున్నారు. 2019-21లోని మూడేళ్లల కాలంలో వాతావరణ పరిస్థితుల సూచీలో భారత్ వెనుకబడి ఉంది. గత ఏడాది విషయానికే వస్తే జనవరి నుంచి అక్టోబరు వరకు 273 రోజుల్లో 242 రోజులు తీవ్రమైన వాతావరణ ఒడిదొడుకులు ఉన్నాయి. అంతే.. దాదాపు ప్రతి రోజు ఏదో ఒక ప్రాంతంలో ఏదో ఒక సమస్య ఉన్నట్లే. ఒకచోట వడగాల్పులు.. మరోవైపుచలిగాలులు.. ఇంకోవైపు భారీ వరదలు.. ఈశాన్యంలో కొండ చరియలు విరిగి పడటంలాంటివి ఏవో ఒకటి చోటుచేసుకుంటూనే ఉంటున్నాయి. దేశంలోని 90 శాతం భూభాగంలో వడగాల్పులతో ప్రమాదకర పరిస్థితిని ఎదుర్కొంటూ ఉంటే.. మిగిలిన పది శాతం తీవ్రమైన వాతావరణ సమస్యల్ని ఎదుర్కొంటున్నట్లుగా పేర్కొన్నారు. దేశంలోని ఈశాన్య రాష్ట్రాల్లోని వాతావరణ సమస్యల ప్రభావం చాలా ఎక్కువగా ఉంది. పెరుగుతున్న ఉష్ణోగ్రతలు.. వడగాల్పుల ప్రమాదం ఎక్కువగా పొంచి ఉన్న రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానంలో ఉండగా తెలంగాణ నాలుగో స్థానంలో నిలిచింది. రెండో స్థానంలో పశ్చిమ బెంగాల్ ఉండగా.. మొదటి పది స్థానాల్లో దక్షిణాదికి చెందిన తమిళనాడు.. కేరళ రాష్ట్రాలు ఉండటం గమనార్హం. ఇప్పటికే పరిస్థితి ఇలా ఉంటే 2100నాటికి దేశంలో తరచూ వరదలు.. తుపాన్లు.. వడగాల్పులు.. సముద్రమట్టాలు పెరగటం లాంటి వాతావరణ సమస్యలు ఎక్కువగా ఉంటాయనిఅంచనా వేస్తున్నారు.

# సర్కారులో.. ప్రసవ వేదన




మంచిర్యాల : సర్కారు సేవలకు వైద్యుల కొరత తలనొప్పిగా మారింది. ముఖ్యంగా ప్రసూతి విభాగానికి సరిపడా వైద్యురాళ్లు లేక పెద్దాసుపత్రి అవస్థలు పడుతోంది. ఓ వైపు ఆరోగ్యశాఖ మంత్రి సర్కారు దవాఖానాల్లో ప్రసవాలు పెంచాలని, సాధారణ కాన్పులకే మొగ్గు చూపాలని పదేపదే హెచ్చరిస్తున్నారు. దీంతో వైద్యులకు శస్త్రచికిత్సలు చేయాలంటే వణుకు పుడుతోంది. తప్పనిసరి సాధారణ ప్రసవం కోసం వేచిచూస్తే ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇందుకు ఇటీవల పెద్దాసుపత్రిలో జరిగిన ఒకే(సాధారణ) ప్రసవంలో ముగ్గురు జన్మించి చనిపోవడం, రెండురోజుల కిందట కూడా శస్త్రచికిత్స చేయాలని సూచించినా సాధారణం కోసం వేచిచూసి తమ పాప మృతికి కారణమయ్యారంటూ బాధితులు ఆందోళన చేపట్టడం నిదర్శనం. దీంతో ప్రసూతి వైద్యురాళ్ల పరిస్థితి ముందు నుయ్యి వెనుక గొయ్యి మాదిరిగా మారి తీవ్ర ఒత్తిడికి లోనవుతున్నట్లు తెలుస్తోంది. దీంతో పలువురు రాజీనామా చేయగా, మరో ఇద్దరు ఇతర కారణాలతో వెళ్లిపోయారు

**పని ఒత్తిడే కారణమా..?**

జిల్లా ఆసుపత్రిలో మొత్తం ప్రసూతి వైద్యులు తొమ్మిదిమంది ఉండగా.. ప్రస్తుతం ఐదుగురు మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారు. ఇందులో ఒకరు పూర్తిగా ఓపీ సేవలకే పరిమితం కావడంతో మిగతా నలుగురు ప్రసవాల (సాధారణ, శస్త్రచికిత్స) సేవలు అందిస్తున్నారు. పెద్దఎత్తున గర్భిణులు ఇక్కడికే వస్తుండటంతో పెద్దాసుపత్రి, ఇక్కడి వైద్యులపై తీవ్ర భారం పడుతోంది. తొమ్మిది మంది చేసే పనిని ప్రస్తుతం నలుగురు నిర్వర్తిస్తున్నారు. ఓ వైపు ఆరోగ్యశాఖ నుంచి సాధారణ ప్రసవాలు చేయాలంటూ ఒత్తిడి, మరోవైపు బాధితుల ముహూర్తాలకు అనుగుణంగా, నొప్పులు తట్టుకోలేమంటూ శస్త్రచికిత్స చేయాలంటూ డిమాండ్ చేయడంతో వైద్యులు నలిగిపోతున్నట్లు తెలుస్తోంది. దీంతో ఉద్యోగాలకు రాజీనామాలు చేస్తున్నట్లు సమాచారం. ఇటీవల విధుల నుంచి తప్పుకున్న వారిలో ఒకరు స్వచ్ఛంద పదవి విరమణ చేయగా, మరొకరు ఆంధ్రప్రదేశ్‌కు బదిలీ అయ్యారు. మరో ఇద్దరు పని ఒత్తిడితోనే రాజీనామా చేసినట్లు ఇక్కడి సిబ్బంది తెలుపుతున్నారు.

**అన్నిదారులు జిల్లా ఆసుపత్రి వైపే..**

పెద్దాసుపత్రిలో తప్ప జిల్లా వ్యాప్తంగా ఎక్కడ కూడా ప్రసూతిసేవలకు సరియైన సదుపాయాలు లేవు. నలుదిక్కులు..కాగజ్‌నగర్, ఆసిఫాబాద్, జన్నారం, సిరోంచకు చెందిన గర్భిణులందరు మంచిర్యాలకు రావాల్సిందే. మూడు సీహెచ్‌సీలు ఉన్నా సేవలు అందడం లేదు. బెల్లంపల్లిలో ఒకే ప్రసూతి వైద్యురాలితో నెట్టుకొస్తుండగా, లక్షెట్టిపేట, చెన్నూరులో ఒక్కరు కూడా లేరు. ప్రతిచోట సుమారు 30 పడకల సామర్థ్యం ఉన్నా చికిత్స అందించే వైద్యులు లేకపోవడం ఇబ్బందికరంగా మారింది. దీంతో ఆయా ప్రాంతాల భారమంతా జిల్లా ఆసుపత్రిపై పడుతుండటంతో ఇక్కడ పనిచేసే ప్రసూతి విభాగం సిబ్బంది అవస్థలు పడాల్సివస్తోంది.

**నియామకాలు చేపడతాం**

**డా.అరవింద్, జిల్లా ఆసుపత్రి పర్యవేక్షణాధికారి**

ప్రసూతి వైద్యురాళ్ల కొరత తీవ్రంగా ఉంది. ఒకేసారి నలుగురు వెళ్లిపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వారు ఏ కారణంతో రాజీనామా చేసినా ప్రస్తుతం మాత్రం మిగతా వారికి భారంగా మారడంతో పాటు ఒత్తిడి పెరుగుతోంది. పాలనాధికారి దృష్టికి తీసుకెళ్లి సంబంధిత వైద్యురాళ్ల నియామకానికి చర్యలు తీసుకుంటాం.

# అక్రమాలు దండి.. ఆదాయానికి గండి

ఆసిఫాబాద్:జిల్లాలోని స్థిరాస్తి వ్యాపారులు ఎలాంటి అనుమతులు లేకుండానే వెంచర్లు వేస్తున్నారు. అక్రమంగా విక్రయించిన ప్లాట్లకు అడ్డదారుల్లో గుంటల చొప్పున రిజిస్ట్రేషన్లు సైతం చేయిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. ఈ విషయాలేవీ తెలియని అమాయకులు రియల్టర్ల మాటలు నమ్మి ప్లాట్లు కొనుగోలు చేసి జేబులు గుల్ల చేసుకుంటున్నారు. వ్యవసాయ భూములను ప్లాట్లుగా విక్రయించి, వీటిని తహసీల్దార్ కార్యాలయాల్లో గుంటల చొప్పున రిజిస్ట్రేషన్ చేయించి, ఒకటి రెండు రోజుల్లోనే నాలా అనుమతులు వచ్చేలా చేస్తున్నారు. పైకి అంతా బాగున్నా ఇళు నిర్మించుకునే సమయంలో ప్లాట్ల మధ్య సరిహద్దు విషయంలో కొనుగోలుదారులు నానా అవస్థలు పడుతున్నారు.ప్రస్తుతం లింక్ డాక్యుమెంట్ ప్లాట్లకే పట్టణ ప్రణాళిక విభాగం(డీటీసీపీ) ద్వారా రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్‌ను తహసీల్దార్ కార్యాలయాల్లో చేస్తున్నారు. ధరణి వచ్చాక, అక్రమ లే అవుట్లపై ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవడంతో రియల్టర్లు కొత్త మార్గం ఎంచుకుంటున్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో వ్యవసాయ భూముల్లో ఇబ్బడిముబ్బడిగా ప్లాట్లు వేస్తున్నారు. డీటీసీపీ అనుమతులు ఏవీ లేకుండానే కోర్టు ఉత్వర్వులు ఉన్నాయని నమ్మబలుకుతూ ప్లాట్లు విక్రయిస్తున్నారు. ఈ తతంగం ఆసిఫాబాద్‌లో జిల్లా కేంద్రంతో పాటు, కాగజ్‌నగర్ పట్టణం బోరిగాం, బారేగూడ శివారు ప్రాంతంలో, రెబ్బెన, వాంకిడి, మండలాల్లో జోరుగా సాగుతోంది.

**స్టాంప్‌డ్యూటీ ఎగ్గొడుతున్నారు..**

ప్రభుత్వానికి స్టాంప్‌డ్యూటీ ఎగ్గొట్టడంతోపాటు, డీటీసీపీ నిబంధనలేవి పాటించకుండా, స్థిరాస్తి వ్యాపారులు ఈ దందా నడిపిస్తున్నారు. రిజిస్ట్రేషన్‌కు మార్కెట్ విలువలో ఏడున్నర శాతం చెల్లించాల్సి ఉంటుంది. ఉదాహరణకు రెబ్బెన మండలంలోని ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న నివాస ప్రాంతంలో నాలుగు గుంటల భూమికి మార్కెట్ విలువ రూ.2.42 లక్షలు ఉంటుంది. ఇందులో స్టాంప్‌డ్యూటీ రూ.15 వేల వరకు చెల్లించాలి. కానీ వ్యవసాయ భూమిగా చూపుతూ గుంటల్లో రిజిస్ట్రేషన్ చేస్తున్నందున ప్రభుత్వానికి వీరు రూ.500వరకే చెల్లిస్తున్నారు. ఈ విధంగా ప్రభుత్వానికి ఏటా రూ.కోట్లలో గండి పడుతోంది. సంవత్సరంలో వేలాది ప్లాట్ల రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి.

**లేని ఇళ్లకు ఇంటి నెంబర్లు..**

ఇళ్లు నిర్మించకున్నా.. భూ యజమానులకు ఇంటి నెంబర్లను కేటాయిస్తున్నారు పంచాయతీ అధికారులు. జిల్లా వ్యాప్తంగా ఈ దందా జోరుగా నడుస్తోంది. అయినకాడికి వసూలు చేసి, నంబర్లు ఇవ్వడం వల్ల అక్రమ ప్లాట్లకు సైతం రిజిస్ట్రేషన్‌లు జరుగుతున్నాయి. మరోవైపు జిల్లా కేంద్రంలో నిబంధనలకు విరుద్ధంగా నాలుగు, అయిదు అంతస్థుల భవనాలను కడుతున్నా పంచాయతీ సిబ్బంది 'మామూలు'గా వ్యవహరిస్తున్నారు.

వాంకిడి మండలంలో 16, 66 సర్వే నంబర్లలో ప్లాట్లకు గుంటల చొప్పున రిజిస్ట్రేషన్లు చేస్తున్న తీరు. వాస్తవంగా ఇక్కడ వ్యవసాయ భూమి లేదు. అంతా ఖాళీ ప్లాట్లే. ఈ మండలంలో వందలాది ప్లాట్లు ఇదే విధంగా రిజిస్ట్రేషన్ చేస్తున్నారు.

ఇల్లు కట్టుకోవాలంటే...గుంటల చొప్పున భూములు తీసుకున్న ప్రజలు ఆయా స్థలాల్లో ఇళ్లు కట్టుకోవాలంటే మళ్లీ నాలా అనుమతులు తీసుకోవాల్సిందే. ఎల్‌ఆర్ఎస్ రుసుంతో పాటు, అదనంగా ప్లాట్ విలువలో 30 శాతం కంపోడింగ్ రుసుం కట్టాల్సి ఉంటుంది. ఇంత చేసినా ఈ ప్రదేశంలో కనీస సౌకర్యాలైన రహదారులు ఉండవు. సరిహద్దు వివాదాలు నిత్యం రాజకుంటూ ఉంటూనే ఉంటాయి.


# చింతలు తీర్చని ఇంకుడుగుంతలు

నిర్మల్ : పట్టణాల్లో జనాభా పెరిగిపోవడంతో శివారు ప్రాంతాలు నివాస కేంద్రాలుగా మారుతున్నాయి. ఏటా వందల సంఖ్యలో ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయి. ప్రతి ఇంట్లో బోరు తవ్వుతుండటంతో భూగర్భ జలాల వినియోగం ఎక్కువవుతోంది. కానీ వృథా నీటిని భూమిలోకి ఇంకించే చర్యలు చేపట్టని కారణంగా భూగర్భ జలాలు ఏటా తగ్గుతున్నాయి. ఇంటి నిర్మాణ సమయంలోనే ఇంకుడుగుంత తవ్వుకోవాలనే నిబంధన ఉన్నా.. నిర్మల్, భైంసా, ఖానాపూర్ పట్టణాల్లో అమలు కావడం లేదు. వీటి నిర్మాణాల పేరిట రూ.లక్షలు వసూలు చేస్తున్నా, నిర్మాణాలపై 'పుర' అధికారులు నిర్లిప్తత చూపిస్తున్నారు. దీంతో సదరు ఇంటి యజమానులు నిర్మించుకునేందుకు ముందుకురావడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం జలవిధానం ముసాయిదాలో పట్టణాల్లో ఇంకుడుగుంతల నిర్మాణం తప్పనిసరిగా చేర్చినా.. ప్రయోజనం కనిపించడం లేదు.

ఇదీ పరిస్థితి.. పట్టణాల్లో ఏటా వందల సంఖ్యలో ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నా.. ఇంకుడుగుంతలను విస్మరిస్తున్నారు. ఫలితంగా భూగర్భజలాలు పడిపోయి నీటి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. గృహ నిర్మాణ అనుమతి సమయంలో ఇంకుడుగుంత నిర్మాణానికి పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు అదనంగా ఆర్‌డబ్ల్యూహెచ్‌ఎస్ కింద ప్రతి చదరపు మీటరుకు రూ.15 చొప్పున డిపాజిట్లు తీసుకుంటారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి ఎంతలేదన్నా (స్థల విస్తీర్ణం ప్రకారం) కనీసం రూ.2 వేల వరకు డిపాజిట్ల పేరిట వసూలు చేస్తున్నారు. అనుమతి తీసుకున్న నిర్మాణదారుడు ఆ ఇంకుడుగుంత తవ్వుకుంటే.. వాటిని అధికారులు పరిశీలించి తిరిగి ఆ డిపాజిట్ నగదును సదరు నిర్మాణదారుడికి ఇవ్వాల్సి ఉంటుంది. కానీ జిల్లాలో ఎక్కడా ఇలా జరగడం లేదు.

లి మార్చి 2019 నుంచి మార్చి 2022 వరకు.. నిర్మల్‌లో 1,150 వరకు గృహ నిర్మాణాలు జరిగినట్లు రికార్డులు చెబుతున్నాయి. ఈ లెక్కన మూడేళ్లలో ఇంకుడుగుంతల కోసం రూ.23 లక్షలు వసూలు చేశారు. ఇలా భైంసా, ఖానాపూర్ పట్టణాల్లోనూ కొత్తగా నిర్మించుకునే వారి నుంచి డిపాజిట్ పేరిట డబ్బులు వసూలు చేశారు.

**లేఖ రాసినా ప్రయోజనం శూన్యం**



పట్టణాల్లోని ఇళ్లల్లో ఇంకుడుగుంతలు తవ్వుకోవాలని ఇటీవల భూగర్భ జలశాఖ అధికారులు ఆయా మున్సిపల్ కమిషనర్లకు లేఖలు రాశారు. ప్రస్తుత సమయంలో వీటిని తవ్విస్తే రానున్న వర్షాకాలంలో వాన నీరు భూమిలోకి ఇంకే అవకాశం ఉంటుందని, కొత్తగా నిర్మించే ప్రతి ఇంట్లోనూ వీటిని నిర్మించేలా చర్యలు చేపట్టాలని ఆ లేఖలో పేర్కొన్నా.. క్షేత్రస్థాయిలో మాత్రం కనిపించడం లేదు.

**అవగాహన కల్పిస్తున్నాం**

**నవీన్‌కుమార్, టీపీఎస్, నిర్మల్**

కొత్తగా నిర్మిస్తున్న ఇళ్లల్లో ఇంకుడుగుంతల తవ్వుకోవాలని అవగాహన కల్పిస్తున్నాం. భవన నిర్మాణ అనుమతులు తీసుకునే సమయంలో వీటి ప్రాధాన్యతను వివరిస్తున్నాం. నీటి ఆవశ్యకత తెలుసుకున్న యజమానులు వాటిని నిర్మించుకోవడానికి ఆసక్తి చూపిస్తున్నారు.

# రిమ్స్‌లో దాహం.. దాహం

ఆదిలాబాద్: ఆదిలాబాద్ పెద్దాసుపత్రి రిమ్స్ ఆసుపత్రికి నిత్యం 500లకుపైగా రోగులు, వారితో మరో 500 నుంచి 600 మంది సహాయకులు ఉంటారు. ఇంత పెద్ద ఆసుపత్రిలో తాగు నీటి వ్యవస్థ లేక రోగులు, వారి సహాయకులు అల్లాడిపోతున్నారు. రోగులు వారి సహాయకుల కోసం మొదటి అంతస్తులో శుద్ధ జల ప్లాంటును ఏర్పాటు చేశారు. కానీ అది మరమ్మతులకు గురవడంతో తాగు నీరు అందుబాటులో లేకుండా పోయింది. దాహం వేస్తే పైఅంతస్తుల నుంచి కింద అత్యవసర విభాగం ముందు స్వచ్ఛంద సంస్థల వారు ఏర్పాటు చేసిన చలివేంద్రం, శుద్ధ జల ప్లాంటు నుంచి సీసాల్లో నీటిని నింపుకొని వెళ్లాల్సి వస్తోంది. ఆసుపత్రిలో ఉన్న నాలుగు లిఫ్ట్‌లు పని చేయటం లేదు. పగలు ఎండ సమయంలో పైఅంతస్తు నుంచి కిందకి వచ్చి సీసాల్లో నీళ్లు తీసికెళ్లేందుకు అపసోపాలు పడుతున్నారు.

**నిరుపయోగంగా శుద్ధ జల ప్లాంటు**

రిమ్స్‌లో రోగులు, వారి సహాయకుల కోసం బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు రెండేళ్ల కిందట అందుబాటులోకి తీసుకొచ్చిన శుద్ధ జల ప్లాంటు ఇది. ప్రస్తుతం పాడైంది. మరమ్మతులు చేస్తే రోగులు, వారి సహాయకుల దాహం తీర్చటానికి ఇది ఎంతగానో ఉపకరిస్తుంది.

**ఇందులో నుంచి నీళ్లు రావు**

రిమ్స్‌లో శుద్ధ జలప్లాంటు వద్ద నీటిని పట్టుకోవటానికి గోడకు ఏర్పాటు చేసిన కళాయి(నల్లా) ఇది. దాహం తీర్చుకోవటానికి అక్కడికి వెళ్లి కుళాయి తిప్పితే నీళ్లు రాకా నిరాశగా వెనక్కి వెళ్లిపోతున్నారు.

**చలివేంద్రమే దిక్కు**

రిమ్స్‌లోని అత్యవసర విభాగం ఎదుట స్వచ్ఛంద సంస్థ వారు ఏర్పాటు



చేసిన శుద్ధ జల చలివేంద్రం ఇది. అక్కడే మైనారిటీ ఉద్యోగుల సంక్షేమం సంఘం ఏర్పాటు చేసిన మరో శుద్ధ జల ప్లాంటు సైతం ఉంది. రిమ్స్‌లోని రోగులు, వారి సహాయకులు, సందర్శకులు దాహం తీర్చుకోవటానికి ఈ చలివేంద్రం, శుద్ధ జల ప్లాంటును ఆశ్రయించాల్సి వస్తోంది.

**సీసాల్లో పట్టుకెళ్లాల్సిందే**

రిమ్స్ ఆసుపత్రిలో గ్రౌండ్ ఫ్లోర్ కాకుండా మూడు అంతస్తులు ఉన్నాయి. ఏ అంతస్తులోని వారికైనా దాహం వేస్తే కిందనున్న చలివేంద్రం లేదా శుద్ధ జలప్లాంటుకు వచ్చి తాగు నీటిని తీసుకెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. మూడో అంతస్తులోని వారైనా సరే రాత్రి పూట కూడా కింద నుంచి సీసాల్లో తాగు నీటిని తీసుకెళ్లక తప్పటం లేదు.

**ఇంటి నుంచే నీళ్ల డబ్బాలు**

రిమ్స్‌లో తాగు నీటి సౌకర్యం లేక ప్రసవం కోసం వచ్చిన గర్భిణి ఇలా చల్లటి నీటి కోసం ఇంటి నుంచే నీటి డబ్బాను తెచ్చుకొంది. నీళ్లు అయిపోగానే మళ్లీ ఇంటి నుంచి నీళ్లను తెచ్చుకున్నట్లు ఆమె కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.

**నీటిని పరీక్షల కోసం పంపించాం**

**రాథోడ్ జైసింగ్, రిమ్స్ సంచాలకుడు**

శుద్ధ జలప్లాంటుకు సరఫరా అయ్యే నీళ్ల నమూనాలను పరీక్షల కోసం ల్యాబ్‌కు పంపించాం. ఆ ఫలితాల ఆధారంగా ఈ ప్లాంటు నుంచి నీటిని సరఫరా చేసి రోగులు, వారి సహాయకులకు తాగు నీటి ఇబ్బందులను తొలగిస్తాం.

# బోధకుల కొరత... విద్యార్థుల వెత

మంచిర్యాల : ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థలో చేరితే అయితే ఉద్యోగం, లేదంటే స్వయం ఉపాధి లభిస్తుందన్న భరోసాతో చేరిన విద్యార్థులకు నిరాశే ఎదురవుతోంది. ఎంచుకున్న ట్రేడ్‌లో ప్రవేశం పొందినా, బోధించేవారు లేక, పరీక్షలు సమీపిస్తుండటంతో మరింత ఆందోళన చెందుతున్నారు ఆదిలాబాద్ ప్రభుత్వ ఐటీఐ కళాశాల విద్యార్థులు.విశాలమైన గదులు, మైదానంలో విద్యార్థులతో కళకళలాడాల్సిన ఐటీఐ కళాశాల వెలవెలబోతోంది. ఇక్కడ స్వయం ఉపాధితో పాటు ప్రభుత్వ రంగ సంస్థల్లో ఉద్యోగం సాధించేలా ఆరు ట్రేడ్లు అందుబాటులో ఉన్నాయి. ఎలక్ట్రీషియన్, డీఎం సివిల్, డ్రెస్‌మేకింగ్, స్టెనో, కోపా ట్రేడ్‌లలో మొత్తం 220మంది ప్రవేశం పొందారు. నిన్న మొన్నటి వరకు వరకు బోధకులు, అతిథి అధ్యాపకులు పనిచేసినా.. జీవో 317 బదిలీల్లో కొందరు, ఇతర కారణాలతో మరికొందరు బోధకులు కళాశాలను వదిలి వెళ్లడంతో విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. బోధన విభాగంలో తొమ్మిది పోస్టులకుగాను ప్రిన్సిపల్ ఒక్కరే రెగ్యులర్. టెక్నికల్ ఆఫీసర్ డిప్యూటేషన్‌పై ఇక్కడ పనిచేస్తున్నారు. అంటే మొత్తం ఏడు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. విద్యార్థుల సంఖ్య తగ్గిపోయి గదులకు తాళాలు కనిపిస్తున్నాయి. బోధకులను నియమించి తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

**తాత్కాలిక చర్యలు తీసుకుంటున్నాం**

**– సీతారాములు, ఆర్‌డీడీ, ఐటీఐ**

కళాశాలల్లో బోధకుల కొరతను అధిగమించేలా తాత్కాలిక చర్యలు తీసుకుంటున్నాం. నిపుణులతో మల్టీమీడియా తరగతులు నిర్వహిస్తున్నారు. ఖాళీలు భర్తీ అయ్యేలా కూడా ప్రతిపాదనలు ప్రభుత్వానికి నివేదించాం. ఉట్నూరుకు బదిలీ అయిన బోధకురాలిని తిరిగి ఆదిలాబాద్‌కు రప్పించే ఏర్పాట్లు చేస్తాం.

**బోధకుల కోసం నిరీక్షణ.!**

వీరంతా డ్రెస్ మేకింగ్ ట్రేడ్‌లో చేరిన బాలికలు. టైలరింగ్ యంత్రాలపై కుట్లు, అల్లికలు వంటివి నేర్చుకోవాల్సిన వీరు బోధకులు లేక ఇలా వచ్చి తరగతి గదిలో కూర్చుండి వెళ్తున్నారు. ఇక్కడ పనిచేసే బోధకురాలు ఉట్నూరు కళాశాలకు బదిలీ అయ్యారు. విచిత్రమేటంటే అక్కడ కోర్సు లేకున్నా ఆమె 317జీవో కింద స్థానచలనం కల్పించడంతో విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

**కంప్యూటర్ ల్యాబ్‌కు తాళం!**కోపా ట్రేడ్‌కు మార్కెట్‌లో డిమాండ్ ఉండటంతో.. 40మంది ఇందులో చేరారు. బోధకులు లేకపోవడంతో కంప్యూటర్ గదికి తాళం వేసి ఉంచుతున్నారు. విద్యార్థులు థియరీ తరగతులు వింటూ ప్రయోగ తరగతులకు దూరమవుతున్నారు.

**ఆరు ట్రేడ్లు.. ఏడు ఖాళీలు**

ఇది జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ(ఐటీఐ కళాశాల). ఇక్కడ ఆరు ట్రేడ్లు ఉండగా.. ప్రిన్సిపల్ ఒక్కరే పనిచేస్తున్నారు. ట్రైనింగ్ ఆఫీసర్ డిప్యూటేషన్‌పై పనిచేస్తుండగా.. మిగిలిన ఆరు డిప్యూటీ ట్రైనింగ్ ఆఫీసర్లు, ఒక టెక్నికల్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అతిథి అధ్యాపకులు సైతం వేతనం తక్కువ కావడంతో వారూ వెళ్లిపోయారు.

**ఆన్‌లైన్ బోధనతో సరి**

ఆయా ట్రేడ్ల విద్యార్థులకు షెడ్యూల్ వారీగా ప్రసారమయ్యే మల్టీమీడియా (ఆన్‌లైన్) తరగతులు వినిపిస్తున్నారు. నెట్‌వర్క్ సమస్యతో సరిగ్గా అర్థం కావడంలేదని విద్యార్థులంటున్నారు.

# వేసవి శిబిరం.. భవిష్యత్తు పదిలం

కరీంనగర్ : వేసవి శిక్షణ శిబిరంలో నేర్చుకున్న క్రీడలు ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేస్తున్నాయి. కాలక్షేపంగా నేర్చుకున్న క్రీడలను తమ భవిష్యత్తుగా మలుచుకుని క్రీడాకారులు ముందుకు సాగుతూ రాష్ట్ర, జాతీయ స్థాయిలో సత్తా చాటుతున్నారు. స్పోర్ట్స్ కోటా ఉద్యోగం సాధిస్తున్నారు.

గ్రాండ్ మాస్టర్

కరీంనగర్‌లోని రాంచంద్రాపూర్ కాలనీకి చెందిన సి. హెచ్.ప్రసాద్, అపూర్వల కుమారుడు శ్రీశౌనక్ చంద. కరీంనగర్‌లో 2019లో జరిగిన వేసవి శిబిరంలో మొదటిసారిగా చదరంగంలో ఓనమాలు దిద్దాడు. అనంతరం కలిగిన ఆసక్తితో చెస్ అకాడమీలో కంకటి అనూప్ వద్ద శిక్షణ పొందాడు. క్రీడాకారులకు, గ్రాండ్ మాస్టర్‌కు లభించే గుర్తింపు తెలుసుకుని గ్రాండ్ మాస్టర్ లక్ష్యంగా హైదరాబాద్‌లో శిక్షణ పొందుతున్నాడు. 2021లో జరిగిన ఇంటర్నేషనల్ ఫిడే ర్యాంకింగ్ పోటీల్లో 1,365వ ర్యాంకు సాధించాడు. 2020లో అండర్ 11 ఏకగ్ర ఫిడే రేటింగ్ టోర్నమెంట్‌లో మూడో స్థానంలో నిలిచాడు. విశాఖపట్నంలో జరిగిన ఫిడే రేటింగ్‌లో మొదటి స్థానంలో నిలిచాడు. గ్రాండ్ మాస్టర్ లక్ష్యంగా చదరంగం నేర్చుకుంటున్నట్లు శ్రీశౌనక్ చంద తెలిపాడు.

అంతర్జాతీయ స్థాయిలో రాణింపే లక్ష్యం

కరీంనగర్‌లోని కాపువాడకు చెందిన పయ్యావుల ఆంజనేయులు–ఉమ దంపతుల కుమార్తె లహరిక కరీంనగర్‌లోని అంబేద్కర్ స్టేడియంలో 2018లో నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరంలో యోగా సాధన ప్రారంభించింది. యోగా సాధనను నిత్య కృత్యం చేసుకుని కిష్టయ్య, మల్లిక వద్ద శిక్షణ పొందుతూ జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ చాటింది. 2020 జనవరి 5న కరీంనగర్‌లో జరిగిన రాష్ట్రస్థాయి యోగా ఛాంపియన్‌షిప్‌లో బంగారు పతకం సాధించింది. 2018 కరీంనగర్ జిల్లా యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి యోగా ఛాంపియన్ షిప్‌లో బంగారు పతకం సాధించింది. అంతర్జాతీయ స్థాయిలో రాణించి యోగాలో శిక్షణ ఇవ్వాలన్నదే తన లక్ష్యమని చెబుతోంది లహరిక.

స్పోర్ట్స్ కోటాలో కొలువు

కరీంనగర్‌లోని భగత్‌నగర్‌కు చెందిన ఎస్.రఘురామ్ కిరణ్, జయశ్రీల కుమారుడు అభివర్ష్ 8వ తరగతిలో కరీంనగర్‌లోని ఈత కొలనులో 2010లో జరిగిన వేసవి శిక్షణ శిబిరంలో ఈత నేర్చుకున్నాడు. అప్పటి శిక్షకులు, ప్రస్తుత జిల్లా యువజన, క్రీడాశాఖ అధికారి కీర్తి రాజు మెలకువలు నేర్పించారు. ఈత క్రీడాకారుడి శరీర ఆకృతి, గుర్తింపు వివరించడంతో శిబిరం పూర్తయిన తర్వాత నిత్యం ఈతలో సాధన చేశాడు. 2014లో 10వ తరగతిలో అభివర్ష్ కేరళలో జరిగిన సౌత్ జోన్ నేషనల్ ఈత పోటీల్లో పాల్గొని సత్తాచాటాడు. 2015లో కలకత్తాలో జాతీయ స్థాయి ఈత పోటీల్లో మూడు బంగారు పతకాలు, 2016 కేరళలలో జాతీయ స్థాయి ఈత పోటీల్లో మూడు బంగారు పతకాలు సాధించాడు. 2017 బెంగళూర్‌లో జూనియర్స్ నేషనల్స్, 2018లో పంజాబ్‌లో జరిగిన ఆల్ ఇండియా విశ్వవిద్యాలయం క్రీడా పోటీల్లో ఓయూ తరఫున పాల్గొని మూడు బంగారు పతకాలు సాధించాడు. 2019లో స్పోర్ట్స్ కోటాలో కానిస్టేబుల్‌గా ఉద్యోగం సాధించి ప్రస్తుతం మంచిర్యాల ప్రత్యేక పోలీసు విభాగంలో ఉద్యోగం నిర్వహిస్తున్నాడు.

జాతీయ కబడ్డీ జట్టులో ఉండాలని..

కరీంనగర్ జిల్లా రామడుగు మండలం తిరుమలాపూర్‌కు చెందిన కాసర్ల రాజయ్య, అంజవ్వల కుమారుడు శివాజి 2018లో కరీంనగర్‌లో జరిగిన వేసవి శిక్షణ శిబిరంలో కబడ్డీ శిక్షణ పొందాడు. అనంతరం మోహన్ వద్ద శిక్షణ పొందాడు. 2019, 2011లో ఉమ్మడి జిల్లాలో జరిగిన కబడ్డీ టోర్నమెంట్‌లో బెస్ట్ రైడర్‌గా గుర్తింపు పొందాడు. కబడ్డీలో భారతదేశం జట్టులో ఆడి మంచి ఆటగాడిగా గుర్తింపు తెచ్చుకోవాలన్నదే తన కోరిక అని శివాజి తెలిపాడు.

# ఎంత తేడా.. ఇదేం దగా!

కరీంనగర్ : వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్ల జారీలో సహకార విద్యుత్తు సరఫరా సంఘం (సెస్) నిలువు దోపిడీకి పాల్పడుతుంది. అన్నదాతల నుంచి వేలాది రూపాయలు వసూలు చేస్తూ వారిపై ఆర్థికభారం మోపుతోంది. ఉత్తర తెలంగాణ విద్యుత్తు సరఫరా సంస్థ (టీఎస్ఎన్‌పీడీసీఎల్) అతి తక్కువ ధరకు ఇస్తున్నా సెస్ మాత్రం భారీగా వసూలు చేస్తుండటంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై అధికారులను పలుమార్లు ప్రశ్నించినా ఫలితం లేదని కర్షకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలోని 13 మండలాల పరిధిలో సెస్ సేవలందిస్తుంది. 2,71,630 మంది వినియోగదారులు ప్రయోజనం పొందుతున్నారు. రోజురోజుకు సెస్ వినియోగదారుల సంఖ్య పెరుగుతూ వస్తోంది. ఎన్‌పీడీసీఎల్ నుంచి కరెంటు కొనుగోలు చేసి వినియోగదారులకు అందిస్తోంది. కొత్త కనెక్షన్లు తీసుకోవాలనుకునే వారు అధికారుల అంచనా మేరకు రుసుం చెల్లించాల్సి ఉంటుంది. మిగతా విద్యుత్తు సరఫరా సంస్థల్లో వ్యవసాయ కనెక్షన్లకు రాయితీలు వర్తిస్తున్నాయి. కానీ ఇక్కడ రైతులే అవసరమైన సామగ్రి, కనెక్షన్ కోసం నిర్దేశిత రేట్ల ప్రకారం చెల్లిస్తూ వస్తున్నారు. సెస్ ఆవిర్భావం నుంచి ఎలాంటి రాయితీలు ప్రభుత్వం నుంచి తీసుకోవడం లేదు. అలాగే దరఖాస్తుదారుడి సామాజిక వర్గం, లోడ్, స్తంభాలు, కేటగిరి వారీగా కనెక్షన్లకు ఒక్కో విధంగా రేట్లు ఉంటున్నాయి. ప్రస్తుతం 74,391 వ్యవసాయ కనెక్షన్లు ఉండగా 2021-22లో 939, 2022-23లో 812 కొత్తవి జారీ చేశారు.

టీఎస్ ఎన్‌పీడీసీఎల్ అయితే...

టీఎస్ఎన్‌పీడీసీఎల్ పరిధిలో ఒక వ్యవసాయ కనెక్షన్ పొందాలంటే రూ. 5,295 వరకు చెల్లిస్తున్నట్లు అక్కడి రైతులు చెబుతున్నారు. అవసరమైన జిరాక్స్‌ల కోసం మరో రూ. 300 వరకు ఖర్చవుతుంది. దరఖాస్తు ప్రక్రియ పూర్తయిన తర్వాత అధికారులు క్షేత్ర స్థాయిలో వివరాలు పరిశీలించి అంచనాలు సిద్ధం చేస్తారు. రైతులు చెల్లించిన సొమ్ముకు మూడు స్తంభాలు వేసి తీగ లాగడం, బిగించడంతోపాటు నియంత్రికను సమకూరుస్తారు. వీటి కోసం రాష్ట్ర ప్రభుత్వం కొంత మొత్తాన్ని చెల్లిస్తుంది. ఒక వేళ నియంత్రిక బిగించాల్సి ఉంటే సుమారు రూ. 70 వేల రాయితీ అందిస్తుంది. మూడు కంటే ఎక్కువ స్తంభాలు అవసరమైతే తీగ, సామగ్రి అవసరం పడితే కొంత మొత్తాన్ని అన్నదాతలు చెల్లించాల్సి ఉంటుంది. కానీ సెస్ పరిధిలో ఇలాంటి ప్రక్రియ లేదు. రైతులకు ప్రభుత్వం నుంచి వ్యవసాయ కనెక్షన్లకు ఎలాంటి డబ్బులు రావు. దీంతో అన్నదాతలే పూర్తి ఖర్చు భరించాల్సి వస్తోంది. ఇలా జిల్లా ప్రాంత రైతులపై ఆర్థిక భారం పడుతోంది. అధికారులు చెప్పినంత చెల్లించలేక రైతులు వ్యవసాయ కనెక్షన్లు తీసుకోవడానికి అనాసక్తి కనబరుస్తున్నారు. దీంతో పల్లెల్లో అక్రమ కనెక్షన్లు పెరిగిపోతున్నాయి. ఫలితంగా పరిమితికి మించిన లోడు కారణంగా నియంత్రికలు కొద్ది రోజులకే మరమ్మతులకు గురవుతున్నాయి. వ్యవసాయం మినహా మిగతా కనెక్షన్లకు ఎన్‌పీడీసీఎల్ మాదిరిగా కొత్తవి ఇస్తుండటం గమనార్హం. దీనిపై పలుమార్లు వినియోగదారులు ఉన్నత స్థాయి అధికారులను, సమావేశాల్లోనూ ప్రశ్నించినా ఫలితం లేదు. దీంతో అన్నదాతలపై ఆర్థికభారం పడుతుంది. ఇప్పటికైనా దీనిపై సెస్ పాలకవర్గం నిర్ణయం తీసుకుంటే కర్షకులకు మేలు జరుగుతుంది. మరోవైపు అక్రమ కనెక్షన్లు తగ్గే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. ఆ దిశగా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

పాలకవర్గ సమావేశంలో నిర్ణయం– రామకృష్ణ, ఎండీ, సెస్

# పార్కులపై పర్యవేక్షణ కరవు




వరంగల్ : నగరంలో పార్కులపై పర్యవేక్షణ కరువైంది. గ్రేటర్ ఉద్యానం, ఇంజినీరింగ్ విభాగాల సమన్వయ లోపంతో పాడైన ఆట వస్తువుల మరమ్మతులు చేయడం లేదు. బల్దియా గ్రీన్ పద్దు(బడ్జెటు), పట్టణ ప్రగతి ద్వారా లక్షలు ఖర్చు పెట్టి కాలనీల్లో పార్కులు అభివృద్ధి చేస్తున్నారు. ప్రారంభించిన తర్వాత అధికారులు పర్యవేక్షించడం లేదు. స్వయం సహాయక సంఘాలు, ఇతరులకు అప్పగించి వదిలేస్తున్నారు. పచ్చదనం, మొక్కలకు నీళ్లు పట్టడం, పిల్లల ఆట వస్తువులు, వీధి దీపాలు, తాగునీటి వసతి తదితర పనులు సక్రమంగా జరగడం లేదు. వేసవి సెలవులొచ్చాయి. ఉదయం, సాయంత్రం వేళల్లో పిల్లలు పార్కులకెళ్తున్నారు. అరకొర వసతులు, ఆట వస్తువులు సరిగా లేకపోవడంలో నిరాశ చెందుతున్నారు. వరంగల్, హనుమకొండ ప్రాంతాల్లోని పార్కులను బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలన చేసింది. పార్కుల వివరాలు: కాశీబుగ్గ సిద్దయ్య హోటల్, కాశీబుగ్గ ఏకలవ్య పార్కు, ఎల్బీనగర్, ఎస్సార్టీ కాలనీ, డాక్టర్స్ కాలనీ, టెలీకం కాలనీ, ఎంహెచ్‌నగర్ చిట్టి పార్కు, క్రిస్టియన్ కాలనీ, తిమ్మాపూర్ ఫ్రీడమ్ పార్కు, వనితా వనం, కరీమాబాద్ గుండుబావి, ఉర్సు సుభాష్‌నగర్

దేశాయిపేట ఎంహెచ్‌నగర్ పార్కులో నీళ్ల ట్యాంకు మూత తెరచి ఉంచారు. ఆట వస్తువుల వద్ద ఇసుక లేదు. తాగునీళ్ల కోసం పిల్లలు ఇబ్బంది పడుతున్నారు.

వరంగల్ క్రిస్టియన్ కాలనీ పిల్లల పార్కులో ఆట వస్తువుల నిర్వహణ సరిగా లేదు. ఇసుక నింపడం లేదు.

కాశీబుగ్గ సిద్దయ్య హోటల్ పార్కులో ఆట వస్తువులు పాడైపోయాయి. తాగునీళ్ల కోసం అల్లాడుతున్నారు. వీధి దీపాలు వెలగడం లేదు.

కరీమాబాద్ గుండుబావి పార్కులో సమయ పాలన లేదు. రెండు గేట్లు మూసేసి ఉన్నాయి. పిల్లలకు తాళాలు ఇచ్చారు. తాగునీళ్లు లేవు. ఆట వస్తువులు తక్కువగా ఉన్నాయి.

42వ డివిజన్ ఉర్సు సుభాష్‌నగర్ పార్కులో పనులు పెండింగ్‌లో ఉన్నాయి. ఆట వస్తువులు అందుబాటులోకి రాలేదు. పచ్చదనం కరువైంది. మొక్కలకు నీళ్లు పట్టడం లేదు. రాత్రి వేళల్లో అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయి. వీధి దీపాలు వెలగడం లేదు. పార్కు పర్యవేక్షణ ఎవరు చేస్తున్నారో తెలియదని స్థానికులు చెబుతున్నారు.

నిధులున్నా.. నిర్లక్ష్యమే

కొత్త పురపాలక చట్టంతో ప్రతి మున్సిపాలిటీలో వార్షిక సొంత ఆదాయంలో పదిశాతం నిధులు గ్రీన్ పద్దుకు కేటాయిస్తున్నారు. గ్రేటర్ వరంగల్‌లో ఏటా రూ.20 కోట్లకుపైగానే కేటాయిస్తున్నారు. నిధులున్నా పార్కులు అభివృద్ధిలో అధికారులు అశ్రద్ధ కనిపిస్తుంది. నగరంలోని 66 డివిజన్లలో మొత్తం 47 పార్కులున్నాయి.

ఆట వస్తువులు బాగు చేస్తాం

సీహెచ్.శ్రీనివాస్‌రావు, ముఖ్య ఉద్యాన అధికారి, గ్రేటర్ వరంగల్

పిల్లల ఆట వస్తువులు బాగు చేస్తున్నాం. వేసవి సెలవుల దృష్ట్యా పార్కులు ఉదయం, సాయంత్రం తెరవాలి. తాగునీటి వసతి గురించి కమిషనర్ దృష్టికి తీసుకెళ్తాం.

# ప్రమాదాల ‘విస్తరణే’..



వరంగల్ : జాతీయ రహదారి(163)పై సర్వీస్ రోడ్లు, సైడ్ రెయిలింగ్ పనులు చేపట్టకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్ని చోట్ల వీధి దీపాలు కూడా ఏర్పాటు చేయలేదు. రోడ్డు దాటే క్రమంలో ప్రమాదాలు జరిగి ప్రజల ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి. అధిక ఖర్చుతో కూడిన పనులు చేసి.. తక్కువ ఖర్చుతో పూర్తయ్యే పనులు చేయకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. కేంద్ర ప్రభుత్వం 2015లో రూ.1,920 కోట్లతో యాదాద్రి-వరంగల్ జాతీయ రహదారి విస్తరణ పనులు చేపట్టింది. 2016లో జూన్ 1న అప్పటి కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ ఈ పనులకు శంకుస్థాపన చేశారు. యాదాద్రి జిల్లాలోని వంగపల్లి నుంచి వరంగల్ జిల్లా అరెపల్లి వరకు 99.10 కి.మీ మార్గాన్ని 30 నెలల్లో పూర్తి చేయాలనే లక్ష్యంతో పనులు ప్రారంభించారు. గడువు పూర్తయి మూడేళ్లు కావస్తున్నా నేటికీ అనేక చోట్ల పనులు పెండింగ్‌లో ఉన్నాయి.

చేయాల్సిన పనులివీ.. రహదారి విస్తరణ పనులలో భాగంగా గ్రామాలు ఉన్నచోట ప్రజల సౌకర్యార్థం సర్వీస్ రోడ్లు వేయాలి. జాతీయ రహదారిపై నేరుగా ప్రజలు రాకుండా రాకుండా మధ్యలో ఇనుప కంచెతో రెయిలింగ్ ఏర్పాటు చేయాలి. రహదారి పొడవునా హైమాస్ట్ దీపాలు, ప్రతి గ్రామంలో మినీ బస్ స్టేజీ నిర్మించాలి. గృహాల్లోకి వర్షం, డ్రైనేజీ నీళ్లు రాకుండా చర్యలు చేపట్టాలి.

స్టేషన్‌ఘన్‌పూర్ మండలంలోని రాఘవపూర్‌లో రహదారికిరువైపులా సర్వీస్ రోడ్డు వేయాల్సి ఉండగా కంకర పోసి వదిలేశారు. గ్రామంలో 800 మీటర్ల పొడవునా గృహాలు ఉండడంతో సర్వీస్ రోడ్డు లేక ప్రజలు నేరుగా ఎక్స్‌ప్రెస్ హైవే పైకి వెళ్లడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. గృహాలు ఉన్నచోట విస్తరణ పనులకుగాను 75 ఫీట్ల వెడల్పు తీయగా.. రాఘవపూర్‌లో మాత్రం 100 ఫీట్లు తీశారు. ‘ఘన్‌పూర్ బస్టాండ్ నుంచి హైదరాబాద్ వైపునకు వెళ్లే దారిలో సర్వీస్ రోడ్డు నిరుపయోగంగా మారింది. బస్టాండ్ నుంచి శ్రీవాణి గురుకులం వరకు సర్వీస్ రోడ్డు వేయాల్సి ఉండగా కేవలం విద్యుత్ కేంద్రం వరకే వేసి వదిలేశారు. చిల్పూర్ మండలం చిన్నపెండ్యాల వద్ద సర్వీసు రోడ్డు వేసినప్పటికీ బస్టాండ్‌ను ఏర్పాటు చేయలేదు. ప్రజలు ఎండలో నిల్చొని వాహనాల కోసం వేచి చూడాల్సి వస్తోంది. సర్వీసు రోడ్డు పక్కన డ్రైనేజీ పూర్తికాకపోవడంతో ఇటీవల కురిసిన వర్షానికి వరద నీరుతో ప్రజలు అవస్థలు పడాల్సి వస్తుంది.

హైమాస్ట్ దీపాలేవీ?

ధర్మసాగర్ మండలం కరుణాపురం వద్ద సర్వీస్ రోడ్డు వేసినప్పటికీ కొంతమేర హైమాస్ట్ దీపాలు ఏర్పాటు చేయలేదు. సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేయాలి

కొత్తురి హనుమంత్, రాఘవపూర్

నిత్యం భయాందోళన

రాఘవపూర్ గ్రామంలో సర్వీస్ రోడ్డును ఏర్పాటు చేయకుండా వదిలేశారు. రహదారి దాటుతున్న క్రమంలో భయాందోళనకు గురవుతున్నాం. వెంటనే సర్వీస్ రోడ్లను నిర్మించాలి. అధికారులు స్పందించాలి

మునిగెల రమేశ్, సీపీఎం మండల కార్యదర్శి

# మినీ స్టేడియానికి మోక్షం ఎప్పుడో..!

ములుగు : జిల్లా కేంద్రంలోనే క్రీడామైదానం లేదంటే అతిశయోక్తి కాదు. విద్యార్థులు, యువకులు ఆడుకోవడానికి అవకాశమే లేకుండా పోతోంది. క్రీడా యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు నిర్వహించడానికి దూర ప్రాంతాలకు వెళ్లి మైదానాలు వెతుక్కోవాల్సిన పరిస్థితి. ములుగు పట్టణానికి చివర బండారుపల్లి రోడ్డులో ఓ ప్రైవేటు వ్యక్తి స్థలంలో క్రికెట్ ఆడుతున్నారంటే ఆశ్చర్యం కలగమానదు. కబడ్డీ, వాలీబాల్, బాస్కెట్‌బాల్, బాల్ బ్యాట్‌మెంటన్, షటిల్, ఖోఖో లాంటి తదితర క్రీడలు ఆడుకునే అవకాశమే లేదు. క్రీడా పరికరాలే తెలియవు. మినీ స్టేడియం పనులు మధ్యలో నిలిచిపోయాయి.

జాకారం మైదానమే దిక్కు

జాకారంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ఆవరణలోని క్రీడా మైదానమే జిల్లాకు పెద్ద దిక్కుగా ఉంది. ఎలాంటి క్రీడలు ఆడాలన్నా అక్కడికి వెళ్లాల్సిందే. అది చాలా దూరం కావడంతో తప్పని సరి పరిస్థితుల్లో స్కూలు గేమ్స్ నిర్వహించడం తప్ప ఇతర క్రీడాకారులు, యువకులు అక్కడకు వెళ్లలేక పోతున్నారు. ఒక వేళ ఎవరైనా అక్కడికి వెళ్లినా క్రీడా పరికరాలు అందుబాటులో ఉండవు. దీంతో పట్టణ ప్రజలు క్రీడలకు చాలా దూరంగా ఉండాల్సిన పరిస్థితి నెలకొంది.

నిర్మాణంలో జాప్యం

ములుగులో మినీ స్టేడియం నిర్మాణ పనులు చేపట్టారు. కాని అనుకున్నంత వేగంగా పనులు జరగడం లేదు. చేసిన పనికి బిల్లులు చెల్లించడం లేదని మినీ స్టేడియం నిర్మాణ పనులు చేపట్టిన గుత్తేదారు



పనులు నిలిపివేశారు. స్థల సేకరణ చేయకుండానే 2014లో మినీ స్టేడియం నిర్మాణానికి ప్రభుత్వం రూ.2.60 కోట్లు మంజూరు చేసింది. స్థల సేకరణకే దాదాపు 8ఏళ్లు పట్టింది. అనేక ఆటంకాలను అధిగమించి ఎట్టకేలకు బండారుపల్లి సమీపంలో సుమారు 6 ఎకరాల స్థలాన్ని కేటాయించారు. దీంతో పనులు చాలా ఆలస్యంగా ప్రారంభమయ్యాయి. కొద్ది రోజులు పనులు వేగంగా జరిగినా బిల్లులు రాకపోవడంతో గుత్తేదారు పనులు నిలిపి వేసి వెళ్లిపోయారు. మినీ స్టేడియం నిర్మాణం పూర్తయితే వివిధ రకాల క్రీడలు ఆడుకునేందుకు జిల్లా కేంద్రానికి చెందిన యువత, విద్యార్థులకు అవకాశం కలుగుతుంది. క్రీడా సామాగ్రి అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. ఇప్పటికైనా నిధులు విడుదల చేసి స్టేడియం నిర్మాణం పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని క్రీడాకారులు కోరుతున్నారు.

# క్రమబద్ధీకరణ దరఖాస్తులు 1.13 లక్షలు

కరీంనగర్ : అనధికారిక ప్లాట్లు, అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీకరణ (ఎల్ఆర్ఎస్) దరఖాస్తులు పరిష్కరించేందుకు ప్రభుత్వం అవకాశం ఇచ్చింది. మూడేళ్ల కిందట ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొని ఎదురు చూస్తున్న వారికి ఎట్టకేలకు ఊరట లభించింది. ఉమ్మడి జిల్లాలో..రెండు నగరపాలికలు, 14 మున్సిపాలిటీలు, శాతావాహన పట్టణాభివృద్ధి సంస్థ పరిధిలో ఎల్ఆర్ఎస్–2020 దరఖాస్తుల పరిశీలన మొదలైంది. అక్టోబర్ 31, 2020 వరకు ప్రభుత్వం దరఖాస్తులు స్వీకరించింది. ఆ సమయంలో ఎలాంటి పత్రాలు సమర్పించకుండానే ఆన్‌లైన్‌లో రూ.వెయ్యి చెల్లించి దరఖాస్తు చేశారు. దాంతో నగర, పురపాలికల్లో వేల సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. నాలుగు జిల్లాల పరిధిలోని మున్సిపాలిటీల్లో దాదాపు 1.13 లక్షల దరఖాస్తులు రాగా అప్పటి నుంచి అలాగే పెండింగ్‌లో ఉన్నాయి.

రసీదు, డాక్యుమెంట్లతో..

ఎల్ఆర్ఎస్ దరఖాస్తు సమయంలో రూ.వెయ్యి చెల్లించిన రసీదుతో పాటు ఆగస్టు 26, 2020లోపు రిజిస్ట్రేషన్ అయిన డాక్యుమెంట్ల ఆధారంగా క్రమబద్ధీకరిస్తారు. అప్పటి మార్కెట్ విలువ ఆధారంగా ఫీజు మదింపు చేస్తారు. దీనికి ఈసీ కూడా అవసరముంది. 30 ఫీట్ల రహదారి కచ్చితంగా ఉండాలి. లేదంటే మున్సిపాలిటీకి గిఫ్ట్ డీడ్ చేయాల్సి ఉంటుంది. ఫీజు మొత్తం చెల్లించిన తర్వాత ఉత్తర్వులు ఆన్‌లైన్‌లోనే తీసుకునే వీలుంది. కరీంనగర్ నగరపాలక పరిధిలో అత్యధికంగా దరఖాస్తులు ఉండటంతో వీటిని త్వరగా పరిష్కరించేందుకు, సందేహాలను నివృత్తి చేసేందుకు వీలుగా హెల్ప్ డెస్క్



ఏర్పాటు చేస్తున్నారు.

ప్రక్రియ వేగవంతానికి చర్యలు

ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను పరిష్కరించేందుకు రాష్ట్ర పురపాలక శాఖ ఉమ్మడి జిల్లాకు ఒక సబ్ నోడల్ అధికారిని నియమించింది. మున్సిపాలిటీల్లో ఉన్న టౌన్‌ప్లానింగ్ అధికారులకు క్షేత్రస్థాయిలో స్థలాల పరిశీలన, అనుమతులు జారీ చేసే బాధ్యతలు అప్పగించింది. సవ్యంగా ఉన్న దరఖాస్తులకే ఆమోదం పలికే అవకాశముంటుంది. ప్రక్రియ ప్రారంభం చేయడంతోనే ఆయా దరఖాస్తుదారులకు సమాచారం ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నారు. తాజా క్రమబద్ధీకరణ ద్వారా నగర, పురపాలికలకు రూ.కోట్లలో ఆదాయం రానుంది.

ఇప్పటికే భవనాలు నిర్మించుకుంటే..ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తు చేసి భవన నిర్మాణం చేసుకోవడానికి అనుమతులు తీసుకున్న వారికి క్రమబద్ధీకరణ అవసరం లేదు. భవన నిర్మాణ సమయంలోనే ఎల్ఆర్ఎస్ మొత్తాన్ని చెల్లించడంతో తిరిగి క్రమబద్ధీకరణ కోసం రానవసరం లేదని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతమున్న దరఖాస్తుల్లో ఇంటి అనుమతులు తీసుకున్నవే ఉన్నట్లు సమాచారం.

# అడుగు.. ప్రగతి వైపు

నల్గొండ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన యాదాద్రి ఆలయ పునర్‌నిర్మాణ ప్రాజెక్టు ప్రక్రియలో మరో కీలక అడుగు పడింది. యాదాద్రి ఆలయ ప్రాధికార సంస్థ (వైటీడీఏ (యాడా))ను మరింత విస్తరించి ఆలయ ఆదాయాన్ని పెంచే విధంగా అధికారులు కార్యాచరణ రూపొందిస్తున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి నేతృత్వంలో హైదరాబాద్‌లో బుధవారం ఉన్నతస్థాయి సమావేశం జరిగింది. గతంతో పోలిస్తే ఇప్పటికే దేవస్థానం ఆదాయం గణనీయంగా పెరిగినా..భవిష్యత్తు అవసరాల దృష్ట్యా ఆదాయ పరంగా క్షేత్రానికి ఎలాంటి ఇబ్బందులు రాకుండా యాడా పరిధిని విస్తరించాలని నిర్ణయించారు. క్షేత్రంలో పనుల పరిశీలనతో పాటూ ఆలయ పరిసరాలను మరింత అభివృద్ధి చేయాలనే తలంపుతో సీఎం కేసీఆర్ ఛైర్మన్‌గా, పదవీ విరమణ చేసిన ఐఏఎస్ అధికారి కిషన్‌రావు వైస్ ఛైర్మన్‌గా 2015 ఫిబ్రవరి 27న ప్రభుత్వం యాడాను ఏర్పాటు చేసింది. ప్రస్తుతం యాడా పరిధిలో యాదగిరిపల్లి, సైదాపూర్, మల్లాపూర్, దాతర్‌పల్లి, గుండ్లపల్లి, రాయిగిరి, బస్వాపురం గ్రామాలున్నాయి. ఈ గ్రామాల్లో చేపట్టే అభివృద్ధి పనులు, నిర్మాణాలకు యాడానే అధికారికంగా అనుమతులు మంజూరు చేస్తోంది. వివిధ



రూపాల ద్వారా వచ్చే ఆదాయంతో పాటూ సమీపంలోని మరిన్ని గ్రామాలను యాడా పరిధిలో విలీనం చేస్తే ఆలయానికి ఆదాయ పరంగా ఎలాంటి ఢోకా ఉండదని ఉన్నతాధికారులు భావిస్తున్నారు. ఆ మేరకు త్వరలోనే విలీనం చేసే ప్రతిపాదనలున్న గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించాలని యోచిస్తున్నారు. మరోవైపు ఈ గ్రామాల్లో ఇప్పటికే మూడు, నాలుగు సార్లు ప్రభుత్వ ప్రాజెక్టులకు భూ సేకరణ జరిగిన దృష్ట్యా విలీన ప్రక్రియకు ఆటంకాలు ఎదురయ్యే సూచనలు కనిపిస్తున్నాయి.

ఎటూ తేలని ఆలయనగరి

ఆలయనగరిలో భక్తుల బస కోసం నిర్మించే కాటేజీల అంశంపై ఇంకా స్పష్టత రాలేదు. దాతలు ఎవరైనా రూ.కోటి ఇస్తే వారి పేరుతో విల్లా ఆకృతిలో కాటేజీల నిర్మాణం సాగుతోందని అధికారులు వెల్లడించినా.. ఉన్నతస్థాయిలో ఓ నిర్ణయం రాకపోవడంతో వాయిదా పడుతూ వస్తోంది. భక్తుల బస కోసం ప్రస్తుతం క్షేత్రంలో సరిపడినన్ని కాటేజీలు లేక పోవడంతో భక్తులు ఎక్కువ ధరకు అద్దె గదులను ఆశ్రయిస్తున్నారు. దీంతో ఇప్పటికైనా దీనిపై ఓ నిర్ణయం తీసుకొని కాటేజీల నిర్మాణం ప్రారంభిస్తే బస ఇబ్బందులు తప్పుతాయని భక్తులు కోరుతున్నారు.

# దళిత బంధు.. ఉపాధి మెండు

వరంగల్ :'ఎంతోమంది వ్యక్తిగతంగా ట్రాక్టర్లు, బొలెరో వాహనాలను కొనుగోలు చేశారు.. ముగ్గురు, నలుగురు కలిసి జేసీబీ, వరి కోత యంత్రాలను కొనుగోలు చేసి విజయవంతంగా నడిపించుకుంటున్నారు' దళిత కుటుంబాల్లో వెలుగులు నింపేందుకు ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న పథకం దళిత బంధు. ఒక్కో కుటుంబానికి రూ.10 లక్షలు అందడంతో తమకు నచ్చిన యూనిట్లు ఎంపిక చేసుకుని స్థిరపడుతున్నారు. నైపుణ్యమున్న దళిత యువకులు ఈ పథకం ద్వారా వ్యాపార, పారిశ్రామిక వేత్తలుగా స్థిరపడ్డారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో తొలి దశలో ఎంపికైన లబ్ధిదారులు మినీ డైరీలు, కోళ్ల ఫారాలు, వస్త్ర, చెప్పుల దుకాణాలు, టెంట్ హౌస్, ఫ్లెక్సీ ప్రింటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసుకుని ఆర్థికాభివృద్ధి దిశగా పయనిస్తున్నారు. దళిత బంధు సహాయంతో జీవితాలను వెలుగుల విందుగా మార్చుకున్నవారిపై ప్రత్యేక కథనం... -ఈనాడు డిజిటల్, మహబూబాబాద్

యూనిట్ల పంపిణీ..ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా తొలివిడత 5,217 యూనిట్లు పంపిణీ చేశారు. ఇందులో హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలానికి పైలట్ ప్రాజెక్టులో భాగంగా 3901



యూనిట్లను కేటాయించారు. మొత్తంగా రూ.521.7 కోట్లు అందించారు. ఒకప్పుడు కూలీ, డ్రైవరుగా పనిచేసిన తాము యజమానులుగా మారి నలుగురికి ఉపాధి కల్పిస్తున్నామని హర్షం వ్యక్తం చేస్తున్నారు.

దరఖాస్తు చేసుకోండిలా..దళితబంధు పథకం యూనిట్ కోసం లబ్ధిదారులు ముందుగా స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలి. అందుకు అవసరమైన ఫారం ఆ కార్యాలయంలోనే ఇస్తారు. దరఖాస్తుదారులు అందులో తమ పూర్తి వివరాలను నమోదు చేసిన తర్వాత వాటికి కుల ధ్రువీకరణ, రేషన్, ఓటర్ ఐడీ, ఆధార్, బ్యాంక్ ఖాతా బుక్ జిరాక్స్ పత్రులను జత చేయాలి. పూర్తి చేసిన దరఖాస్తు ఫారాన్ని సంబంధిత ఎంపీడీవోకు అందించాలి.

# హరితహారానికి గొడ్డలిపెట్టు

కరీంనగర్: హరితహారం ఆదర్శమని మన్ననల్ని అందుకున్న కరీంనగర్ నగరంలోనే ఇటీవల ఇష్టానురాజ్యంగా చెట్లను కొందరు నేలకూలుస్తున్నారు. ఇలాంటి చర్యలకు పాల్పడుతున్న వారికి జరిమానాలు విధించిన దాఖలాలు లేవు. హరితహారంలో భాగంగా 2018లో సీఎం కేసీఆర్ స్వయంగా ఎల్ఎండీ ఆనకట్టను ఆనుకుని ఉన్న స్థలంలో మొక్కల్ని నాటి అందరిలో స్ఫూర్తి నింపారు. ఆ తర్వాత ప్రతీ వానాకాలంలో నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఇంటింటికీ ఐదు రకాల మొక్కలను అందించడంతోపాటు ఖాళీ ప్రదేశాలు, అవెన్యూ ప్లాంటేషన్‌లతో లక్ష్యానికి మించి పచ్చని ప్రగతిని చేతల్లో చూపించారు. 60 డివిజన్ల పరిధిలో గడిచిన మూడేళ్లుగా వేల సంఖ్యలో చెట్టు మోడువారాయి. నగరంలో దాదాపుగా 78వేల ఇళ్లుంటే ఇందులో సగం ఇళ్ల చెంతన చెట్లే ఉండటం లేదు. పురపాలిక నిబంధనల ప్రకారం నిర్మాణం చేపట్టే ప్రతి గృహం చెంతన మొక్కలను నాటుతూ వాటిని పెంచి సంరక్షించేలా యంత్రాంగం చొరవ చూపాలి.

నగరంలోని జ్యోతినగర్ వీధిలో విద్యుత్తు సిబ్బంది ఇలా చెట్లను ఇష్టానురాజ్యంగా తొలగించేస్తున్నారు. పైన ఉన్న విద్యుత్తు తీగలకు కొమ్మలు తగులుతూ సరఫరాకు అంతరాయం కలిగిస్తున్నాయని ఇలాంటి చర్యలకు ఉపక్రమిస్తున్నారు. కొంతకాలంగా దాదాపుగా అన్ని వీధుల్లో ఇలానే జరుగుతున్నా.. నగరపాలక సంస్థ, విద్యుత్తు శాఖ ఉన్నతాధికారులు మాత్రం ఇదేం పెద్ద తప్పుకాదనే తీరున చోద్యం చూస్తున్నారు.

కరీంనగర్‌లోని సప్తగిరి కాలనీ రోడ్డుకిరువైపులా రెండేళ్ల కిందట చూడచక్కని తీరున పెరిగిన మొక్కలన్నీ ఇప్పుడు అధ్వానస్థితికి చేరాయి. విద్యుత్తు తీగల సాకుతో కొన్ని.. రోడ్డు పక్కన, ఇళ్లచెంతన అడ్డుగా ఉన్నాయని మరికొన్ని చెట్లను తొలగించారు. ఆయా కాలనీల్లో ఇళ్ల



చెంతన ఆకులు రాలుతున్నాయని.. వాటిని ఊడ్చటం, ఎత్తిపారేయడం కష్టమని భావించి ఇంకొందరు కాండం మాత్రమే మిగిలేలా గొడ్డలి వేటు వేస్తున్నారు.

ఏం చేయాలి.. ఏం చేస్తున్నారు..!

వానాకాలం, వేసవిలో గాలుల బీభత్సంతో అక్కడక్కడ విద్యుత్తు తీగలకు ఏపుగా పెరిగిన చెట్ల కొమ్మలు తగిలి విద్యుత్తు సరఫరాకు అంతరాయం వాటిల్లుతుంది. అందుకని ప్రతీ మూణ్ణెళ్లకోసారి విధిగా చెట్ల కొమ్మలు ఎక్కడైతే తీగలను తాకుతాయో వాటిని మాత్రమే పొడవాటి కర్రకు కొడవలి కత్తిని కట్టి కొమ్మలను మాత్రమే తొలగించాలి. ఈ ప్రక్రియను అటు విద్యుత్తు, ఇటు నగరపాలక సంస్థ సిబ్బంది సమన్వయంతో కొనసాగాలి. కాని పదే పదే తమకు ఇబ్బంది అనే ఉద్దేశంతో విద్యుత్తు సిబ్బంది ఎక్కడకికక్కడ కాలనీల్లో చెట్లను గొడ్డలితో నరికేస్తున్నారు. తమ ఇంటి వద్ద ఉన్న వృక్షంతో ఇబ్బంది అనే ఉద్దేశంతో ఇంటి యజమానులు కూడా దగ్గరుండి మరీ.. చెట్లను నేలకూలుస్తున్నారు. ప్రహరీలకు ఇబ్బందిగా మారుతుందని.. నిర్వహణ భారమనే సాకుతో కొందరిలా ఉన్న చెట్లను కనుమరుగయ్యేలా చేయడం మానుకోవాలి. మరోవైపు నిబంధనల ప్రకారం కొమ్మలను మాత్రమే తొలగించాలని, ఎక్కడా గొడ్డలి వాడొద్దని సిబ్బందికి చెబుతున్నామని విద్యుత్తు శాఖ ఎస్ఈ గంగాధర్ తెలిపారు.

# చుక్కల్లో మిరప విత్తన ధరలు



ఖమ్మం : రైతుల అవసరాలను ఆసరాగా చేసుకున్న కొన్ని కంపెనీలు మిరప విత్తనాల పేరిట నిలువు దోపిడీ చేసేందుకు సిద్ధమవుతున్నాయి. ధనార్జనే ధ్యేయంగా పావులు కదుపుతున్నాయి. మిరప విత్తనాల విషయంలో అన్నదాతలు అప్రమత్తంగా వ్యవహరించకపోతే వచ్చే సీజన్‌లో నిండా మునిగే ప్రమాదం ఉంది. తెలంగాణ రాష్ట్రంలోనే అత్యధికంగా మిరప సాగు చేసే జిల్లాల్లో ఖమ్మం ప్రథమ స్థానంలో ఉంది. ఆ తర్వాత మహబూబాబాద్, వరంగల్ జిల్లాలు ఉంటాయి. మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల రైతులు విత్తనాల కోసం ఖమ్మంపైనే ఆధారపడతారు. సూర్యాపేట, నల్గొండ జిల్లాలతో పాటు ఏపీకి చెందిన కొందరు రైతులు ఇక్కడ కొనుగోలు చేస్తారు. ఏటా రూ.కోట్లాది వ్యాపారం జరుగుతుంది. అందుకే ఇప్పుడు విత్తన వ్యాపారులు మొత్తం ఖమ్మం జిల్లాపై దృష్టి సారించి తమ వ్యాపారాలను విస్తరించాలని యోచిస్తున్నారు.

మార్కెట్లోకి రాకముందే ...

మార్కెట్లోకి రాకముందే మిరప విత్తనాల ధరలు మండుతున్నాయి. కొన్ని రకాల ధర కిలోకు రూ.80 వేల నుంచి రూ.లక్షన్నర వరకు పలుకుతోంది. అడ్వాన్స్ బుకింగ్ పేరిట వాటి ధరల్ని రెట్టింపు చేస్తున్నారు. ఈ ఏడాది మిరపకు డిమాండ్ ఉండటమే ఇందుకు ప్రధాన కారణం. క్వింటా రూ.23 వేల నుంచి రూ.24 వేల వరకు ధర పలుకుతోంది. వచ్చే ఏడాది అధిక విస్తీర్ణంలో మిరప నాటేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. ఇప్పటి నుంచే పొలాలను కౌలుకు తీసుకుని విత్తనాల కొనుగోలుపై దృష్టి సారిస్తున్నారు. నల్ల తామర, వైరస్‌ను తట్టుకుంటాయనే ప్రచారంతో కొన్ని రకాలపైనే ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు. అందుకే ఈసారి విత్తనాల ధరలు చుక్కలనంటుతున్నాయి. సాధారణంగా జూన్, జులైలో మిరప నారు పోస్తారు. ఆగస్టు, సెప్టెంబరులో మొక్కలు నాటుతారు. విత్తనాల అమ్మకాలు మే నెలలో మొదలవుతాయి.

పెరగనున్న సాగు విస్తీర్ణం

ఖమ్మం జిల్లాలో ఈ ఏడాది 68 వేల ఎకరాల్లో రైతులు మిరప సాగు చేశారు. ప్రస్తుతం ధర బాగున్నందున వచ్చే సీజన్‌లో 1,00,000 నుంచి 1,10,000 ఎకరాలకు సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఈ ఏడాది 30 వేల ఎకరాల్లో రైతులు పండించగా ఈసారి మరో 20 వేల ఎకరాలు సాగు చేస్తారని భావిస్తున్నారు. చాలామంది రైతులు పోటీ పడి పొలాలను కౌలుకు తీసుకుంటున్నారు. కౌలు ధర కూడా పెరిగింది.

ముందస్తు బుకింగులు షురూ..

ఉభయ జిల్లాల్లో పేరున్న విత్తన డీలర్లు ఇప్పటికే రూ.కోటి నుంచి రూ.కోటిన్నర వరకు కంపెనీలకు డిపాజిట్లు చెల్లించారు. కంపెనీలు ముందస్తు ఒప్పందం ప్రకారం ఇప్పుడు ధరలు పెంచాయి. ఈసారి విస్తీర్ణం పెరగనున్న నేపథ్యంలో ఎలాగైనా విత్తన కొరత వస్తుందనే ఉద్దేశంతో అడ్డదారుల్లో నల్లబజారులో విక్రయించేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. మిరప నర్సరీలు సైతం రెండు జిల్లాల్లో రూ.కోట్ల వ్యాపారం చేస్తున్నాయి. నర్సరీల నిర్వాహకులు సైతం మొక్కల వ్యాపారంతో సొమ్ము చేసుకోవాలని భావిస్తున్నారు. విత్తన వ్యాపారులు ఒకవైపు, నర్సరీల యజమానులు మరోవైపు రైతులను మోసగించే ప్రయత్నాల్లో ఉన్నారు. మిరప అధిక విస్తీర్ణంలో సాగు చేసే మండలాలపై ప్రధానంగా దృష్టి సారిస్తున్నారు. సందట్లో సడేమియా మాదిరిగా కొన్ని నకిలీ కంపెనీలు సైతం ఈ వ్యాపారానికి తెర లేపుతున్నట్లు తెలుస్తోంది.టాస్క్‌ఫోర్స్ వ్యవస్థను పటిష్ఠ పరిస్తేనే..అధిక ధరలకు విత్తనాలు విక్రయించకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలి. నకిలీ విత్తనాలు, మొక్కలను అరికట్టాలి. అక్రమాలను నిరోధించేందుకు ఇప్పటి నుంచే పటిష్ఠమైన టాస్క్‌ఫోర్స్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు. గత సీజన్‌లోనూ నకిలీ విత్తనాలు జిల్లాలోకి వచ్చిన విషయం తెలిసిందే.

# దళారులదే హవా.. జీసీసీది ప్రేక్షక పాత్ర..!



ఖమ్మం : అటవీ ఉత్పత్తులు సేకరించి మన్యం బిడ్డలు ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేయూతనివ్వాలన్న గిరిజన సహకార సంస్థ (జీసీసీ) లక్ష్యం నీరుగారుతోంది. జీసీసీలో కొంతమంది అధికారులు, సిబ్బంది సహకారంతో దళారులు రాజ్యమేలుతున్నారనే వాదనలు వ్యక్తమవుతున్నాయి. ఇదిలా ఉండగా భద్రాచలం ఏజెన్సీలో గిరిజనుల నుంచి 2023-24లో రూ.200 కోట్ల అటవీ ఉత్పత్తులు కొనాలని జీసీసీ నిర్ణయించింది. అటవీ ప్రాంతం నుంచి గిరిజనులు తీసుకొచ్చిన ముష్టిగింజలు, విప్పపువ్వు, విప్పపరక కొనుగోళ్లు సేల్స్ డిపోల్లో జరిగేలా ఏర్పాట్లు చేసింది.వివాదాల గండం నుంచి భద్రాచలం జీసీసీ గట్టెక్కడం లేదు. గతేడాది నారాయణపురం జీసీసీ గోదాములో సుమారు 900 క్వింటాళ్ల ముష్టిగింజలు మాయమైన ఘటన సంచలనం సృష్టించింది. పలువురు అధికారులపై వేటు పడింది. వివిధ మండలాల గోదాముల్లోని నిల్వలపైనా అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఈవ్యవహారంపై శాఖాపరమైన విచారణ సాగుతోంది. గిరిజనుల నుంచి మూడు క్వింటాళ్ల ముష్టిగింజలను దళారులు కొని అక్రమంగా తరలిస్తుండగా గుండాల పోలీసులు ఇటీవల పట్టుకున్నారు. తాజాగా ముల్కలపల్లిలో జీసీసీ ఫిల్లింగ్ స్టేషన్‌లో పెట్రోల్, డీజిల్ అమ్మకంపై వచ్చిన మొత్తంలో రూ.50 లక్షలు పక్కదారి పట్టినట్లు మరో ఘటన వెలుగుచూసింది. మాయమాటలు చెప్పి.. దొడ్డిదారిన తరలించి గిరిజనుల నుంచి గిట్టుబాటు ధరకు అటవీ ఉత్పత్తులను కొనాల్సిన జీసీసీ.. దళారులోకు అండగా నిలుస్తుందనే వాదనలున్నాయి. కొన్ని నెలలుగా ఏజెన్సీ ప్రాంతాల్లో ముష్టిగింజల కొనుగోళ్లలో భారీగా అవకతవకలు చోటుచేసుకుంటున్నాయి. సేల్స్ డిపోల్లో సాగాల్సిన కొనుగోళ్లు ఏకంగా ఏజెన్సీ పల్లెల్లోనే జరుగుతున్నాయి. గిరిజనులకు దళారులు మాయమాటలు చెప్పి తక్కువ ధరకు ముష్టిగింజలను ఖరీదు చేస్తున్నారు. ప్రస్తుతం జీసీసీ కేంద్రాల్లో కిలో ముష్టిగింజల ధర రూ.45 పలుకుతోంది. ఏజెన్సీ ప్రాంతాల్లో దళారులు రూ.35కే కొంటున్నారు. వీటికి ఛత్తీస్‌గఢ్‌లో డిమాండ్ ఉండటంతో దొడ్డిదారిన అక్కడికి తరలిస్తున్నారు. కిలో సరకును రూ.90 చొప్పున విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. తద్వారా జీసీసీ ఆదాయానికి గండిపడుతుండటమే కాకుండా గిరిజనులకు గిట్టుబాటు ధర అందకుండా పోతోంది.

ఉన్నతాధికారులు దృష్టి సారిస్తే..భద్రాచలం ఏజెన్సీ కేంద్రంగా ముష్టిగింజల కొనుగోళ్లలో సాగుతున్న దందాలో ఛత్తీస్‌గఢ్‌కు చెందిన కొందరు వ్యాపారులతో పాటు స్థానిక దళారులు చక్రం తిప్పుతున్నట్లు తెలిసింది. వీరికి జీసీసీలోని కొందరు అధికారులు, సిబ్బంది సహకారం అందిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దళారులు నేరుగా ఆయా ప్రాంతాలకే వెళ్లి తక్కువ ధరకు గిరిజనుల నుంచి ముష్టిగింజలు కొంటున్నారు. అనుమతుల్లేని ప్రత్యేక వాహనాల్లో రాత్రికి రాత్రే ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి తరలిస్తున్నారు.

ముష్టిగింజల కొనుగోళ్లపై ఉన్నతాధికారులు దృష్టిసారిస్తే రూ.కోట్లలో జీసీసీ ఆదాయం పెరిగే ఆస్కారముంది. గత అనుభవాలు, జీసీసీ ఎదుర్కొన్న ఆరోపణల నేపథ్యంలో ఈసారి ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. కొనుగోళ్లలో అవకతవక లకు ఆస్కారమివ్వకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. ఇప్పటికే అందిన ఫిర్యాదులపై విచారణ జరుపుతున్నాం. అక్రమ వ్యాపారం సాగుతున్నచోట్ల పోలీసులకు ఫిర్యాదు చేశాం. అక్రమ కొనుగోళ్లలో జీసీసీ యంత్రాంగం హస్తముంటే కఠిన చర్యలు తీసుకుంటాం. విజయ్‌కుమార్, జీసీసీ డీఎం, భద్రాచలం

# మూలన పడ్డ పార్సిల్ ప్యాకింగ్ యూనిట్!

ఖమ్మం : ఇటీవల తపాలాశాఖ ఆధునికతతో కూడిన అద్భుత ప్రయోగాల వైపు అడుగులు వేస్తోంది. ఇలా అందివచ్చిన యంత్రాలు కొన్ని మూన్నాళ్లకే మూలకు చేరుతున్నాయి. ఖమ్మం ప్రధాన తపాలా కార్యాలయంలో పార్సిల్ ప్యాకింగ్ వ్యవస్థ ఏర్పాటు చేశారు. ఇందుకోసం ఆధునిక యంత్రాలు అందివచ్చాయి. ఆరు నెలల కిందట ప్రారంభించిన పార్సిల్ ప్యాకింగ్ యూనిట్‌కు స్థానికంగా మంచి స్పందన వచ్చింది. విదేశాలకు సరకులు పంపాలనుకునే వారు కూడా ఇక్కడికే వచ్చారు. ఇంతటి స్పందన ఉన్న యూనిట్ నెల రోజులుగా మూలకు చేరింది. వచ్చే వినియోగదారులు అసహనంగా తిరిగి వెళ్లిపోతున్నారు. ఇలా వెళ్లిన వారు తిరిగి ఇక్కడికి వచ్చే అవకాశాలు చాలా తక్కువ. ప్యాకింగ్‌కు ఉపకరించే పట్టీలు లేవని ఈ మొత్తం యూనిట్‌ను మూలన పడేశారు. వాటి కోసం ఆర్డర్ పెట్టామని రాగానే సేవలు పునరుద్ధరిస్తామని పోస్ట్‌మాస్టర్ కిరణ్‌కుమార్ వివరించారు.




# ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటయ్యేదెప్పుడో?

వరంగల్ : జిల్లాలో యాసంగి వరి కోతలు ముమ్మరమయ్యాయి. అన్ని గ్రామాల్లో ఐకేపీ, పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ధాన్యం పోటెత్తుతోంది. ఇతర జిల్లాలతో పోల్చితే యాసంగి సీజన్‌లో జనగామ జిల్లాలో ఒకటి, రెండు నెలలు ముందుగా వరి సాగు చేశారు. దీంతో 10 రోజుల నుంచే ధాన్యం కోతలు జోరుగా సాగుతున్నాయి. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కుప్పలు భారీగా పేరుకుపోయాయి. వడగళ్ల వానలు, గాలి బీభత్సం కారణంగా పంటలు దెబ్బతినే అవకాశం ఉంది. గత అనుభవాల దృష్ట్యా రైతులు ముందుగానే వరి కోతలు చేపట్టడంతో విక్రయానికి ధాన్యం సిద్ధంగా ఉంది.

జిల్లాలో పరిస్థితి

యాసంగి సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా 1.93 లక్షల ఎకరాల్లో వరిని సాగు చేశారు. ఈ మేరకు 4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేశారు. ఇందులో ప్రైవేటు, విత్తన కంపెనీల విక్రయాలు, రైతుల అవసరాలు.. తదితర విభాగాలకు ధాన్యం పోగా మిగిలిన 2.30 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు



చేరుతుందని.. అందుకు తగినట్లుగా 200 కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు 20 రోజుల క్రితం అధికారులు వెల్లడించారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, పౌరసరఫరా, పీఏసీఎస్ శాఖలు క్షేత్రస్థాయిలో ఏర్పాట్లపై దృష్టి సారిస్తున్నా.. వేగవంతం చేయడంలో జాప్యం జరుగుతోంది. పది రోజుల క్రితమే ధాన్యం కోతలు ముమ్మరమైనా కొనుగోళ్ల ప్రక్రియ ప్రారంభం కాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కొందరు రైతులు వారి సొంత అవసరాలు, అప్పులను తీర్చుకునేందుకు ప్రైవేటు వ్యాపారులకు ధాన్యాన్ని తక్కువ ధరకే అమ్ముకుంటున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు పాలకుర్తి నియోజకవర్గ పరిధిలో పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు చేతుల మీదుగా 2, 3 కేంద్రాలను మాత్రమే ప్రారంభించగా.. మిగిలిన కేంద్రాలను ఎప్పుడు ప్రారంభిస్తారా అని అన్నదాతలు ఎదురు చూస్తున్నారు.

త్వరలో ప్రారంభిస్తాంగూడూరు రాంరెడ్డి, డీఆర్డీవోజిల్లాలో యాసంగి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు కార్యాచరణ పూర్తయింది. ఇప్పటికే వీటికి సంబంధించిన సమీక్షలు, సమావేశాలు జరిగాయి. రెండు, మూడు రోజుల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేశాం. రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి.

# మామిడికి మంగు

జగిత్యాల : జగిత్యాల సహా తెలంగాణలోని జిల్లాల్లో మామిడిపై పెరిగిన చీడపీడల నివారణకు పరిశోధనాత్మక చర్యలు చేపట్టాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి ఎస్.నిరంజన్‌రెడ్డి నిరుడు వేసవిలో భారత వ్యవసాయ పరిశోధన మండలికి, కేంద్ర వ్యవసాయ శాఖమంత్రి నరేంద్రసింగ్ తోమర్‌కు విన్నవించారు. రాష్ట్రమంత్రి వినతిపై కేంద్రం నుంచి క్షేత్రస్థాయి చర్యలు లేకపోగా ఇటు రాష్ట్ర పరిధిలో ఉద్యాన వర్సిటీ, ఉద్యానశాఖ ద్వారానూ తదనుగుణ చర్యలను విస్మరించారు. ఫలితంగా ఈ సారి కూడా మామిడిపై చీడపీడల తీవ్రత మరింతగా పెరిగి కాయల నాణ్యతను దెబ్బతీసి ధర, ఎగుమతులను ప్రభావితం చేస్తోంది.

మామిడి చరిత్రలోనే రెండేళ్లుగా మంగు ఆశిస్తోంది. దీని ప్రభావంతో నిరుడు దాదాపుగా 30 శాతం వరకు ధరలు తగ్గాయి. ఈ సీజన్‌లో మంగుతో పాటుగా కాయల తొడిమ వద్ద కుళ్లిపోవటం మరింత అధికమైంది. ప్రస్తుతం జగిత్యాల మామిడి మండీలో బంగినపల్లి రకానికి క్వింటాలుకు రూ.2,000-3,300 వరకు ధర పలుకుతుండగా కొద్దిగా మంగు సోకిన కాయలకు క్వింటాలుకు రూ.1,000-2,000 ధర చెల్లించారు. కాయలపై మంగు మచ్చలు అధికంగా ఉన్నపుడు అసలే కొనుగోలు చేయకపోవటంతో రైతులు, తోటలను గుత్తకు తీసుకున్నవారు తల్లడిల్లుతున్నారు. ప్రస్తుతం కాయలను తెంపే సమయం కాబట్టి చీడపీడల నివారణ సాధ్యపడక ఈ సీజన్‌లో ఇప్పటికిప్పుడు కాయలపై మరకలు తగ్గించే అవకాశమే లేకుండా పోయింది.

పదింతలు పెరిగిన మచ్చలు..

ఉమ్మడి జిల్లాలో దాదాపుగా 75 వేల ఎకరాల వరకు మామిడి తోటలుండగా సాధారణ పరిస్థితుల్లో 1.50 లక్షల మెట్రిక్ టన్నుల వరకు కాయలను ఎగుమతి చేస్తారు. కానీ ఈ సంవత్సరం ఆశించినట్లుగా కాపు రాలేదు. మామిడి కాపు తగ్గడానికి ఉష్ణోగ్రతల హెచ్చుతగ్గులు, చలిలో తేడాలు, గాలిలో తేమ, మంచు వాతావరణం, అధిక వర్షాలు, నేలలోని తేమ, గంటల వ్యవధిలోనే మారిన వాతావరణ పరిస్థితులు ముఖ్య కారణాలు కాగా వీటికి చీడపీడలు తోడయ్యాయి. మామిడిపై తామర పురుగులు, రసంపీల్చు పురుగులు, తేనెమంచు, లద్దెపురుగులు, ఇతరత్రా కాయకుళ్లు, బూడిద తెగులు తదితరాలు పూత, కాతను రాలేలా చేశాయి, కాయలకూ నష్టం కలిగిస్తున్నాయి. చీడపీడల తీవ్రతతో కాయలపై మచ్చలశాతం మూడేళ్లక్రితంతో పోలిస్తే పదింతలు పెరిగిందని మామిడి కొనుగోలుదారులు పేర్కొంటున్నారు. జగిత్యాల సహా ఉమ్మడి జిల్లా నుంచి మామిడి కాయలను దిల్లీ కేంద్రంగా ఇతర రాష్ట్రాలు, పలు దేశాలకు ఎగుమతి చేస్తారు. నాణ్యత రీత్యా జగిత్యాల మామిడికి బ్రాండ్ ఇమేజ్ ఉండగా కాయలపై మచ్చలతో దిల్లీ మార్కెట్లో ధర తగ్గిందని వ్యాపారులు పేర్కొంటున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి నాణ్యమైన మామిడి రావటంతో దిల్లీలో అధికధర చెల్లిస్తున్నారని, ఇదే పరిస్థితి మరో రెండేళ్లు కొనసాగితే మన మామిడికున్న బ్రాండ్ విలువ పడిపోతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సామూహికంగా చేపడితేనే..కనీసం వచ్చే ఏడాదికైనా మామిడిపై చీడపీడలు తగ్గాలంటే ములుగు, సంగారెడ్డి ఉద్యాన ఫల పరిశోధనస్థానానికి చెందిన నిపుణులైన మామిడి శాస్త్రవేత్తలతో ప్రస్తుతం జిల్లాలోని రైతుల తోటలను పరిశీలింపచేయాలి. ఏయే కారణాలతో చీడపీడల తీవ్రత పెరుగుతుందన్న అంశాలను విశ్లేషించి రైతులు, తోటలకు గుత్తకు తీసుకున్నవారికి అవగాహన సదస్సుల ద్వారా వివరించాలి. అవసరమైతే నూతన రసాయనాలను రైతులకు అందించాలి. మామిడి చెట్లకు తగినట్లుగా సేంద్రియ ఎరువులను వేయటం, గుబురుగా ఉన్న, ఎండిన కొమ్మలను తొలగించటం, తోటల్లో చెత్తాచెదారం తీసివేయటం, చెట్లమధ్యన కలుపు లేకుండా దున్నటం, పూతకు ముందునుంచే యాజమాన్యం, సమగ్ర సస్యరక్షణ చర్యలను చేపట్టడం తదితరాలతో చీడపీడలను అదుపుచేసే వీలుందని ఉద్యాన శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. చెట్లను నిరంతరం గమనిస్తూ పూత, పిందె దశల్లోనే శాస్త్రవేత్తలు, అధికారుల సిఫారసులను పాటించాలన్నారు.

# చేతులు కలిసేనా..?

ఆదిలాబాద్ : అధికారానికి దూరమై దశాబ్దా కాలానికి దగ్గర పడుతున్న హస్తం పార్టీ నేతలు ఐక్యత వైపు అడుగులు వేసినట్లు కనిపించడం లేదు. దీంతో జిల్లాలో పార్టీ పరిస్థితి ఓ అడుగు ముందు కు.. రెండు అడుగులు వెనక్కి అన్నట్లుగా మారింది. వరుస ఓటములతో పూర్తిగా డీలా పడిపోయిన నేతలకు గుణపాఠం కలిగినట్లే కనిపించడం లేదు. కాంగ్రెస్‌ను మరింత డీలా చేసేందుకు టీఆర్ఎస్, బీజేపీ పార్టీలు వ్యూహారచన చేస్తున్నా తిప్పికొట్టే కనీస ప్రయత్నం చేయడం లేదన్న చర్చ జరుగుతోంది. వచ్చే సాధారణ ఎన్నికల్లో సిద్ధం కావాలని పార్టీ అధిష్ఠానం పిలుపునిస్తున్న ఎవరికీ వారే కార్యక్రమాలు నిర్వహించుకుంటూ ముందుకెళ్తున్నారు. ఇంద్రవెల్లి బహిరంగ సభ తర్వాత జిల్లాలో పెద్దగా పార్టీ కార్యక్రమాలు చేపట్టక పోవడంతో ఆ పార్టీ శ్రేణులు నిరుత్సాహంగా కనిపిస్తున్నారు. ఆదివాసీలకు అండగా ఉంటామని పార్టీ చీఫ్ రేవంత్‌రెడ్డి ఇప్పటికే ప్రకటించిన ఆ వర్గాలకు దగ్గరయ్యే ప్రయత్నమే జరుగడం లేదు.

మావల మండలం వాఘాపూర్‌లో రచ్చబండ.. ఇటీవల పార్టీ పిలుపుతో మావల మండలం వాఘాపూర్‌లో రచ్చబండ కార్యక్రమానికి శ్రీకారం



చుట్టారు. ఏదో ఒక రోజు హడావిడి చే సి ఆ తర్వాత అంతా సైలెంట్‌టైపోయినట్లుగానే కనిపిస్తుంది. రచ్చబండ కార్యక్రమం జిల్లా ఇన్‌చార్జి మహేశ్వర్‌రెడ్డి ముందే కొందరు నేతలు జిల్లాలో పార్టీ పరిస్థితిపై బహిరంగ విమర్శలు చేయడం అసలైన నాయకత్వం లేక పోవడంతో పార్టీ పరిస్థితి అధ్వానంగా మారిందన్న అభిప్రాయాలు వ్యక్తం చేసినట్లు తెలుస్తుంది. కొన్నేళ్లుగా అధికారానికి దూరం కావడంతో కొందరు ముఖ్య నేతలు, సీనియర్ కార్యకర్తలు టీఆర్ఎస్, బీజేపీలో చేరిపోవడంతో పార్టీకి మరిన్ని కష్టాలు మొదలయ్యాయి. కొత్త నాయకత్వం పార్టీలో చేరేందుకు ముందుకు రాకపోవడంతో జిల్లాలో పార్టీ పరిస్థితి గందరగోళంగానే కనిపిస్తుంది. రైతులు అండగా నిలుస్తారా?కాంగ్రెస్ పార్టీ ప్రధానంగా రైతులకు దగ్గరయ్యేందుకే ప్రయత్నాలు మొదలు పెట్టింది. ఇందులో భాగంగానే వరంగల్ డిక్లరేషన్‌ను ప్రకటించింది. ఇప్పటికే రాష్ట్రంలో అమలవుతున్న పథకాలను దృ ష్టిలో పెట్టుకుని రైతులకు వరాలను కురిపించింది. అయితే కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను రైతులు ఏ మేరకునమ్ముతారో, ఎన్నికల సమయంలో అండగా నిలుస్తారా..? లేదన్నదే ప్రశ్నార్థకంగా మారుతుంది. వరంగల్ డిక్లరేషన్‌పై ప్రజల్లో మంచి స్పందనే కనిపిస్తున్న ఇంటింటికీ డిక్లరేషన్ అంశాలను తీసుకెళ్లడంలో పార్టీ శ్రేణులు ఏ విధంగా సక్సెస్ అవుతారోనన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. నెల రోజుల పాటు రచ్చబండ కార్యక్రమంతో గ్రామాల్లో రైతులకు అవగా హన కల్పించడం అనేది అంత సులువైన పనేమి కాదంటున్నారు. పదిరోజుల్లో వానకాల పంటల సాగు పనులు ప్రారంభమయ్యే అవకాశం ఉంది. దీంతో రైతులు బిజిబిజీగా మారి సాగు పనులకు పరిమితం కానున్నారు. ప్రధానంగా పంటల మద్దతు ధర లు, రూ.2లక్షల రుణమాఫీ, ఎకరాన రూ.15వేల రైతుబంధు పథకం లాంటి కార్యక్రమాలపై రైతుల్లో ఆసక్తి కనిపిస్తుంది. అయితే పార్టీ శ్రేణులు డిక్లరేషన్ అంశాలను ఎలా ముందుకు తీసుకెళ్తారన్నదే ప్ర ధాన సమస్యగా కనిపిస్తుంది.చెల్లాచెదురైన క్యాడర్..జిల్లా అగ్రనేతల మధ్య ఐక్యత లేకపోవడంతో ద్వితీయ శ్రేణి నేతలతో పాటు ముఖ్య కార్యకర్తలు తలోదారిలో పార్టీకి దూరమయ్యారు. జిల్లాలో మహేశ్వ ర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ప్రేంసాగర్‌రావులు చెరో గ్రూ పునకు నాయకత్వం వహించడంతో జిల్లా నేతల మధ్య విభేధాలు ముదురుతున్నాయి. రేవంత్‌రెడ్డి నాయకత్వంలో పార్టీ అధికారంలోకి వస్తుందని ఆశాభావం వ్యక్తమవుతున్న నేతలెవరూ గట్టిగా చెప్పలేని పరిస్థితి కనిపిస్తుంది. జిల్లాలో తలమడుగు, బజార్‌హత్నూర్, ఉట్నూ ర్, ఆదిలాబాద్ పట్టణంలో పార్టీకి కొంత పట్టు కనిపిస్తున్న మిగితా చోట్ల సర్పంచ్ స్థానం కూడా గెలువలేని పరిస్థితులున్నాయి. డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్ పార్టీ ముఖ్య నేతలను కలుపుకుని పోవడం లేదన్న వాదనలున్నాయి. మాజీ మంత్రి సి.రాంచంద్రారెడ్డి దాదాపుగా ప్రత్యక్ష రాజకీయాలకు దూరమయ్యాడనే చెప్పవచ్చు. ఏఐసీసీ సభ్యురాలు గండ్రత్‌సుజాత పార్టీ పిలుపుతో కార్యక్రమాలు చేపడుతున్న టీఆర్ఎస్, బీజేపీలపై మరింత దూ కుడు పెంచాల్సిన అవసరం ఉందంటున్నారు.

# మార్కెట్ నిధుల మళ్లింపుపై నిరసన

ఆదిలాబాద్ : కాగజ్‌నగర్ మార్కెట్ నిధులను సిద్దిపేట మార్కెట్ అభివృద్ధికి తరలించడంపై బీజేపీ నాయకులు మార్కెట్ కమిటీ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిర్పూరు నియోజకవర్గ నాయకుడు డాక్టర్ హరీష్‌బాబు మాట్లాడారు. కాగజ్‌నగర్ మార్కెట్ నిధులను సిద్దిపేట మార్కట్‌కు ఎలా తరలిస్తారని ప్రశ్నించారు. కాగజ్‌నగర్ రైతుల నుంచి సెస్ వసూలు చేసిన సొమ్ము 2కోట్ల రూపాయలు ఏకంగా సిద్దిపేట మార్కెట్ కమిటీకి తరలించడం దారుణ




మని చెప్పారు. ఈ విష యంలో స్థానిక ఎమ్మెల్యే కోనప్ప మౌనంగా ఎందుకు ఉంటున్నారని ప్రశ్నించారు. మార్కెట్ నిధులను వడ్డీతో సహా వసూలు చేసి ఇక్కడే ఖర్చు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని మార్కెట్ కమిటీ అధికారు లకు అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు గోలెం వెంక టేష్, నాయకులు ఈశ్వర్ దాస్, గజ్జి ప్రసాద్, ఉమ్మెర బాలకృష్ణ, దెబ్బటి శ్రీనివాస్, మా జీ కౌన్సిలర్ దెబ్బటి శ్రీనివాస్, పుల్ల ఆశోక్, మాచర్ల శ్రీనివాస్, శ్రీనివాస్, చిప్పకుర్తి రమేశ్, ఆశోక్‌కుమార్, అనిల్, పోచయ్య, రాజేం దర్ జంజోడ్, గోవింద్ మండల్, పాగిడే రాకేష్, భీమన్కార్ బాబురావు, గణపతి, కౌశిక్, రాజు, రవి పాల్గొన్నారు.

# మాట వినకుంటే వేటు

నిర్మల్ : మాట విన్నారా సరే... లేదంటే బదిలీ వేటు పడినట్లే...! జిల్లాలో జిల్లాస్థాయి అధికారుల పనితీరు నచ్చకపోతే ఇబ్బడి ముబ్బడిగా బదిలీవేటు వేస్తున్నారన్న ఆరోపణలు వ్యక్తమవుతు న్నాయి. సాధారణ బదిలీలు లేకపోయినా.. ఉన్నతాధికారుల పదవీ కాలం పూర్తికాకపోయినా ఇక్కడ బదిలీ జరుగుతుంది. అవసరమైతే స్పెషల్ జీఓలు తెప్పించి మరీ బదిలీవేటు వేస్తున్నారు. గడిచినా నాలుగు నెలలకాలంలో ఐదుగురు ఉన్నతాధికారులపై బదిలీవేటు పడడం చర్చనీయాంశంగా మారింది. అధికారపార్టీ నియోజకవర్గస్థాయి అగ్రనేతల ఒత్తిళ్లకు జిల్లా అధికారులు బలవుతున్నారు. గతంలో జిల్లాలో పనిచేసే అవకాశం దక్కడం అంటే అదొక ఉత్తమఛాన్స్‌గా అధికారులు భావించేవారు. కానీ పరిస్థితులు మారుతున్నాకొద్దీ నేతల అధికారదా హం, అక్ర మాలను అడ్డుకుంటున్నారన్న అక్కసు వంటి కారణాలతో బదిలీలు ఎ క్కువగా పెరిగిపోతున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటిదాక ఐదుగురు అధికారులను బదిలీ చేసిన తీరుచూస్తే ఆ అధికారులను రాజకీయ ఒత్తిళ్ల కారణంగానే బదిలీ చేసిన విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆ ముగ్గురికి నచ్చకపోతే బదిలీ వేటేజిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో పెద్దన్నపాత్ర పోషిస్తున్న ఆ ముగ్గురునేతలకు అధికార యంత్రాంగం చెప్పుచేతల్లో మెలగాల్సిందే. పోలీసు అధికారుల నుంచి మొదలుకొని కీలక ప్రభుత్వశాఖల్లో ముఖ్యమైన పోస్టుల్లో కొనసాగే ఉన్నతాధికారులు వారిని ప్రసన్నం చేసుకోవాల్సిందే. లేదంటే రాష్ట్రస్థాయిలో ఒత్తిళ్లులు తెచ్చి అధికారులపై బదిలీ వేటు వేయిస్తారన్న అభిప్రాయాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. ఈ విషయాన్ని అధికార పార్టీ నేతలే అవునంటున్నారు. నిర్మల్ నియోజకవర్గంలో కొనసాగుతున్న కాళేశ్వరం ప్రాజెక్ట్ ప్యాకేజీ నంబర్ – 27 డిప్యూటీ ఈఈగా పనిచేసిన జగదీష్‌ను తక్కువకాలంలోనే బదిలీచేశారు. ఇక్కడి నేతకు సన్నిహితంగా ఉండే మరో డీఈని ఇక్కడికి తీసుకువచ్చారు. గతంలో ప్యాకేజీనంబర్ – 27 బాధ్యతలతో పాటు సరస్వతీ కాలువ వ్యవహారాలు చూసిన ఆ అధికారిని తమకు అనుకూలంగా ఉంటాడన్న కారణంగా మళ్లీపోస్టింగ్ ఇప్పించారన్న ఆరోపణలున్నాయి. మత్స్యశాఖలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేసిన దేవేందర్‌ను కరీంనగర్‌కు డిప్యూటేషన్‌పై పంపించారు. ఖానాపూర్ నియోజకవర్గ ముఖ్యనేత ఆయనను పట్టుబట్టి మరీబదిలీ చేయించారన్న ఆరోపణలున్నాయి. తమకు అనుకూలంగా ఉన్నవ్యక్తిని జగిత్యాల్ నుంచి ఇక్కడికి బదిలీపై రప్పించినట్లు తెలుస్తోంది. ఇటీవల పురపాలకసంఘం పారిశుధ్య కార్మికుల నియామక ప్ర క్రియలో వ్యూహాత్మకంగా కమిషనర్‌ను అధికారపార్టీ ఒత్తిళ్లతో బదిలీ చే యించారన్న ఆరోపణలున్నాయి. గతంలో మున్సిపల్ డీఈగా పనిచేసిన సంతోష్‌ను కూడా రాజకీయ ఒత్తిడిలతోనే బదిలీ చేసినట్లు ప్రచారం ఉండగా తనకు అనుకూలంగా ఉంటాడని మరోనేత ఆయనను ఖానాపూర్‌లో డిప్యూటేషన్‌పై పోస్టింగ్ ఇప్పించుకున్నట్లు విమర్శలున్నా యి. ఇక నిర్మల్ డీఎస్పీ ఉపేందర్‌రెడ్డి బదిలీకి ముందు నుంచే తమకు అనుకూలంగా ఉండే మరో అధికారి స్థానికంగా అటాచ్‌పోస్టు ఇప్పించి ఇటీవలనే రెగ్యులర్ డీఎస్పీగా అవకాశం కల్పించినట్లు కూడా విమర్శలున్నాయి. ఆర్డీఓ పోస్టుల్లో తహసీల్దార్‌లు...? నిర్మల్ జిల్లాలో రెండు ఆర్డీఓ పోస్టులు ఉన్నాయి. నిర్మల్ , భైంసా ఆర్డీఓ స్థానాల్లో ఇప్పుడు తహసీల్దార్‌లకు ఆర్డీఓలుగా పదవి బాధ్యతలు ఇవ్వడం విమర్శలతో పాటు చర్చనీయాంశంగా మారింది. గతంలో భైంసాలో ఆర్డీఓగా పని చేసిన రాజు బదిలీ కాగా తాజాగా నిర్మల్ ఆర్డీఓ రాథోడ్ రమేష్‌పై బదిలీ వేటు వేశారు. రెవెన్యూ రికార్డుల వ్యవహారంలో కొన్ని డి– 1 పట్టాల విషయంలో కొంతకాలం నుంచి అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరించిన ఆ అధికారిని వ్యూహాత్మకంగా భవిష్యత్ విచారణల నేపథ్యంలో బదిలీపై పంపించినట్లు తెలుస్తోంది. భైంసాలో లోకేశ్వర్‌రావు , నిర్మల్‌లో తుకారం అనే ఇద్దరు తహసీల్దార్‌లకు ఏకంగా ఆర్డీఓ స్థానాల్లో ఎఫ్ఏసీ ( ఫుల్ అడిషనల్ చార్జ్ )గా నియమస్తూ ఉ త్తర్వులు జారీ చేయడంలో కూడా అధికార పార్టీ నేతల హస్తం ఉ న్నట్లు తెలుస్తోంది. ఈ పరిణామాలన్ని చూస్తుంటే తమ మాట వింటే సరి లేకపోతే బదిలీ వేటు తప్పదన్న రీతిలో అధికార పార్టీ నేతలు వ్యవహరిస్తున్నట్లు ప్రచారం ఉంది. మరో ముగ్గురు కీలక శాఖ అధికారులపై కూడా బదిలీ వేటు వేస్తారన్న ప్రచారం జరుగుతోంది. ఇదీ అధికార వర్గాల్లో కలకలం రేపుతుండగా కొందరు అధికారులు నేతల తీరు పట్ల ఆందోళన చెందుతున్నారు. మితిమీరిన రాజకీయ జోక్యం వల్ల నిర్మల్ జిల్లాలో పని చేయకపోవడమే మంచిదన్న అభిప్రా యానికి అధికారులు వస్తున్నారు. జిల్లాకు వచ్చేందుకు వెనకంజతరచు గా అధికారులను బదిలీ చేస్తున్న తీరుతో ఈ జిల్లాకు వచ్చేందుకు అధికారులుల ఆసక్తిని చూపడం లేదు. ముఖ్యంగా నిర్మల్ మున్సిపల్ కమిషనర్ పోస్టు విషయంలో అధికారులు పెదవి విరుస్తున్నట్లు సమాచారం. చిన్న చిన్న విషయాలకే పొగ పెట్టి ఇక్కడి నుంచి పంపిస్తారన్న ప్రచారం నేపథ్యంలో ఇక్కడికి రావడానికి జంకుతున్నారు. అలాగే ఇతర కీలక శాఖల పోలీసు , రెవెన్యూ విభాగాల అధికారులు కూడా ఎందుకు వచ్చిన గొడవ అన్నట్లు నిర్మల్ జిల్లాకు వచ్చేందుకు వెనకంజ వేస్తున్నట్లు అధికార వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.

# వానాకాలం సాగుకు కార్యాచరణ సిద్ధం




ఆసిఫాబాద్ : జిల్లాలో వానాకాలం పంటల సాగుకు వ్యవసాయశాఖ 2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కార్యాచరణ సిద్ధం చేసింది. ఈ యేడాది రుతుపవనాలు జూన్ మొదటి వారంలోనే వచ్చే అవకాశం ఉంటుందన్న వాతావరణ శాఖ అంచనాల నేపథ్యంలో జిల్లా వ్యవసా యాధికారులు పంటల సాగు ప్రణాళిక సిద్ధం చేశారు. ఊహించిన ట్లుగానే ఈ ఏడాది కూడా జిల్లాలో పత్తి పంటే అధిక విస్తీర్ణంలో సాగు చేయవచ్చని అధికారులు అంచనా వేశారు. గతేడాది 3.40లక్షల ఎకరాల్లో పత్తి పంట సాగు చేసినట్టు లెక్కలు తీశారు. ఈ సారి మరో పది వేల ఎకరాల సాగు పెరుగవచ్చని భావిస్తున్నారు. పత్తికి తోడు కంది, వరి, జొన్న, పెసర, మినుములు వంటి ఇతర పంటలను కూడా సాగు చేయవచ్చని అంచనా వేశారు. ఇందులో వరి సాధారణ విస్తీర్ణం 50వేల ఎకరాలు కాగా, ఈ సారి 55వేల ఎకరాల వరకు సాగు చేయ వచ్చని భావిస్తున్నారు. అలాగే కంది సాధారణ విస్తీర్ణం 50వేల ఎకరాలకు గాను ఈ సారి కూడా 50వేల ఎకరాల్లో సాగు చేయవచ్చని అంచన వేశారు. జొన్నపంటకు సంబంధించి 1000 ఎకరాలు, పెసర, మినుము వంటి పప్పు ధాన్యాల పంటు 2వేల ఎకరాల్లో సాగు చేయించేందుకు ప్రణాళి కలు సిద్ధం చేశారు. ఇవి కాకుండా ఆరువేల ఎకరాల్లో పోషకాహార పంటలైన చిరుధాన్యాల పంటలను సాగు చేసేందుకు ప్రత్యేకంగా చర్య లు చేపడుతున్నారు. ఇందుకు గాను వందశాతం సబ్సిడీపై రైతులకు 130 క్వింటాళ్ల చిరుధాన్యం విత్తనాలను పంపిణీ చేయనున్నారు. మొత్తం మీద ఈ ఏడాది జిల్లాలో ప్రధాన పంటకు 4.50లక్షల ఎకరాల్లో సాగు చేస్తారని భావిస్తున్నారు. ఇవి కాకుండా ఉద్యానవనశాఖ ద్వారా మరో 10 నుంచి 20 వేల ఎకరాల్లో వివిధ రకాల కూరగాయాల పంటలు సాగు అయ్యే అవకాశాలున్నాయని చెబుతున్నారు. ముఖ్యంగా కాగజ్ నగర్, ఆసిఫాబాద్ పట్టణాలకు సమీపంలో ఉండే మండలాల్లో కూర గాయాల సాగును ప్రోత్సహించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొంది స్తున్నారు. జిల్లాలో పత్తి సాగుకు సంబంధించి యేటా అంచనాలకు మించి ఉంటున్న నేపథ్యంలో సీజన్ ప్రారంభమైన తర్వాత సాగు విస్తీర్ణం కాస్తా అటు ఇటుగా మారే అవకాశాలున్నాయని చెబుతు న్నారు. – సాగు పనులకు..వానాకాలం పంటల సాగుకు సంబంధించి రైతులు పనులను ప్రా రంభించారు. దుక్కులు చేస్తూ తొలకరి వర్షానికే విత్తనాలు పెట్టేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మెట్ట పంటలను పక్కన పెడితే వరి సాగులో జీ లుగ పంటను నాటి రసాయన ఎరువుగా రైతాంగం ఉపయోగిస్తున్నది. దీంతో ఈ యేడాది రైతాంగాన్ని దృష్టిలో పెట్టుకొని 65 శాతం సబ్సిడీపై 221 క్వింటాళ్ల జిలుగ విత్తనాలను ప్రభుత్వం రైతులకు అందు బాటులోకి తెచ్చింది. ఇందులో ఒక్క క్వింటాకు 6,325 రూపాయలు ధరగా నిర్ణయించారు. ఇందులో 4,013 సబ్సిడీ 2,214 రూపాయలు రైతు వాటాగా నిర్ణయించారు. ఈ విత్తనాలను జిల్లాలోని 15 మండలాల పరిధిలో ఉన్న ఆగ్రో సెంటర్లు, ప్రాథమిక సహకార సంఘాలు, సీసీ ఎం ఎస్ విక్రయ కేంద్రాల్లో అందు బాటులో ఉంచారు. జిలుగ విత్తనాలను కావాలనుకునే రైతాంగం సంబంధిత మండలాల్లో ఉండే వ్యవసా యాధికారుల నుంచి ధ్రువీకరణ పత్రం తీసుకొని కొనుగోలు కేంద్రాల్లో రాయితీపై ఈ విత్తనాలను పొందే వీలు కల్పించారు.

– అవసరమైన ఎరువులు, విత్తనాలు..వానాకాలం పంటల సాగుకు రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలను అందుబాటులో ఉ ంచేందు కు జిల్లా వ్యవసాయ శాఖ కసరత్తు పూర్తి చేసింది. జిల్లాలో యూరియా, డీఏపీ, ఎరువుల వంటి అన్ని ఎరువులు కలుపుకొని 25, 211 టన్నుల అందు బాటులో ఉంచినట్టు చెబుతున్నారు. అయితే ఈ సీజన్‌లో మొత్తం 92 టన్నుల ఎరువులు అవసరం కావచ్చని అంచనా వేశారు. ఇందులో యూరియా 46 వేల టన్నులు, డీఏపీ 23వేల టన్నులు, పోటాష్ 23వేల టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 20వేల టన్నులు, సింగిల్ సూపర్ ఫాస్పెట్ 20వేల టన్నులు అవసరం కావచ్చని అంచనా వేశారు. కాగా ప్రస్తుతం యూరియా 22,119 టన్నులు, డీఏపీ 614 టన్నులు, పోటాష్ 141 టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 176 టన్నులు, పాస్పెట్ 629 టన్నులు అందుబాటులో ఉన్నాయని అలాగే పత్తి సాగుకు సంబంధించి మొత్తం 7 లక్షల విత్తన ప్యాకెట్లు అవసరం అవుతాయని అంచనా వేశారు. ప్రస్తుతం 4లక్షల విత్తన ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయి. జిల్లాలో మొత్తం 295 ఫెర్టిలైజర్ షాపులుండగా, అన్ని దుకాణాల్లో విత్తనాలు అందుబాటులో ఉంచ నున్నారు. అవసరాన్ని బట్టి మరిన్ని విత్తనాలను తెప్పించేందుకు చర్యలు తీసుకుంటామని చెబుతున్నారు.

బీటీ3 విత్తనాలు సాగు చేయొద్దు..–శ్రీనివాస్ రావు, జిల్లా వ్యవసాయా శాఖ అధికారిరైతాంగం అనుమతి లేని, హానికరమైన బీటీ3 విత్తనాలు సాగు చే యొద్దు. దీని వల్ల పర్యావరణ నష్టంతో పాటు భూముల సారం దెబ్బ తింటుంది. దిగుబడులు తగ్గి రైతు లు నష్టాల పాలవుతారు. ఈ విత్త నాలను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. రైతులు ఏ విత్తనం కొనుగోలు చేసినా దుకాణాల నుంచి రశీదులు తప్పకుండా తీసుకొని భద్రపరుచుకోవాలి. విత్తనాల నాణ్య తలేని కారణంగా రైతులు పంటలు నష్టపోతే ఆ రశీదుల ఆధారంగా సదరు కంపెనీలపై చర్యలు తీసుకునే అవకాశం ఉంది. ఈ విషయాలను దృష్టిలో పెట్టుకోవాలి.

# ప్రణాళికాబద్ధంగా చదవాలి

ఆదిలాబాద్ : పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువత సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ ప్రణాళికాబద్ధంగా చదివి లక్ష్యాన్ని సాధించాలని అదనపు కలెక్టర్ వరుణ్‌రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే కోనప్ప ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోలీసు శిక్షణ శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. రాష్ట్ర ప్రభు త్వం వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసేందుకు నోటిఫికేషన్లు ఇచ్చిందన్నారు. యువత దీన్ని సద్వినియోగం చేసుకుని ఉద్యోగం సాధించేందుకు కష్టపడి చదవాలని సూచించారు. ఎమ్మెల్యే కోనప్ప మాట్లాడుతూ పోటీ పరీక్షలు రాసే అభ్యర్థులందరికీ అన్ని వస తులు కల్పిస్తున్నామన్నారు. నిపుణులైన శిక్షకులతో కోచింగ్ ఇస్తున్నా మని చెప్పారు. తప్పకుండా నమూనా పరీక్షలు రాయాలన్నారు. వీటి లో సాధించిన మార్కులను సరి చూసుకుంటూ ముందుకు వెళ్లాలని సూచించారు. సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కాసం శ్రీనివాస్, మున్సిపల్ వైస్‌చైర్మన్ రాచకొండ గిరిష్ తదితరులు పాల్గొన్నారు.

# పప్పు దినుసుల సాగేది

ఆసిఫాబాద్ : జనాభా అవసరాలకు అనుగుణంగా ఆహారో త్పత్తి పెరగ డం లేదు. మాంసాహారంతో సమానంగా పోషకాలను అందించే పప్పు దినుసుల సాగు గణనీయంగా తగ్గింది. జిల్లాలో మొత్తం ఆహారధాన్యాల ఉత్పత్తిలో పప్పుదినుసుల శాతం చాలా తక్కువగా ఉంది. వాణిజ్యపంటలు సంప్రదాయ సాగును వెనక్కు నెట్టేస్తున్నాయి. చాలా ఏళ్లు స్థిరంగా ఉన్న పప్పుదినుసుల దిగుబడులు కొన్నేళ్లుగా క్షీణిస్తూ వస్తున్నాయి. యాసంగిలో జిల్లాలో 74,664 ఎకరాల్లో సాగు కాగా పప్పుదినుసులు 2940 ఎకరాల్లో మాత్రమే సాగు చేశారు.పప్పు దినుసుల సాగు కనిష్ట స్థాయికి పడిపోవడం తో ఆహారభద్రతపై ప్రభావం చూపుతుందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వానాకాలం సీజన్ లో అపరాల సాగు విస్తీర్ణం పెంచేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైన ఉంది.జిల్లాలో యాసంగిలో సాగైన పప్పు దినుసుల పంటల వివరాలుమినుములు: 879 ఎకరాలుపెసలు: 1506 ఎకరాలుకందులు 219 ఎకరాలుశనగలు 336మొత్తం 2940 ఎకరాలు– గణనీయంగా తగ్గిన సాగు విస్తీర్ణంపప్పు దినుసుల సాగులో గతంలో రాష్ట్రంలోనే జిల్లా అగ్రభాగాన ఉండేది. పదేళ్ల కిందట దాదాపు 40 వేల ఎకరాల్లో సాగయ్యే పప్పుదినుసుల సాగు ప్రస్తుతం మూడు వేల ఎకరాలకు పడిపోయింది. ప్రాణహిత, గోదావరి పరివాహక ప్రాంతాల్లో సాగైన పప్పుదినుసుల పంట క్రమంగా తగ్గుతూ వచ్చింది. పత్తి, మిరప, పొద్దు తిరుగుడు తదితర వాణిజ్య పంటల వైపు రైతులు మొగ్గుచూపారు. జిల్లాలో కంది, శనగ, పెసర, మినుము వంటి పప్పు దినుసులు గతంలో విరివిగా పండించే వారు. జనాభాతో పోల్చితే పండిస్తోంది అతి తక్కువ. అవసరానికి సరిపడ ఉత్పత్తి లేకపోవడంతో పప్పు దినుసులను దిగుమతి చేసుకోక తప్పడం లేదు. కంది మినహా మినుము, పెసర, శనగ లాంటి పప్పు దినుసుల సాగు సమయం తక్కువే. పెట్టుబడులు కూడా అంతంత మాత్రంగానే ఉంటాయి. వాణిజ్య పంటలతో పోల్చుకుంటే రైతులకు లాభాలు తక్కువగా వస్తుండటంతో పప్పు దినుసుల సాగుపై మొగ్గ చూపడం లేదు. యేటా జిల్లాలో పప్పు దినుసుల ఉత్పత్తి తగ్గి పోతుండటంపై వ్యవసాయ శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. –పట్టించుకోని ప్రభుత్వంపప్పుదినుసులు పండించడంలో ఉన్న ఇబ్బందులతో రైతులు సాగుకు మొగ్గ చూపడం లేదు. మార్కెట్ పరంగా పంటకు ప్రోత్సాహకాలు అంది స్తేనే పప్పుదినుసుల సాగు పెరుగుతుందని నిపుణులంటున్నారు. ఆహార భద్రత కోసం తీసుకు వచ్చిన హరిత విప్లవం కూడా వ్యవసాయ విధానంలో భాగమైన పప్పుదినుసులను దూరం చేసింది. భారీ ప్రాజెక్టులు, చెరువులతో నీరు సమృద్ధిగా ఉ ండి భూములన్ని వరి పంటకు మారిపోయాయి. పప్పు దినుసులకు ప్రాముఖ్యత లేకుండా పోతోంది. పరిశోధన, సాంకేతిక విషయాల్లో ప్రోత్సాహం కనిపించడం లేదు. అపరాల్లో సైతం జీవవైవిధ్యం తగ్గిపోతోందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. కనీసం 30 శాతం వృద్ధి పెంచడానికి అవకాశం ఉన్నప్పటికీ ఆ దిశగా ప్రయత్నాలు చేయడం లేదనే ఆరోపణలున్నాయి. కేవలం పది శాతమే అధికారిక ఆమోదం పొందిన విత్తనాలు వాడుతున్నారు. విత్తన సంస్థలు పప్పు దినుసుల హైబ్రీడ్ రకాలను ఉత్పత్తి చేయడం లేదు. కందికి మాత్రమే హైబ్రీడ్ రకాలున్నాయి. సర్కారు పప్పు దినుసుల ఉత్పత్తిని పెంచడానికి ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. 20 ఏళ్లుగా హెక్టారుకు ఆరు క్వింటాళ్ల సగటు దిగుబడి మాత్రమే వస్తోంది. పప్పుదినుసులకు మార్కెట్ నుంచి సరైన రక్షణ లేదు. రిటైల్ మార్కెట్లో ఉన్న ధరకు హోల్‌సేల్ మార్కెట్లో ఉన్న ధరలకు వ్యత్యాసం పొంతన లేకుండా ఉ ంటోంది. తీసుకోవల్సిన జాగ్రత్తలు– వరి, పత్తి పంటలకు ఇచ్చిన ప్రాధాన్యం పప్పుదినుసుల సాగుకు ఇవ్వాలి. – కొనుగోళ్ల పర్యవేక్షణకు ఉన్నతస్థాయి కమిటీని నియమించాలి– పప్పుదినుసుల సాగులో అధిక దిగుబడలు సాధించే వంగడాలను అభివృద్ధి చేయాలి. – దిగుబడులను పెంచడం సహా స్వల్పకాలిక రకాలను రూపొందించడంపై దృష్టి సారించాలి. – ప్రభుత్వాలు మద్దతు ధర ప్రకటనతోనే ఆగిపోకూడదు. వరి, గోధుమల్లాగా భారత ఆహార సంస్థ వీటిని సేకరించాలి. – నాణ్యమైన విత్తనాలు సరఫరా చేయాలి. – వర్షాధార వరి సాగు చేసే ప్రాంతాల్లో పప్పుదినుసులను ప్రోత్సహించాలి. – పత్తిలో అంతర పంటగా సాగు చేసేలా చూడాలి.

నాడు పుట్ల కొద్ది పండేటివికాల్వ బీరయ్య, రైతు నందులపల్లి, నెన్నెల మండలంకందులు, పెసలు, శనగలు గతంలో పుట్ల కొద్ది పండేటివి. ఇప్పుడు తిందామంటే దొరుకుత లేవు. చెరువులు, కుంటల శిఖాల్లో ఊరంత ఒకటై శనగలు వేసేటోల్లు. అట్ల పప్పు దినుసులు పండించే కాలం పోయింది. అందరు పత్తి పంటకు ఎగబడ్డరు. ఏడ చూసిన పత్తే కనిపిస్తున్నది. ఇంటి పెరళ్లల్లో కూడా పత్తి పెడుతున్నరు. పైసల కోసం పండించే పంటలు ఎప్పటికి మంచిది కాదు.

# ధరాఘాతం!

ఆదిలాబాద్ : ప్రజల ఆదాయం పెరగకున్నా ఇంటి ఖర్చులు మాత్రం తడిసి మోపెడవుతున్నాయి. పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలతో పేద, మధ్య తరగతి జనం విలవిలలాడుతున్నారు. పొద్దున లేవగానే తాగే పాల దగ్గరి నుంచి వంట నూనెలు, కూరగాయలు, వీటికి తోడు మటన్, చికెన్ ధరల వరకు అన్ని వస్తువులు మండిపోతున్నాయి. జిల్లాలో ప్రజలు నిత్యం కొనుగోలు చేసే నిత్యావసరాల ధరలు కొనకుండానే భగ్గుమంటున్నాయి. ఏడాది కిందటితో పోలిస్తే పల్లెల నుంచి పట్టణాల వరకు ఇంటి ఖర్చులు భారీగా పెరిగాయి. గతంలో కిరాణా సరుకులు, పాలు, కరెంట్ బిల్లులు కలిపి నలుగురు సభ్యులున్న కుటుంబానికి రూ.6వేలు అయ్యే ఖర్చు ప్రస్తుతం రూ.10వేలు దాటి పోతోంది. దీనికి తోడు అద్దె ఇళ్లలో ఉండే ప్రజలకు గత నెల వరకు రూ.4 నుంచి రూ.5వేలు, రూ.5వేల నుంచి రూ.6వేల వరకు ఉన్న అద్దె రూ.6వేల నుంచి రూ.7వేల వరకు పెరిగి పోవడంతో కుటుంబానికి నెల ఖర్చులు మొత్తం కలిపి రూ.20వేలు చేరిపోతుంది. దీంతో సామాన్యుని ఇంటి బడ్జెట్ తలకిందులు కావడంతో ఏది కొనాలో... ఏది తినాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు. రోజు రోజుకు పెరుగుతున్న ధరలకు ఏది కొనాలన్న, ఏది తినాలన్న ఒకటికి రెండు సార్లు ఆలోచించుకోవాల్సి వస్తుంది. కిలో కొనే దగ్గర అరకిలో సరిపెట్టుకుంటున్నారు. చికెన్ వండుకుందామంటే సామాన్యుడు భయపడే పరిస్థితి వచ్చింది. ప్రస్తుతం స్కిన్‌లెస్ చికెన్ ధర రికార్డు స్థాయిలో రూ.300లు పలుకుతుండగా స్కిన్ చికెన్ రూ.240 నుంచి రూ.280 వరకు చెల్లించాల్సి వస్తుంది. నెల రోజుల కింద రూ.200లు ఉన్న చికెన్ ధర ఇప్పుడు ఏకంగా వంద రూపాయలు పెరగడంతో సామాన్యజనం ముక్క తినాలన్న వెనుకడుగువేయాల్సి వస్తుంది. రూ.వందకు చేరువలో టమాట..అసలే మండుటెండలు కావడంతో టమాట దిగుబడి తగ్గి పోవడంతో ఒక పక్క రైతులు ఆందోళన చెందుతుండగా మార్కెట్‌లో టమాట ధర వందకు చేరువలో పలుకుతోంది. కూరగాయల మార్కెట్‌లో ఏది కొనాలన్నా కిలో రూ.70కి తక్కువ లేదు. ఎండలు పెరుగడంతో దిగుబడి తగ్గి రవాణా చార్జీల ఫలితంగా 10 రోజుల్లోనే కూరగాయల రేట్లు ఒకటికి రెండింతలయ్యాయి. టమాట ధర గత నెలలో రూ.20కిలో ఉంటే ఇప్పుడు మార్కెట్‌లో రూ.90కి చేరువైంది. దీనితో పాటు ఇతర కూరగాయాలైన మిర్చి, వంకాయ, గోబి, బీన్స్, బీరకాయ, మునకాయవంటివి రూ.50 నుంచి రూ.80 కేజీ వరకు మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. ఈ ధరలతో సామాన్యుడు మొన్నటి వరకు మాంసపు ధరల పెరుగుదలతో కూరగాయలను కొనుగోలు చేసిన నేడు ఆ పరిస్థితి పూర్తిగా కనిపించకుండా పోయింది. మండుతున్న నూనెలు..జిల్లాలో వంట నూనెల ధరలు తగ్గడం లేదు. ఆయిల్ రేట్లపై రష్యా ఉక్రెయిన్ యుద్ధ ప్రభావం ఇంకా కొనసాగుతూనే ఉంది. ఈ యుద్ధానికి ముందు హోల్‌సేల్ షాపుల్లో బ్రాండెడ్ పల్లి నూనె లీటర్‌కు రూ.135 నుంచి రూ.150 పలుకగా ప్రస్తుతం రూ.200లకు చేరింది. రిటైల్ షాపుల్లో అయితే రూ.210 వరకు అమ్ముతున్నారు. గతంలో ఒక ఇంట్లో ఆరు ఏడు ప్యాకెట్లు అవసరమైన నూనె వాడేవాళ్లు.



# కేశవానంద భారతి కేసు
# చారిత్రక తీర్పునకు 50 ఏళ్లు

దిల్లీ: రాజ్యాంగ మౌలిక స్వరూపం, పౌరుల ప్రాథమిక హక్కులకు సంబంధించి అత్యంత కీలకమైన కేసుగా కేశవానంద భారతి కేసు న్యాయచరిత్రలో నిలిచింది. కేరళ భూసంస్కరణల చట్టాన్ని సవాల్ చేస్తూ దాఖలైన ఆ కేసులో వచ్చిన తీర్పు.. తదనంతరం ఎన్నో కేసులకు దిక్సూచిగా నిలుస్తోంది. 'కేశవానంద భారతి వర్సస్ స్టేట్ ఆఫ్ కేరళ'గా ప్రాచుర్యం పొందిన ఈ కేసు తీర్పు వెలువడి ఏప్రిల్ 24తో 50 ఏళ్లు పూర్తయ్యింది. ఈ నేపథ్యంలో భారత సర్వోన్నత న్యాయస్థానం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ కేసు వాదనలు, లిఖిత పూర్వక ప్రతులతో పాటు చరిత్రాత్మక తీర్పుతో ఓ ప్రత్యేక వెబ్ పేజీని సుప్రీంకోర్టు రూపొందించింది. 'యావత్ ప్రపంచ పరిశోధకులు చూసేందుకు వీలుగా కేశవానంద కేసుకు సంబంధించి ఉన్న అన్ని లిఖిత పూర్వక దస్త్రాలతో కూడిన ఓ వెబ్‌పేజీని ఏర్పాటు చేశాం. 50ఏళ్ల క్రితం ఇదే రోజున (ఏప్రిల్ 24, 1973) దీనికి సంబంధించిన తుది తీర్పు వెలువడింది' అని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ పేర్కొన్నారు. దీంతో కోర్టు హాలులో ఉన్న న్యాయవాదులందరూ హర్షం వ్యక్తం చేశారు. పరిశోధకులు, విద్యార్థులు, న్యాయవాదులకు ఇది ఎంతగానో దోహదపడుతుందన్నారు.

**అసలేమిటీ కేసు..? :** కేరళ ప్రభుత్వం ఆశ్రమాల ఆస్తులను స్వాధీనం చేసుకోవడాన్ని వ్యతిరేకిస్తూ ఆధ్యాత్మిక గురువు కేశవానంద భారతి సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఇందులో భాగంగా పార్లమెంటు చేసిన 24, 25, 29వ రాజ్యాంగ సవరణల చెల్లుబాటును ఆయన సవాలు చేశారు. ఈ సవరణలు న్యాయవ్యవస్థ అధికారాలతోపాటు పౌరుల ప్రాథమిక హక్కులకు భంగం కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. దీనిపై 1972 అక్టోబర్ 31న ప్రారంభమైన విచారణ 1973 మార్చి 24 వరకు సాగింది. అప్పట్లో ఈ కేసును 13 మంది న్యాయమూర్తుల ధర్మాసనం విచారించింది. ఒక కేసు విచారణ కోసం 13 మంది న్యాయమూర్తులతో విస్తృత ధర్మాసనం ఏర్పాటు చేయడం సుప్రీంకోర్టు చరిత్రలోనే తొలిసారి. అయితే, విచారణ సందర్భంగా రాజ్యాంగంలోని ప్రాథమిక సూత్రాలు, మౌలిక స్వరూపాన్ని మార్చే హక్కు పార్లమెంటుకు ఉందా? లేదా? అనే ప్రశ్న తెరమీదకు వచ్చింది. 68 రోజుల పాటు సుదీర్ఘ విచారణ జరిపిన విస్తృత ధర్మాసనం.. రాజ్యాంగ మౌలిక సిద్ధాంతానికి సుప్రీంకోర్టే సంరక్షణదారు అని చరిత్రాత్మక తీర్పు వెలువరించింది.

రాజ్యాంగంలోని ఏ విషయంలోనైనా సవరణలు చేసే అధికారం పార్లమెంటుకు ఉన్నప్పటికీ.. మౌలిక స్వరూపాన్ని, ప్రాథమిక హక్కులను మార్చలేదని తెలిపింది. దేశ సర్వోన్నత న్యాయస్థానం వాటి సంరక్షణ బాధ్యత చూస్తుందని స్పష్టం చేసింది. దీనర్థం.. ప్రజాస్వామ్యం, లౌకికవాదం, సమాఖ్య, చట్టం అందరికీ సమానం వంటివి రాజ్యాంగ ప్రాథమిక సూత్రాల మౌలిక స్వరూపాన్ని మార్చే అధికారం పార్లమెంటుకు లేదని తెలిపింది.

# సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మరోసారి వైయస్ జగనే సీఎం కావాలి : మంత్రి ఆదిమూలపు సురేష్



తాడేపల్లి: రాబోయే రోజుల్లో ఎస్సీ కుటుంబాలు ఏకతాటిపైకి వచ్చి తమకు అందుతున్న సంక్షేమ పథకాలు భవిష్యత్తులోనూ కొనసాగాలంటే వైయస్ జగన్‌ను మరోసారి సీఎం చేయాల్సిన అవసరం ఉందని మంత్రి ఆదిమూలపు సురేష్ పేర్కొన్నారు. తాడేపల్లిలో వైయస్ఆర్‌సీపీ ఎస్సీ ముఖ్య నేతలు సమావేశమయ్యారు. ఈ సమావేశానికి మంత్రులు నారాయణ స్వామి, మేరుగు నాగార్జున, విశ్వరూప్, ఆదిమూలపు సురేష్ హాజరయ్యారు. రాష్ట్రంలో ఎస్సీలకు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై చర్చించారు సమావేశం అనంతరం మంత్రి ఆదిమూలపు సురేష్ మీడియాతో మాట్లాడారు. టీడీపీ హయాంలో మసిపూసి మారేడుకాయ చేసినట్లు ఎస్సీలకు కొన్ని పథకాలు పెట్టి అవి కేవలం టీడీపీ కార్యకర్తలకు అందేలా చేసి అవినీతికి పాల్పడిన పరిస్థితి ఉందని, వాటన్నింటినీ వైయస్ఆర్‌సీపీ ప్రభుత్వం సరిదిద్దిందని తెలిపారు. ఈరోజు ఎస్సీ కుటుంబాలకు గతంలో ఎన్నడూ లేని విధంగా మేలు కల్గించేలా సంస్థాగత మార్పులు, సంస్కరణలు చేస్తూ ప్రధానంగా విద్య, వైద్యం వంటి అంశాల్లో గత నాలుగు సంవత్సరాలుగా సీఎం వైయస్ జగన్ అందించిన పరిపాలన మీద ఈరోజు చర్చించాం. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో సంక్షేమ పథకాల మీద ప్రతిపక్షాలు వక్రభాష్యంతో బురద జల్లే ప్రయత్నం చేస్తున్నాయి. వాటిని తిప్పికొట్టి ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాల గురించి వివరించాలని ఈరోజు తీర్మానించాం. ప్రధానంగా ఈ ప్రభుత్వం మూల సూత్రాలు జవాబుదారీతనం, పారదర్శకత, అవినీతి రహిత పాలనను నాలుగు సంవత్సారాలుగా ఏ విధంగా అందిస్తున్నారనే విషయంపైనా చర్చించామని తెలిపారు. ఈ సమావేశంలో వైయస్ఆర్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామాకృష్ణారెడ్డి, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఎంపీ గురుమూర్తి పాల్గొన్నారు.

# చంద్రబాబు రోడ్డుషోలకు, లోకేష్ పాదయాత్రలకు ప్రజా స్పందన లేదు : మాజీ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్



విజయవాడ: చంద్రబాబు రోడ్డుషోలకు, లోకేష్ పాదయాత్రలకు ప్రజా స్పందన లేదని, అందుకే వాళ్ల మీద వాళ్లే రాళ్లు వేయించుకుంటున్నారని మాజీ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. ఎస్సీ ఎమ్మెల్యేలు, మంత్రులపై దాడులు చేస్తున్నారని మండిపడ్డారు. లోకేష్ పాదయాత్ర చాలా దారుణంగా ఉందని, పది మంది కూడా పాల్గొనడం లేదన్నారు. మేకలకు, గొర్రెలకు లోకేష్ దండం పెట్టుకుంటూ తిరుగుతున్నారని ఎద్దేవా చేశారు. జగనన్నే మన భవిష్యత్తు కార్యక్రమంపై భవానీపురం ఎన్టీఆర్ జిల్లా వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాజి మంత్రివర్యులు వెలంపల్లి శ్రీనివాసరావు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వెల్లంపల్లి మాట్లాడుతూ.. ఈ నెల 7వ తేదీ నుండి రాష్ట్ర వ్యాప్తంగా మెగా పీపుల్స్ సర్వే నిర్వహించడం జరుగుతుందన్నారు. మొదటి 15 రోజుల్లో రాష్ట్ర వ్యాప్తంగా కోటి కుటుంబాలకు పైగా ఈ సర్వే లో పాల్గొనగా 79 లక్షలకు పైగా మిస్డ్ కాల్స్ జగనన్న పాలనకు మద్దతుగా వచ్చాయన్నారు. ఈ సర్వే కార్యక్రమంలో క్షేత్ర స్థాయిలో 15 వేల సచివాలయాల పరిధిలో 7 లక్షల మంది జగనన్న సైనికులు పాల్గొన్నారని తెలిపారు. మన పశ్చిమ నియోజకవర్గానికి విషయానికి వస్తే 90 వేళ 3 వందల 5 కుటుంబాలు ఉంటె వాటిలో నేటికి 48 వేళ 8 వందల 13 కుటుంబాలు ఈ సర్వేలో పాల్గొన్నారని చెప్పారు. ఎటువంటి దాపరికం లేకుండా పీపుల్స్ సర్వే కార్యక్రమానికి సంబందించిన మధ్యంతర ఫలితాల నివేదికను మీడియా ముఖంగా వెల్లడిస్తున్నామన్నారు. కుల, మత, వర్గ వివక్ష లేకుండా ప్రతిపక్షాలు బలంగా ఉన్న ప్రాంతాలలో కూడా మా పరిపాలన ఎలా ఉందని ధైర్యంగా అడగడం జరుగుతుందన్నారు. ఆయా ప్రాంతాలలో నివసిస్తున్న ప్రజలు కూడా జగనన్నకు మద్దతుగా మాట్లాడడం మనం చూస్తూనే ఉన్నాం ఈ విషయాల పై ప్రత్యేక్షంగా మీరు ఆయా సచివాలయాల పరిధిలో తిరిగి ప్రతిస్పందనను స్వయంగా చూడమని ఆహ్వానిస్తున్నారని చెప్పారు. ఈ మెగా పీపుల్స్ సర్వే పై చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు ఉల్లిక్కి పడుతున్నాయని వ్యాఖ్యానించారు. నవరత్నాల హామీలను వంద శాతం నెరవేర్చిన ఏకైక వ్యక్తి వై యస్ జగన్ మోహన్ రెడ్డి అని చెప్పారు. వైయస్ జగన్ మోహన్ రెడ్డి గారు ఇచ్చేటువంటి పథకాలు అందుకుంటున్న ప్రతి యొక్క కుటుంబం జగనన్నే మన భవిష్యత్తు అనే నినాదంతో రాబోయే రోజూలో జగనన్నను మరలా ముఖ్యమంత్రిని చేసేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు.

**దళిత ద్రోహి పవన్, చంద్రబాబు :** దళితులపై దాడులను ప్రోత్సహిస్తున్న చంద్రబాబు, పవన్ కళ్యాణ్ దళిత ద్రోహులని వెల్లంపల్లి శ్రీనివాస్ విమర్శించారు. దళితులను అవమానిస్తూ మాట్లాడుతున్న పార్టీ చంద్రబాబు టీడీపీ పార్టీ అని మండిపడ్డారు.

దళిత మంత్రి దాడి చేస్తే పవన్ కళ్యాణ్ కి కళ్లు పోయాయా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. రానున్న రోజులలో దళితులు తగిన రీతిలో చంద్రబాబు,పవన్ కళ్యాణ్ లకు బుద్ధి చెపుతారని హెచ్చరించారు. చంద్రబాబు, పవన్‌కు 175 నియోజకవర్గాల్లో ఇన్‌చార్జ్‌లు కరువయ్యారని పేర్కొన్నారు. అలాంటి చంద్రబాబుకు పవన్ భజన చేస్తున్నారని వెల్లంపల్లి శ్రీనివాస్ విమర్శించారు.



# మనపై కుట్రలకు పాల్పడుతున్నారు.. అప్రమత్తంగా ఉండండి

అమరావతి: జనసైనికులు అప్రమత్తంగా ఉండాలని.. మాట్లాడేముందు వాస్తవాలను నిర్ధారించుకోవాలని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ సూచించారు. ఈ మేరకు జనసేన నాయకులు, వీరమహిళలు, జనసైనికులను ఆయన బహిరంగ లేఖ రాశారు.

**కుట్రలకు పాల్పడుతున్నట్లు సమాచారం..** "ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధి, ప్రజాశ్రేయస్సు కోసం మనం శ్రమిస్తున్న తరుణంలో మన దృష్టి మళ్లించేందుకు, భావజాలాన్ని కలుషితం చేసేందుకు కొన్ని శక్తులు నిరంతరం పనిచేస్తున్నాయి. మన పార్టీ పట్ల ఉన్న సానుకూల దృక్పథాన్ని దెబ్బతీసే కల్పిత సమాచారాన్ని శ్రేణులకు చేర్చి కుట్రలకు పాల్పడుతున్నట్లు విశ్వసనీయ సమాచారం ఉంది. వాటిని మనం అర్థం చేసుకుని పార్టీ నాయకులు, శ్రేణులు ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉంది. ప్రతి విమర్శలు, తీవ్రమైన ఆర్థిక నేరాల గురించి మాట్లాడాల్సి వచ్చినపుడు ముందుగా పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ దృష్టికి తీసుకెళ్లండి. వారి సూచనలు, సలహా మేరకు మాట్లాడండి. పార్టీలోని నాయకులు, వీరమహిళలు, జనసైనికులు మాట్లాడే ప్రతి మాట పార్టీపై ప్రభావం చూపుతుంది. అందుకే పార్టీలోని ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా వ్యవహరిస్తూ మాట్లాడే ముందు వాస్తవాలను నిర్ధారించుకోవాలి. స్థాయి, తీవ్రత హద్దులు దాటినట్లు సభ్య సమాజం భావించని విధంగా మన మాటలు ఉండాలి.

**ఆధారాల్లేకుండా నేరారోపణలు చేయొద్దు..** ఒక వ్యక్తి గురించి మాట్లాడే సమయంలో అకారణంగా వారి కుటుంబ సభ్యుల పేర్లను ప్రస్తావించవద్దు. ఆధారాలు లేకుండా నేరారోపణలు చేయొద్దు.. అది పార్టీకి, సమాజానికి మంచిది కాదు. నన్ను విమర్శించే వారికి, వ్యక్తిగతంగా దూషించే వారికి బదులు చెప్పే సమయంలో నేను చాలా అప్రమత్తంగా ఉంటానన్న సంగతి మీ అందరికీ తెలిసిందే. ప్రతి అక్షరాన్ని, మాటను బేరీజు వేసుకుంటూ హద్దులు దాటకుండానే కొంత తగ్గి బదులు చెబుతాను. ఎందుకంటే మన నుంచి వచ్చే ప్రతీ మాటకు అంత బలం ఉంటుంది.. ఆ బలం అపసవ్యంగా మారకూడదు. సరైన ధ్రువపత్రాలు లేకుండా ఎవరిపైనా ఆర్థిక నేరారోపణలు చేయొద్దు. మీడియాలో వచ్చిందనో.. ఎవరో మాట్లాడారనో నిర్ధారణ కానీ అంశాలపై చెప్పొద్దు. పొత్తులపై సోషల్ మీడియాలో వచ్చే సమాచారం ఆధారంగా మాట్లాడకండి. ఈ విషయంలో మేలు చేసే నిర్ణయం నేనే స్వయంగా తీసుకుంటా. సయోధ్యగా ఉన్న రాజకీయపక్షాల్లో చిన్నాచితకా నాయకులు మనపై ఏమైనా విమర్శలు చేస్తే వాటిని ఆ నాయకుడి వ్యక్తిగత విమర్శలుగా భావించండి. వాటిని ఆయా పార్టీలకు ఆపాదించవద్దు" అని పవన్ బహిరంగ లేఖలో పేర్కొన్నారు.



# జేసీ ప్రభాకర్‌రెడ్డి గృహనిర్బంధం.. తాడిపత్రిలో ఉద్రిక్తత

తాడిపత్రి: అనంతపురం జిల్లా తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్, మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్‌రెడ్డి ఇంటి వద్ద ఉద్రిక్తత నెలకొంది. అక్కడ భారీగా పోలీసులు మోహరించారు. పెద్దపప్పూరు వద్ద పెన్నా నదిలో ఇసుక, మట్టి అక్రమంగా తవ్వి తరలిస్తున్నారని గతకొంతకాలంగా తెదేపా నేతలు ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం నుంచి ఇసుక, మట్టి అక్రమ తవ్వకాలను అడ్డుకుంటామని.. వాటిని తరలించే వాహనాలను తగులబెడతామని జేసీ ప్రభాకర్‌రెడ్డి ఇటీవల ప్రకటించారు. ఈ నేపథ్యంలో జేసీ ప్రభాకర్‌రెడ్డి ఇంటి వద్ద సుమారు 100 మంది పోలీసులు మోహరించారు. ఇంటి చుట్టూ బారికేడ్లను ఏర్పాటు చేశారు. అక్కడికి వచ్చిన 8 మంది తెదేపా నేతలను పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతరం జేసీ ప్రభాకర్‌రెడ్డిని గృహనిర్బంధం చేశారు. బయటకు వచ్చిన ఆయన్ను పోలీసులు తిరిగి ఇంట్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో జేసీ నేలపై పడిపోయారు. పోలీసుల చర్యలను ఖండిస్తూ తన ఇంటి ముందే కుర్చీలో కూర్చొని ఆయన నిరసన తెలిపారు. దీంతో కుర్చీతో సహా జేసీని బలవంతంగా తిరిగి లోపలికి తీసుకెళ్లేందుకు పోలీసులు యత్నించారు. పోలీసుల చర్యలను తెదేపా నేతలు తీవ్రంగా ఖండించారు. పెద్దపప్పూరు పోలీస్‌స్టేషన్ వద్ద ధర్నాకు జేసీ ప్రభాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ప్రకటనల వల్లే జేసీని అడ్డుకున్నామని పోలీసులు చెప్పారు.




# గెలుపు కోసం వ్యూహకర్తలను ఆశ్రయిస్తున్న పార్టీలు

కర్ణాటకలో అధికారం నిలబెట్టుకోవాలని భారతీయ జనతా పార్టీ.. సీఎం పగ్గాలు చేపట్టాలని కాంగ్రెస్.. సర్వశక్తులు ఒడ్డుతున్నాయి. తమదే విజయమని ధీమా వ్యక్తం చేస్తున్న ఇరుపార్టీలు.. గెలుపు వ్యూహాలకు పదునుపెడుతున్నాయి. ఇందుకోసం వ్యూహకర్తల సహకారం తీసుకుంటున్నాయి.

# జగనన్న కాలంలో ఏపీ వైద్యారోగ్యానికి స్వర్ణయుగం: మంత్రి రజిని



తూర్పుగోదావరి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో రాష్ట్రంలో 17 మెడికల్ కాలేజీలు ఏర్పాటు అయ్యాయని, ఏపీ వైద్యారోగ్య రంగానికి ఇది స్వర్ణయుగమని వైద్యారోగ్య శాఖ మంత్రి విడదల రజని పేర్కొన్నారు. సోమవారం రాజమండ్రి ప్రభుత్వ వైద్య కళాశాలను పరిశీలించిన అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. "రాష్ట్రంలో సీఎం జగన్ చొరవతో 17 మెడికల్ కళాశాలు ఏర్పాటయ్యాయి. రాజమండ్రిలో మెడికల్ కళాశాల పనులను ఇవాళ పరిశీలించా. రాష్ట్రంలో ఐదు కాలేజీలను ప్రయారిటీ కాలేజీలుగా గుర్తించాం. రూ. 475 కోట్లతో రాజమండ్రిలో మెడికల్ కళాశాల నిర్మాణం జరుగుతోంది. ఈ అకడమిక్ ఇయర్ నుంచి అడ్మిషన్స్ ప్రారంభం కానున్నాయి. అలాగే.. విజయనగరం, మచిలీపట్నం ఏలూరు, నంద్యాల రాజమండ్రి వైద్య కళాశాలలకు సంబంధించి మెడికల్ ఇన్స్పెక్షన్స్ కూడా పూర్తయ్యాయ"ని తెలిపారామె.

**మంత్రి రజిని కామెంట్స్..** ఈ అకడమిక్ ఇయర్ లో అడ్మిషన్స్ ప్రారంభిస్తాము. జగనన్న కాలంలో వైద్యారోగానికి స్వర్ణయగం అని చెప్పొచ్చు. ప్రస్తుతం 350 పడకల ఆసుపత్రి నడుస్తోంది. ఇంకా వీటిని పెంచుతాము. మరింత మెరుగైన సదుపాయాలు అందిస్తాం చంద్రబాబు హయాంలో ఒక్క మెడికల్ కాలేజ్ కూడా రాలేదని ఈ సందర్భంగా గుర్తు చేశారామె. చంద్రబాబు టెంపరరీ ఆలోచన చేస్తాడు. జగనన్న దీర్ఘకాల ఆలోచనతో ఈ కళాశాలల నిర్మాణం చేపట్టారు. చంద్రబాబు టీడీపీ నేతలు వైద్య ఆరోగ్య గురించి ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతున్నారు. టిడిపి హయాంలో చెప్పుకోదగిన నిర్మాణం ఒకటి కూడా లేదు. మీకు దమ్ముంటే ఏం చేశారో మీరు చెప్పాలి మహిళల విషయంలో చింతమనేనికి ఎంత సంస్కారం ఉందో వనజాక్షి ఘటనను చూస్తే తెలుస్తుంది. ఆరోగ్యశ్రీ పెండింగ్ బిల్లుల విషయం మా నోటీసులో ఉంది. బడ్జెట్ విడుదల చేస్తున్నాము. ఆందోళన చెందాల్సిన అవసరం లేదు . రాష్ట్ర ప్రజలకు ఎలాంటి సమస్య రానియ్యము. ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ ను ఆరు నెలలు ట్రైల్స్ చేసాము విజయవంతంగా అమలవుతోందని మంత్రి విడదల రజిని పేర్కొన్నారు.

# సుప్రీంకోర్టులో కరోనా కలకలం.. ఆంక్షలు అమలు



దేశ వ్యాప్తంగా కరోనా మహమ్మారి మరోసారి కోరలు చాస్తోంది. రోజూవారీ పాజిటివ్ కేసుల్లో గణనీయంగా పెరుగుదల కనిపిస్తోంది. తాజాగా దేశ అత్యున్నత న్యాయస్థానంలో కరోనా కలకలం రేగింది. కొందరు న్యాయవాదులు అస్వస్థతకు గురి కావడంతో అందరికీ వైద్య పరీక్షలు నిర్వహించగా.. పలువురు లాయర్లు, న్యాయవాదులకు కరోనా సోకినట్లు నిర్ధారణ అయింది. దీంతో సుప్రీంకోర్టు, పరిసరాల్లో కరోనా ఆంక్షలు వెంటనే అమల్లోకి వచ్చాయి. అందరూ మాస్కులు తప్పనిసరిగా ధరించాలని, భౌతిక దూరం పాటించాలంటూ న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారు. మరోవైపు గత 24 గంటల వ్యవధిలో దేశవ్యాప్తంగా 7,178 కొత్త కేసులు బయటపడ్డాయి. ఇక మహమ్మారి కారణంగా 24గంటల్లో 16 మంది ప్రాణాలు కోల్పోయారు. ప్రస్తుతం దేశంలో 65,683 కేసులు యాక్టివ్‌గా ఉన్నాయి. కొవిడ్ కేసుల పెరుగుదలకు ఎక్స్‌బీబీ.1.16 వేరియంట్ కారణమని వైద్య నిపుణులు తెలిపారు. అయితే, కేసుల సంఖ్య గణనీయంగా పెరిగినప్పటికీ.. ఈ వేరియంట్ మరీ అంత శక్తిమంతమైనది ఏమీ కాదని పేర్కొన్నారు. అయినప్పటికీ ప్రజలు రద్దీ ప్రదేశాల్లోకి వెళ్లినప్పుడు మాస్కులు ధరించడం, చేతులను శుభ్రం చేసుకోవడం వంటి జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

# గ్రీక్ గాడ్ కోసమేనా దీపిక ఇంత ఆరాటం?

గ్రీక్ గాడ్ గా యువతరం హృదయాల్లో స్థిరమైన ముద్ర వేసుకుని ఉన్నాడు హృతిక్ రోషన్. అతడి డ్యాన్సులకు నటనకు ఫిదా అవ్వని వారు ఉండరు. బాలీవుడ్ లోనే మోస్ట్ ట్యాలెంటెడ్ హీరోగా హృతిక్ కి ఉన్న రికార్డు చాలా అరుదైనది. ఇక అతడి సరసన నటించే అవకాశం వస్తే ఏ బ్యూటీ అయినా వదులుకుంటుందా? ఇప్పుడు అలాంటి అరుదైన అవకాశం తనకు దక్కినందుకు దీపిక పదుకొనే ఎంతో ఎగ్జయిట్ మెంట్ ని కనబరుస్తోంది. తన కెరీర్ లో ఎన్ని సినిమాలు ఉన్నా కానీ.. హృతిక్ తో మాత్రం చాలా స్పెషల్ అని అతడికి వీరాభిమానిని అని ఇంతకుముందు దీపిక చెప్పకనే చెప్పింది.



తాజా సమాచారం మేరకు హృతిక్-దీపిక జంటగా నటించే భారీ చిత్రం తొందర్లోనే ప్రారంభమవుతుందని తెలిసింది. సిద్ధార్థ్ ఆనంద్ దర్శకత్వం వహించనున్న ఈ భారీ యాక్షన్ డ్రామాలో మెగాస్టార్ .. హృతిక్ రోషన్ - దీపికా పదుకొణె తొలిసారిగా కలిసి నటించనున్నారు. ఇది అరుదైన కలయిక. ఈ సినిమా ఏడాది క్రితమే ప్రారంభం కావాల్సి ఉండగా కోవిడ్ కారణంగా వాయిదా పడింది. ఇప్పుడు షూటింగ్ జూన్ నెల నుండి ప్రారంభం కానుందని సమాచారం. ఇందులో వెటరన్ నటుడు అనిల్ కపూర్ కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ సినిమా వచ్చే ఏడాది రిపబ్లిక్ డే కానుకగా విడుదల కానుంది. ప్రస్తుతానికి దీపిక ప్రభాస్ తో నాగ్ అశ్విన్ సైన్స్ ఫిక్షన్ చిత్రంతో బిజీగా ఉంది. హృతిక్ విక్రమ్ వేద రీమేక్ షూటింగ్ లో బిజీగా ఉన్నారు.

# లెదర్ కోట్ తో గుబులు రేపిన మాజీ మిస్సు..!

అందానికి అందం వేడి ఉన్న కథానాయిక ఇషా గుప్తా. బోల్డ్ యాటిట్యూడ్ తో కుర్రకారు గుండెల్లో గుబులు రేపడం తనకు హాబీ. ఈసారి కూడా అలాంటి ఫోటోషూట్ తో యూత్ లో మంటలు పెట్టింది. బ్లాక్ పర్పుల్ లెదర్ జాకెట్ లో కనిపించి ఇషా మైండ్ బ్లాక్ చేసింది. బ్లాక్ లో ఇన్నర్ అందాల ఎలివేషన్ తో రెచ్చిపోయింది. ఇషాజీ తాజా ఫోటోషూట్ అంతర్జాలంలో వైరల్ గా మారింది. ఎంపిక చేసిన డిజైన్ ఏదైనా టీజ్ చేయడం ఎలానో అందాల ఈషా గుప్తాను అడగాలి. ఈ సీనియర్ టాప్ మోడల్ కం నటి కంటికి కునుకుపట్టనివ్వని ట్రీట్ తో చెలరేగడం నిత్యకృత్యమే. ఇంతకుముందు రామ్ చరణ్ వినయ విధేయ రామ లో అదిరిపోయే ఐటమ్ నంబర్ తో గుబులు రేపిన ఇషాజీ మాజీ మిస్ ఇండియా గాను సుపరిచితం. ఈషా గుప్తా సోషల్ మీడియాల్లో ఎంత యాక్టివ్ గా ఉంటుందో తెలిసిందే. ఇన్ స్టా వేదికగా ఈషాజీ షేర్ చేసే హాట్ ఫోటోషూట్లు



సంచలనంగా మారుతుంటాయి. ఇక బికినీలు స్విమ్ సూట్లలో ఇప్పటికే అగ్గి రాజేసెస్తూ.. నిరంతరం తననుంచి స్టీమి ఎఫైర్స్ ని బయటపెడుతుంటుంది. ఇటీవల ఈషా వరుస హాట్ ఫోటోషూట్లు మతులు చెడగొడుతున్నాయి. అవన్నీ వైరల్ గా మారుతున్నాయి. ఇక ఈషా స్పానిష్ బోయ్ ఫ్రెండ్ తో షికార్లు చేయడంపైనా అప్పట్లో గుసగుసలు వినిపించాయి. తన తొలి వెబ్ షో రిజెక్ట్ ఎక్స్ తరువాత ఇషా ఇటీవల ఓ సింగిల్ ఆల్బమ్ తో అభిమానుల ముందుకు వచ్చింది. ఇటీవల తాను బాధాకరమైన ఎసిఎల్ గాయం నుంచి కోలుకున్నానని తనకు ఆసక్తిని కలిగించి ఆకర్షించే బలమైన పాత్రల కోసం చూస్తున్నానని వెల్లడించింది. మోకాలి గాయం నుండి కోలుకోవడానికి ఈషా ఆమె సంపాదించిన డబ్బు అంతా ఖర్చు చేసిందట. రిజెక్ట్ ఎక్స్ షో కాకుండా గుప్తాజీ చివరిసారిగా వన్ డే: జస్టిస్ డెలివర్డ్ అనే OTT చిత్రంలో కనిపించింది. ఆమె క్రైమ్ బ్రాంచ్ ఆఫీసర్ లక్ష్మి రతి పాత్రను పోషించింది. అశోక్ నందా దర్శకత్వం వహించిన ఈ థ్రిల్లర్ చిత్రంలో అనుపమ్ ఖేర్- కుముద్ మిశ్రా- అనుస్మృతి సర్కార్ కూడా నటించారు.

ఇషా గుప్తా తదుపరి రెండు బాలీవుడ్ చిత్రాలలో నటిస్తున్నారు. దేశీ మ్యాజిక్ - హేరా ఫేరి 3 లలో కనిపించనుంది.




# చెరువుకే వన్నె తెచ్చిన అనసూయ అందాలు



అందమైన..అద్భుతమైన లోకేషన్ ఏదైనా కెమెరా క్లిక్ మనిపించాల్సిందే. ఆలొకేషన్ ని కవర్ చేస్తూ ఓ సెల్ఫీ దిగాల్సిందే. తాజాగా అనసూయ అదే పనిచేసింది. ఇది ఏ చెరువు గట్టునో తెలియదు గాని ఉదయాన్ని సూర్యుడు ఉదయిస్తోన్న సమయంలో అనసూయ సూర్య కిరణాలు ఆ చెరువులో పడుతుండగా..ఆ చెరువు ఒడ్డున నిలబడి ఇలా ఫోటో దిగింది. ఈ ఫోటోలో అనసూయ అందాలు సమ్ థింగ్ స్పెషల్ గా హైలైట్ అవుతున్నాయి. గ్రీన్ కలర్ పొట్టి నిక్కర్ లోథై అందాల్ని ఎలివేట్ చేయగా..గాలికి చొక్కా బటన్లను విప్పేసి లో దుస్తుల్లో ఇలా కెమెరాకి ఫోజులిచ్చింది. నెత్తిపైన బిస్కెట్ కలర్ క్యాప్..కళ్లకి కూలింగ్ గ్లాసెస్ ధరించింది యువతని ఆకట్టుకునే రేంజ్ లో ఎలివేట్ చేసింది. అయితే లొకేషన్ స్పాట్ మాత్రం రివీల్ చేయలేదు. సహజంగా ఇలాంటి లోకేషన్లు హైదరాబాద్ లోనే చాలా ఉన్నాయి. పెద్ద పెద్ద బండరాళ్లతో కూడిన చెరువులు సిటీలో చాలానే నెలకొన్నాయి. మిషన్ కాకతీయ ప్రాజెక్ట్ లో భాగంగా తెలంగాణ ప్రభుత్వం చెరువుల పునరుద్దరణ కార్యక్రమం చేపట్టి ఎండిపోతున్న చెరువుల్లోకి నీళ్లను మళ్లిస్తోన్న సంగతి తెలిసిందే. ప్రతీ వేసవిలోనూ ఇంకి పోతున్న చెరువుల్ని ప్రభుత్వం నీళ్లతో నింపుతుంది. మరి ఈ చెరువులో నీళ్లు ఇంకా ఇంకాయో లేదో తెలియదుగానీ..ఆ చెరువు గట్టున నిలబడి అనసూయ ఫోజులిస్తుంటే ఆ చెరువుకే వన్నె వచ్చింది. ఇంకిపోతున్న చెరువులు సైతం అనసూయ అందాలకి నిండిపోవాల్సిందే. అనసూయ కెరీర్ ఫుల్ స్వింగ్ లో ఉన్న సంగతి తెలిసిందే. ఒక్కో సినిమాకి లక్షల్లో పారితోషికాలు అందుకుంటున్న అనసూయ వరుస చిత్రాలతో క్షణం తీరిక లేనంత బిజీగా ఉంది. ఇటీవలే పుష్ప చిత్రంతో పాన్ ఇండియా సక్సెస్ ని ఖాతాలో వేసుకుంది. దాక్షయణి పాత్రలో ఛమక్కులా మెరిసి ప్రేక్షకుల్ని ఆకట్టుకుంది. రంగస్థలం లో రంగమ్మత్త పాత్ర తర్వాత క్రియేటివ్ డైరెక్టర్ సుకుమార్ మరోసారి దాక్షాయణిగా గుర్తిండిపోయే మంచి పాత్రను ఇచ్చారు. మొదటి భాగంలో పవర్ ఫుల్ పాత్రతో ఎంట్రీ ఇచ్చిన దాక్షాయణికి రెండో భాగంలో మరింత ప్రాధాన్యత ఉంటుందట. ఆ పాత్రకు పుష్ప -ది రూల్ లో కొనసాగింపు ఆసక్తిని రేకెత్తిస్తుందట. నటిగా అనసూయ స్థాయిని పెంచే చిత్రంగా పుష్ప 2 నిలుస్తుందని టాక్ వినిపిస్తోంది. ఇటీవల రిలీజ్ అయిన ఖిలాడీలోనూ నటించింది. కానీ ఆ సినిమా అంచనాల్ని అందుకోవడంలో విఫలమైంది. దీంతో అనసూయ ఎఫెర్ట్ వృద్దా అయింది. ప్రస్తుతం నటిస్తోన్న రంగమార్తాండ తనకు పేరు తెస్తుందని అనసూయ బావిస్తోంది. ఇవేగాక.. ఇంకొన్ని చిన్న చిత్రాల్లోనూ అనసూయకి అవకాశాలు వస్తున్నాయి. అయితే వాటి విషయంలో ఆచితూచి అడుగులు వేస్తోంది. మంచి బ్యానర్...సరైన స్క్రిప్ట్ ప్యాడింగ్ ఉంటేనే సంతకాలు చేస్తోంది. పారితోషికం కోసం కమిట్ అవ్వడం లేదు. ఇక బుల్లి తెర హోస్ట్ గా ఎప్పటిలాగే బిజీగానే కొనసాగుతోంది. కొత్త కొత్త గేమ్ షోలతో ప్రేక్షకుల్ని అలరిస్తోంది. బుల్లి తెరపై మాత్రం తన మార్క్ ఎక్కడా చెరగలేదు. అదే చరిష్మాతో దూసుకుపోతోంది.

# పార్టీ మధ్యలో ఈ ఫోజులేంటి భామలు?




ప్రచారానికి ఇన్ స్టాని మించిన వెపన్ మరోకటి లేదు. అందులోనూ బాలీవుడ్ సెలబ్రిటీలు ఇన్ స్టాలో చేసే హంగామా గురించి అయితే ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. స్టార్ కిడ్స్ తెరంగేట్రానికి ముందే బోలెండంత పాపులారిటీని ఇన్ స్టా మాధ్యమం ద్వారానే దక్కించుకుంటున్నారు. కెమెరా ముందుకు రాకముందే స్టార్ కిడ్స్ స్టార్ హీరోయిన్లలా ఫేమస్ అయిపోతున్నారు. తాజాగా సుహానా ఖాన్..శనయ్య కపూర్..అనన్య పాండే కెమెరాకి ఇచ్చిన ఫోజులు కొన్ని ఇన్ స్టాలో వైరల్ గా మారాయి. ఈ త్రయం పబ్లో పార్టీని ఎంజాయ్ చేస్తోన్న సమయంలో ఇలా ఫోటో దిగి ఇన్ స్టాలో కి ఎక్కేసారు. అనన్య పాండే.. సుహానాఖాన్ బ్లాక్ అండ్ బ్లాక్ పార్టీ కోడ్ దుస్తులు ధరించారు. కానీ శనయ్య కపూర్ వాళ్లిద్దరికి భిన్నంగా పసుపు వర్ణం డిజైన్ దుస్తుల్లో కనిపించింది. ప్రస్తుతం ఈ ఫోటో ఇన్ స్టాలో వైరల్ గా మారింది. అభిమానులు తమదైన శైలిలో కామెంట్లు చేస్తూ అభిమానం చాటుకుంటున్నారు. ఇక ఈ ముగ్గురిలో చుంకీపాండే వారసురాలిగా అనన్య పాండే బాలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చిన సంగతి తెలిసిందే. స్టూడెంట్ ఆఫ్ ది ఇయర్ చిత్రంతో ఎంట్రీ ఇచ్చిన బ్యూటీ రెండు..మూడు సినిమాల్లో నటించింది. ఇటీవలే విడుదలైన గెహ్రాయాన్‌లో నూ అనన్య నటించింది. కానీ దీపికా పదుకొణె ఎలివేషన్ ముందు అనన్య పాత్ర పెద్దగా హైలైట్ కాలేదు. లైగర్ చిత్రంతో బ్యూటా టాలీవుడ్ లోనూ లాంచ్ అవుతోన్న సంగతి తెలిసిందే. తెలుగు...హిందీ భాషల్లో చిత్రం తెరకెక్కింది. త్వరలోనే రిలీజ్ కానుంది. ఇక కపూర్ వంశం నుంచి శనయ్య కపూర్ మేకప్ వేసుకోవడానికి రెడీ అవుతోంది. చదువు పూర్తిచేసింది. యాక్టింగ్..డాన్సింగ్ ట్రైనింగ్ సైతం పూర్తిచేసింది. బాలీవుడ్ లో పెద్ద హీరోయిన్ ని చేయాలని తండ్రి సంజయ్ కపూర్ ప్లాన్ చేస్తున్నారు. దానికి తగ్గట్టు మోడలింగ్ రంగంలో సక్సెస్ అయింది. ప్రస్తుతం జాన్వీకపూర్ ప్రధాన పాత్రలో తెరకెక్కుతోన్న గుంజన్ సక్సెనా బయోపిక్ చిత్రానికి సహాయ దర్శకురాలిగానూ శనయ్య కపూర్ పనిచేస్తోంది. నటిగా మేకప్ వేయకముందే స్కూల్ మేట్ తో రిలేషన్ షిప్ లో ఉంది. రోహన్ కురుప్ అనే కుర్రాడి ప్రేమలో బ్యూటీ మునిగి తేలుతోంది. గతంలో ఇద్దరు జంటగా పెదవి ముద్దులు అందుకుంటోన్న ఫోటోలు ఇంటర్నెట్ ని షేక్ చేసిన సంగతి తెలిసిందే. ఇక షారుక్ ఖాన్ వారసురాలిగా సుహానాఖాన్ బాలీవుడ్ లాంచింగ్ కి ఎప్పటి నుంచో ప్రయత్నాలు జరుగుతున్నాయి. సరైన స్క్రిప్ట్ కోసం వెయిట్ చేస్తున్నారు. కొన్ని నెలలుగా ఆ ప్రయత్నాలు మరింత సీరియస్ గా సాగుతున్నాయి. అయితే షారుక్ కుమారుడు ఆర్యన్ ఖాన్ డ్రగ్స్ కేసు వివాదంలో చిక్కుకోవడంతో ఆ బిజీలో పడ్డారు. షారుక్ సొంత బ్యానర్ రెడ్ చిల్లీస్ ఎంటర్ టైన్ మెంట్ లోనే సుహానాని లాంచ్ చేయాలని షారుక్ దంపతులు ప్లాన్ చేస్తున్నారు. దానికి సంబంధించిన పనులన్నింటిని గౌరీఖాన్ చూసుకుంటున్నారు.

# తనకు బ్రేకిచ్చిన సంస్థకే కళ్లు భైర్లు కమ్మేలా..!

కోటి పారితోషికం అన్న పదం వినేందుకే ఎంతో బరువుగా ఉంటుంది. మెగాస్టార్ చిరంజీవి కోటి పారితోషికం అందుకునేందుకు దశాబ్దం పైగానే హీరోగా అలుపెరగకుండా శ్రమించాల్సొచ్చింది. కానీ ఇప్పటితరం కథానాయికలు ఇలా నాలుగైదేళ్లలోనే అవలీలగా కోటి పారితోషికం అందుకుంటున్నారు. కోటి అంటే ఖాతరు చేసే పరిస్థితి లేదు ఇప్పుడు. ఇక పరిశ్రమకు పరిచయమైన నాలుగేళ్లకే కోటి పైగా పారితోషికం అందుకుంటున్న రష్మిక మందన వరుస బ్లాక్ బస్టర్లతో లక్కీ ఛామ్ గా మారడంతో ఇక తన డిమాండ్లకు హద్దు అన్నదే లేకుండా పోయిందని టాక్ వినిపిస్తోంది. ఇటీవలి పుష్ప - ది రైజ్ తెలుగు-హిందీలో బ్లాక్ బస్టర్ కొట్టడంతో రష్మిక తన రేంజును అమాంతం పెంచేసిందన్న టాక్ వినిపిస్తోంది. ఇప్పుడు ముంబై పరిశ్రమలో వరుసగా మూడు నాలుగు చిత్రాలు చేస్తోంది. మరోవైపు టాలీవుడ్ అగ్ర హీరోలందరితోనూ సినిమాలు చేసేస్తోంది. అందుకే ఇప్పుడు దీపం ఉండగానే ఇల్లు చక్కదిద్దుకునే పనిలో ఉంది. ఇప్పటికిప్పుడు ఎవరైనా తెలుగు నిర్మాత కనిపిస్తే రూ. 2కోట్ల



పారితోషికం డిమాండ్ చేస్తోందట. ఆ ఫిగర్ వినగానే నిర్మాత నీళ్లు నములుతున్నాడని తెలుస్తోంది. రష్మిక మందన్న తన రెమ్యునరేషన్ ని అమాంతం పెంచేసింది. లక్షల్లో అందుకునే ఈ బ్యూటీ ఉన్నట్టుండి కోటికి ఎగబాకి ఇప్పుడు ఏకంగ 2కోట్లు అడిగేస్తోంది. పుష్ప సక్సెస్ కిక్కు ఇది! అంటూ గుసగుసలు వైరల్ గా స్ప్రెడ్ అవుతున్నాయి. ఇప్పటికే పుష్ప సీక్వెల్ కోసం 2కోట్ల రెమ్యూనరేషన్ డిమాండ్ చేసిందట. ఇతర నిర్మాతల నుండి కూడా అదే ఆశిస్తోందట. ప్రఖ్యాత గీతా ఆర్ట్స్ నాయికా ప్రధాన చిత్రానికి సన్నాహాలు చేస్తూ రష్మికను సంప్రదించగా.. భారీ పారితోషికం అడిగిందని తెలిసింది. నిజానికి గీత గోవిందం తో తన రేంజును పెంచింది గీతా సంస్థనే. అయినా కానీ పారితోషికంలో రూపాయి తగ్గేదే లేదని చెబుతోందట. నిర్మాతల నుంచి జీఎస్టీతో పాటు రూ. 2 కోట్లు అడిగినట్లు సమాచారం. ఈ చిత్రానికి చిలసౌ-మన్మథుడు 2 చిత్రాలకు దర్శకత్వం వహించిన రాహుల్ రవీంద్రన్ దర్శకత్వం వహించనున్నారు. ఇప్పటికి ఇంకా రష్మిక ఈ మూవీకి సంతకం చేయలేదు. పుష్ప 2 తర్వాత ఏ సినిమా చేస్తోందో వివరాల్ని వెల్లడించలేదు. అటు హిందీ కమిట్ మెంట్లు పూర్తయితే కానీ ఏదీ చెప్పలేని స్థితిలో ఉందనుకోవాలి. బిగ్ బ్రేకిచ్చిన సంస్థకే కళ్లు భైర్లు కమ్మే ట్రీట్ ఇస్తోంది ప్రస్తుతానికి.

# పటానీ తర్వాత ఈమెపైనే భాయ్ మనసు..!

బాలీవుడ్ డార్లింగ్ బోయ్ సల్మాన్ ఖాన్ తన కెరీర్ లో ఎందరికో లిఫ్టిచ్చారు. అంతంతమాత్రం కెరీర్ తో అవకాశాల్లేని ఎందరో నాయికలకు భాయ్ లిఫ్టివ్వడంతో ఆ తర్వాత స్టార్ హీరోయిన్లుగా ఏలారు. ఐశ్వర్యారాయ్- కత్రిన- జాక్విలిన్ ఫెర్నాండెజ్- డైసీ షా లాంటి భామలకు సల్మాన్ భాయ్ అవకాశాలిచ్చి ఎంకరేజ్ చేశారు. స్నేహా ఉల్లాల్ కి అవకాశమిచ్చింది సల్మాన్ భాయ్. ఇక డెబ్యూ నాయికలెందరినో పరిచయం చేసారు. ఇటీవల దిశా పటానీకి వరుస అవకాశాలిచ్చాడు సల్మాన్. కానీ ఆ సినిమాలేవీ హిట్టవ్వలేదు. ఇప్పుడు భాయ్ కన్ను పూజా హెగ్డే పై పడింది. బుట్టబొమ్మ అందచందాలు డ్యాన్సులు తనను విపరీతంగా ఆకర్షించాయట. అందుకే సల్మాన్ ఖాన్ వెంటనే ఆఫర్ ఇచ్చారు.



ప్రస్తుతం తన సరసన సినిమా చేస్తున్న పూజాకు దబాంగ్ టూర్ ఇన్విటేషన్ అందింది. మిడిల్ ఈస్ట్ లో తన దబాంగ్ టూర్ కోసం ఆమెను తీసుకువెళ్లాడు. పూజా తన కెరీర్ లో మొదటిసారిగా వేదికపై ప్రదర్శన ఇచ్చింది. ఇది సల్మాన్ ని బాగా ఆకట్టుకుంది.

సల్మాన్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. పూజకు ఇది మొదటిసారి అయినా ఆమె అద్భుతంగా డ్యాన్స్ చేసిందంటూ పొగిడేశారు. పూజా చాలా మంచి నటి అని ఆమెతో కలిసి పనిచేయడానికి చాలా ఉత్సాహంగా ఉన్నానని భాయ్ చెప్పాడు. మరోవైపు పూజా హెగ్డే టాలీవుడ్ లో వరుస చిత్రాలతో బిజీగా ఉంది. తన తాజా చిత్రం రాధే శ్యామ్ విడుదలకు సిద్ధమవుతుండగా ప్రచారంలో బిజీ కానుంది. అలాగే మహేష్ - త్రివిక్రమ్ సినిమాలోనూ పూజా నటించనున్న సంగతి తెలిసిందే.



# పెండింగ్ బిల్లులపై 'సుప్రీం' విచారణ..

## బిల్లులను వీలైనంత త్వరగా క్లియర్ చేయాలని ఆదేశం

హైదరాబాద్ : గవర్నర్ బిల్లులను పెండింగ్ పెట్టడంపై తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టులో సోమవారం మరోసారి విచారణ జరిగింది. గవర్నర్ తరఫున సొలిటర్ జనరల్ వాదనలు వినిపించారు. ప్రస్తుతం గవర్నర్ వద్ద పెండింగ్‌లో ఎలాంటి బిల్లులు లేవని, కొన్ని బిల్లులను తిప్పి పంపారంటూ తెలిపారు. ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది దుష్యంత్ దవే వాదనలు వినిపించారు. ప్రజలచే ఎన్నికల ప్రభుత్వం గవర్నర్ దయకోసం చూడాల్సి వస్తోందన్నారు. ఇరువైపులా వాదనలు విన్న సర్వోన్నత న్యాయస్థానం బిల్లులను వీలైనంత త్వరగా క్లియర్ చేయాలని ఆదేశించింది. ప్రస్తుతం పెండింగ్‌లో బిల్లులు లేనందున కేసును ముగిస్తున్నట్లు సుప్రీంకోర్టు తెలిపింది. గతేడాది అసెంబ్లీ సమావేశాల్లో ఆమోదించిన బిల్లులను గవర్నర్ పెండింగ్‌లో పెట్టారంటూ తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ ధర్మాసనం విచారణ జరిపింది. ఈ విషయంలో కేంద్రం స్పందన కోరిన సుప్రీంకోర్టు.. గవర్నర్‌కు నోటీసులు జారీ చేస్తామని చెప్పింది. అయితే, సమస్య ఏంటో తెలుసుకుంటామని ఎస్‌జీ తుషార్ మెహత కోర్టుకు తెలిపారు. ఈ అంశంపై మరోసారి విచారణ జరగ్గా.. ఈ నెల 9న గవర్నర్ కార్యాలయం నుంచి ఓ నివేదిక కోర్టుకు అందిందని, దాన్ని సీజేఐ రికార్డు చేసినట్లు పేర్కొన్నారు. మూడు బిల్లులకు ఆమోదం తెలిపారని, కొన్ని బిల్లులపై రాష్ట్ర ప్రభుత్వాన్ని గవర్నర్ వివరణ కోరారని.. అదే విషయాన్ని గవర్నర్ కార్యాలయం నివేదికలో పేర్కొన్నట్లు కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. ఆ తర్వాత ధర్మాసనం పెండింగ్ బిల్లుల విషయంపై విచారణను వాయిదా వేసింది. ఈ క్రమంలోనే తాజాగా మరోసారి విచారణ జరిగింది. బిల్లులను ఎప్పటికప్పుడు వీలైనంత త్వరగా పూర్తి చేయాలని ఆదేశిస్తూ.. కేసును ముగిస్తున్నట్లు పేర్కొంది.




దిల్లీ: రెజ్లింగ్ క్రీడాకారులు మళ్లీ రోడ్డెక్కారు. భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ శరణ్‌సింగ్‌పై వచ్చిన లైంగిక వేధింపుల ఆరోపణలపై దర్యాప్తు వివరాల్ని వెంటనే బయటపెట్టాలని డిమాండ్ చేస్తూ వరుసగా రెండో రోజు నిరసన దీక్ష కొనసాగిస్తున్నారు. దిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద బజ్‌రంగ్ పునియా, సాక్షి మలిక్, వినేశ్ ఫొగాట్ సహా అగ్రశ్రేణి రెజ్లర్లు ఆదివారం ధర్నా చేపట్టిన విషయం తెలిసిందే. రాత్రంతా దీక్షా శిబిరంలోనే ఉన్న క్రీడాకారులు.. సోమవారం ఉదయం కూడా నిరసన కొనసాగిస్తున్నారు. బ్రిజ్‌భూషణ్‌పై పోలీసులు కేసు నమోదు చేసేంత వరకు తమ ఆందోళన విరమించబోమని కరాఖండీగా చెబుతున్నారు. అప్పుడు రాజకీయ పార్టీలను వద్దని.. బ్రిజ్‌భూషణ్‌పై సంచలన ఆరోపణలు చేస్తూ ఈ ఏడాది జనవరిలో రెజ్లర్లు ఆందోళన చేపట్టిన విషయం తెలిసిందే. ఆ సమయంలో పలు రాజకీయ పార్టీలు వీరికి మద్దతు పలుకుతూ దీక్షలో కూర్చోవాలని ప్రయత్నించగా.. క్రీడాకారులు అందుకు తిరస్కరించారు. అయితే, ఈసారి తాము అలా చేయబోమని బజరంగ్ పునియా తెలిపాడు. తమ ఆందోళన మద్దతిచ్చేవారు ఎవరైనా తమతో పాటు ధర్నాలో కూర్చోవచ్చని చెప్పాడు. "ఈసారి అన్ని పార్టీలను ఆహ్వానిస్తున్నాం. భాజపా, కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ.. ఏ పార్టీ అయినా సరే మాకు మద్దతిచ్చి దీక్షలో కూర్చోవచ్చు. అయితే, మాకు ఏ రాజకీయ పార్టీతోనూ సంబంధం లేదు" అని పునియా వివరించాడు. "గతంలో నిరసన చేపట్టినప్పుడు మమ్మల్ని తప్పుదోవ పట్టించారు. ఈసారి మేం ఎవర్నీ గుడ్డిగా నమ్మబోం. కేసు నమోదు చేసేంత వరకు దీక్ష కొనసాగుతుంది" అని వినేశ్ ఫొగాట్ తెలిపింది.

**దర్యాప్తు చేపట్టిన దిల్లీ పోలీసులు..** బ్రిజ్ భూషణ్‌పై ఓ మైనర్ సహా ఏడుగురు బాలికలు ఇటీవల పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై పోలీసులు చర్యలు తీసుకోలేదని రెజ్లర్లు ఆరోపిస్తున్నారు. మరోవైపు, రెజ్లర్ల ఆరోపణలపై దిగ్గజ బాక్సర్ మేరీ కోమ్ నేతృత్వంలో ఏర్పాటైన ఆరుగురు సభ్యుల పర్యవేక్షక కమిటీ ఏప్రిల్ తొలి వారంలో దర్యాప్తు నివేదికను కేంద్ర ప్రభుత్వానికి సమర్పించింది. ఆ దర్యాప్తు నివేదికను ప్రభుత్వం ఇప్పటి వరకు బహిర్గతం చేయలేదు. దీంతో వీరంతా మళ్లీ నిరసన బాటపట్టారు. ఈ క్రమంలోనే దిల్లీ పోలీసులు చర్యలు చేపట్టారు. రెజ్లర్లు చేసిన ఫిర్యాదుపై దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపారు. క్రీడాశాఖ ఏర్పాటు చేసిన కమిటీ నుంచి దర్యాప్తు నివేదిక కోరినట్లు పేర్కొన్నారు.

# సామాన్యులకు పాలు, పెరుగుపైనా జీఎస్టీ.. అసామాన్యులకు ఎయిర్‌పోర్టులపైనా నో జీఎస్టీ: మంత్రి కేటీఆర్

హైదరాబాద్: కేంద్రంలోని నరేంద్రమోదీ సర్కారుపై రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ మరోసారి విమర్శనాస్త్రాలు సంధించారు. జైపూర్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టును అదానీ గ్రూప్‌నకు బదిలీ చేసిన కేంద్రం.. దానిపై ఎలాంటి జీఎస్టీ విధించకపోవడంపై మంత్రి స్పందించారు. ఈ మేరకు ట్విటర్‌లో ఆ న్యూస్ క్లిప్పింగ్‌ను యాడ్ చేస్తూ ఒక పోస్టు పెట్టారు. 'దేశంలో సామాన్య ప్రజలకు పాలు, పెరుగు లాంటి నిత్యావసరాలపై కూడా జీఎస్టీ విధిస్తారు. కానీ, అదానీ లాంటి అసామాన్యులు ఏకంగా ఎయిర్‌పోర్టులు పొందినా ఎలాంటి జీఎస్టీ ఉండదు' అని మంత్రి కేటీఆర్ ట్విటర్‌లో పేర్కొన్నారు. 'ఇలా మిత్రులకు ఇవ్వడం ఉచితం కాదట.. ప్రధానికి కృతజ్ఞతలు' అని ఆయన వ్యంగ్యంగా రాశారు.

కేంద్రం ప్రభుత్వం చెప్పుకుంటున్నట్టుగా ఇది అమృత కాలం కాదని, ఎ మిత్ర్ కాలమని (దోస్తుల కాలమని) మంత్రి విమర్శించారు.



# పులి వచ్చింది.. వేట మొదలైంది.. ఇంతకూ ఆ పులి ఎవరు?



హైదరాబాద్ : చేవెళ్లలో నిర్వహించిన బీజేపీ బహిరంగ సభ కమలనాథులకు కొత్త ఉత్సాహాన్ని ఇచ్చేస్తుందని చెప్పాలి. ఈ సభకు ముఖ్య అతిథిగా హాజరైన అమిత్ షా.. దాదాపు గంటసేపు మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన తాను చెప్పాల్సినది చెప్పేశారు. అమిత్ షా ప్రసంగానికి ముందు.. ఆయన వచ్చే వేళలో తెలంగాణ రాష్ట్ర బీజేపీ రథసారధి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలు ఆసక్తికరంగానే కాదు.. సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. అమిత్ షాను పులిలా అభివర్ణిస్తూ ఆయన ఉద్వేగభరితంగా మాట్లాడారు. తనను అక్రమంగా అరెస్టు చేసి రోడ్ల మీద తిప్పినప్పుడు తమ కార్యకర్తలకు తాను చెప్పింది ఒక్కటేనని.. మీరేం భయపడొద్దని.. ఢిల్లీ నుంచి ఫోన్ వచ్చింది.. పులి వస్తుందని పేర్కొన్నారు. 'ఇప్పుడు వేట మొదలైంది. పులి వేటాడటం ప్రారంభించింది. ఆ పులి కార్యకర్తలను కాపాడే పులి. ఆ పులే చేవెళ్ల గడ్డకు వచ్చింది' అంటూ అమిత్ షాను పులిగా అభివర్షిస్తూ చేసిన వ్యాఖ్యలు బీజేపీ కార్యకర్తలకు.. సానుభూతి పరులకు.. అభిమానులను తీవ్రమైన భావోద్వేగానికి గురయ్యేలా చేసిందంటున్నారు. ఒక్కసారి తెలంగాణలో బీజేపీకి అవకాశం ఇవ్వాలని కోరుతున్నట్లు చెప్పిన బండి సంజయ్.. బీజేపీ చేతికి రాష్ట్ర పగ్గాలు వస్తే తాము చేపట్టే పథకాల్ని.. కార్యక్రమాల గురించి ఏకరువు పెట్టారు. తెలంగాణలో రాక్షస రాజ్యాన్ని.. కుటుంబ పాలనను.. నియంత పాలనను కూకటి వేళ్లతో పెకిలించేసేందుకు అమిత్ షా ఆధ్వర్యంలో చేవెళ్లకు వచ్చినట్లుగా పేర్కొన్నారు.

అమిత్ షాను ఆకాశానికి ఎత్తేసేలా మాట్లాడిన బండి సంజయ్ మాటలు ఆసక్తికరంగా మారాయి. అమిత్ షా ఇమేజ్ ను మరింత పెంచేలా మాట్లాడిన ఆయన మాటలు రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చగా మారాయంటున్నారు.

# కమ్యూనిస్టు భావాలుంటే బీజేపీలో ఎట్లా చేరినవ్.. ఈటలపై భట్టి ఫైర్



కమలాపూర్ : కమ్యూనిస్టు భావాలున్న ఈటల రాజేందర్ మతోన్మాద బీజేపీలో ఎందుకు చేరినవో ప్రజలకు చెప్పాలని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క సూటిగా ప్రశ్నించారు. ఎప్పుడో ఆరు నెలల క్రితం ముగిసిన మునుగోడు ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి బీఆర్ఎస్ రూ.25 కోట్లు ఇచ్చిందని బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ చేసిన ఆరోపణలను భట్టి తీవ్రంగా ఖండించారు. ఆదివారం పీపుల్స్ మార్చ్ కమలాపూర్ మండలంలోని భీంపల్లికి చేరింది. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రగతిశీల భావాలున్న వ్యక్తినని ప్రచారం చేసుకున్న ఈటల రాజేందర్.. వేల కోట్ల రూపాయలు ఎలా సంపాదించావో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజాధనాన్ని దోపిడీ చేయకుంటే.. వేల కోట్లకు ఎలా ఎదిగావని నిలదీశారు. ఈటలదే దోచుకునే మనస్తత్వం అని ధ్వజమెత్తారు.

ఈటల కార్పొరేట్ల పార్టీ బీజేపీలో చేరి కాంగ్రెస్ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిపై ఆరోపణలు చేయడం సిగ్గుచేటని మండిపడ్డారు. కాంగ్రెస్ నాయకులు నీతి నిజాయితీగా పనిచేస్తున్నారని చెప్పారు. ఈటల మాదిరిగా దోచుకునే బుద్ధి ఉంటే.. దశాబ్దాలుగా అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ లక్షల కోట్లు సంపాదించుకునేదని వివరించారు. కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ ఏటా 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తానని చెప్పడం పచ్చి మోసమని పేర్కొన్నారు. దేశంలో నిత్యావసర వస్తువుల ధరలు ఇష్టారాజ్యంగా పెంచిన బీజేపీ.. పేద, మధ్య తరగతి ప్రజలకు శాపంగా మారిందని దుయ్యబట్టారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌కు వస్తున్న ఆదరణను దెబ్బతీసేందుకు, ప్రజలను తప్పుదోవపట్టించేందుకు ఈటల నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారని భట్టి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో వరంగల్, కరీంనగర్ జిల్లాల అధ్యక్షులు నాయిని రాజేందర్‌రెడ్డి, కవ్వంపల్లి సత్యనారాయణ, మాజీ ఎంపీలు పొన్నం ప్రభాకర్, సిరిసిల్ల రాజయ్య, నియోజకవర్గ ఇన్‌చార్జి బల్మూరి వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

# 'షా'పై నిప్పులు చెరిగే ట్వీట్లు సంధించిన కేటీఆర్



హైదరాబాద్ : చేవెళ్లలో బీజేపీ నిర్వహించిన భారీ బహిరంగ సభ నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర మంత్రి కేటీఆర్ రియాక్టు అయ్యారు. చేవెళ్ల సభకు హాజరైన కేంద్ర మంత్రి అమిత్ షా పై ఆయన నిప్పులు చెరిగారు. గంట పాటు సాగిన ప్రసంగం అనంతరం.. కాసేపటికే అమిత్ షా మీదా.. బీజేపీ మీదా.. ప్రధాని నరేంద్ర మోడీ మీదా మంత్రి కేటీఆర్ తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తూ వరుస ట్వీట్లతో ఉక్కిరిబిక్కిరి అయ్యేలా విరుచుకుపడ్డారు. దేశంలో కరప్షన్ కు మోడీ కెప్టెన్ అని.. దానికి క్యాప్షన్ బీజేపీ అంటూ ఘాటుగా రియాక్టు అయిన మంత్రి కేటీఆర్.. బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తుందంటూ కలలు కంటున్నారని.. కానీ మళ్లీ అధికారంలోకి వస్తే అంధకారంలోకి వెళ్లటం ఖాయమని స్పష్టం చేశారు. "త్వరలో రాష్ట్రంలో బీజేపీ ఖాళీ. ఢిల్లీలో ప్రధాని కుర్చీ ఖాళీ. వైఫల్యాల మోడీకి 2024లో గుజరాత్ ఘర్ వాపసీ తప్పదు. మోడీని మరోసారి పరధాని పీఠం ఎక్కిస్తే.. దేశాన్ని బలిపీఠం ఎక్కించినట్లేనని బలమైన భావనలో ప్రజలు ఉన్నారు" అంటూ ట్వీట్లతో విరుచుకుపడ్డారు. ఈ సందర్భంగా ఆయన మోడీషాలపైనా.. కేంద్రంలోని బీజేపీ సర్కారుపైనా ఫైర్ అయ్యారు. కేటీఆర్ చేసిన వరుస ట్వీట్లు.. అందులో నిప్పులు చెరిగేలా ఉన్న విషయాల్ని చూస్తే..

- బీజేపీ స్టీరింగ్ అదానీ చేతికి చిక్కింది. కార్పొరేట్ దోస్తు కబంధ హస్తాల్లో కమలం విలవిల్లాడుతోంది. హిండెన్బర్గ్ రిపోర్ట్తో బీజేపీ ఫుల్ పిక్చర్ను దేశప్రజలు 70 ఎంఎంలో చూసేశారు. ఇంకా ఏ ట్రైలర్ అవసరం లేదు.
- తెలంగాణలో గల్లీ బీజేపీ నేతల పగటి వేషాలు నడువవు ఢిల్లీ పెద్దల పగటి కలలు నెరవేరవు. దానిపై జేపీసీ వేయని బీజేపీకి సిట్టింగ్ జడ్జి విచారణ అడిగే హక్కు ఉందా?
- ముక్కు నేలకు రాసినా మోకాళ్ల యాత్ర చేసినా మోసాల మోదీని తెలంగాణ నమ్మదు. బట్టే బాజ్ బీజేపీని తెలంగాణ సమాజం క్షమించదు. తుప్పు పట్టిన తుపాకీని ఎంఐఎం భుజంపై పెట్టి బీజేపీ ఎంతకాలం కాలుస్తుంది?
- తెలంగాణలో సొంత బలం లేని పార్టీ బీజేపీ. పల్లెపల్లెనా బలగం కలిగిన పార్టీ బీఆర్ఎస్. బారాణా తీసుకొని చారాణా కూడా ఇవ్వని బీజేపీకి మిగిలేది బూడిదే. ఎనిమిదేండ్లుగా కృష్ణా నదిలో తెలంగాణ వాటా తేల్చకుండా పాలమూరు %--% రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా ప్రకటించకుండా ఇక్కడికి వచ్చి ఎవరో గులాములు రాసిచ్చిన స్రిప్టును వల్లె వేస్తె నమ్మేదెవరు
- అదానీ విషయంలో జేపీసీ కాదు కదా.. కనీసం సిట్ కూడా వేయని వారు అవినీతి గురించి మాట్లాడితే దయ్యాలు వేదాలు వల్లించినట్టు ఉన్నది. గుజరాత్లో మోదీ హయాంలో మీరు హోం మంత్రి (అమిత్ షా)గా ఉన్నప్పుడు పేపర్ లీకులలో గుజరాత్ నంబర్ వన్గా ఉన్నమాట నిజం కాదా? గత ఎనిమిదేండ్లలో గుజరాత్లో 13 సార్లు పేపర్ లీక్స్ కాలేదా? ఈ దేశంలో వ్యాపం లాంటి అతి జుగుప్సాకరమైన స్కాం చేసింది మీ బీజేపీ ప్రభుత్వం కాదా? అయినా నిస్సిగ్గుగా సుద్దులు మాట్లాడతారా?
- పీఎం కేర్స్లో ఎంత జమైంది? ఏ విధంగా ఖర్చు అయ్యిందో చెప్పని వారు.. కాగ్ ఆడిట్ పీఎం కేర్స్కు వర్తించదు అని నిస్సిగ్గుగా సుప్రీం కోర్టులో అఫిడవిట్ వేసిన వారు.. కాగ్తో పాటు అన్ని రకాల బ్యాంక్ల ఆడిట్లతో కట్టిన ప్రాజెక్టపై మాట్లాడటం.. అవివేకం కాక మరి ఏమిటి?
- అమిత్షా జీ.. గత 9 సంవత్సరాల్లో తెలంగాణ కంటే మెరుగ్గా ఉన్న ఒక్క బీజేపీ పాలిత రాష్ట్రం పేరు ఎందుకు చెప్పడంలేదు? తెలంగాణలో ఐఐఎం ఐఐఎస్ఈఆర్ ట్రిపుల్ ఐటీ ఐఐటీ ఎన్ఐడీ నవోదయ విద్యాలయాలు మెడికల్ నర్సింగ్ కాలేజీలకు అమిత్షా శంకుస్థాపన చేశారు. అమిత్ షా తెలంగాణ పర్యటన సందర్భంగా వీటికి శంకుస్థాపన చేసినందుకు ధన్యవాదాలు. (నిజానికి అమిత్ షా వీటిల్లో వేటికి శంకుస్థాపన చేయలేదు. గతంలో తెలంగాణకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదంటూ వ్యంగ్య వ్యాఖ్యలు చేశారు.




హైదరాబాద్‌లోని లోటస్‌పాండ్ వద్ద ఉద్రిక్తత చోటుచేసుకుంది. పోలీసులతో వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల దురుసుగా ప్రవర్తించారు. తనను ఇంటి నుంచి బయటకు రాకుండా పోలీసులు అడ్డుకున్నారంటూ ఆరోపిస్తూ వారితో ఆమె వాగ్వాదానికి దిగారు. బయటకు వెళ్లేందుకు యత్నించగా పోలీసులు షర్మిలను అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఆమెను అడ్డుకునేందుకు యత్నించిన పోలీసులను నెట్టేశారు. ఎస్సై, మహిళా కానిస్టేబుల్‌ను చేతితో పక్కకు నెట్టి దురుసుగా ప్రవర్తించారు. దీంతో పోలీసులు అడ్డుకోవడంతో రోడ్డుపై ఆమె బైఠాయించిన నిరసన తెలిపారు. అనంతరం షర్మిలను పోలీసులు అరెస్ట్ చేసి జూబ్లీహిల్స్ పీఎస్‌కు తరలించారు.

# లారీ బీభత్సం: వ్యక్తి మృతి.. కాలేజీ విద్యార్థులకు గాయాలు

మహబూబ్‌నగర్ : మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో సోమవారం లారీ బీభత్సం సృష్టించింది. రెండో పట్టణ ఠాణా సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలో ప్రతిభా జూనియర్ కళాశాలకు చెందిన బస్సు కొంతమంది విద్యార్థులతో కళాశాలకు వస్తోంది. ఈ క్రమంలో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి ఎదురుగా రహదారిపై మలుపు తిరుగుతుండగా వెనుక నుంచి వచ్చిన లారీ అదుపుతప్పి బస్సును ఢీకొట్టింది. అదే సమయంలో ద్విచక్రవాహనంపై రోడ్డు దాటుతున్న సత్యనారాయణ అనే వ్యక్తిని లారీ ఢీకొట్టడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందారు. కళాశాల బస్సులో ఉన్న విద్యార్థులు స్వల్పంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ తెలిపారు.



# టీఎస్‌పీఎస్సీ పరీక్షల రద్దు సబబే: హైకోర్టు

హైదరాబాద్: టీఎస్‌పీఎస్‌సీ పరీక్షలు రద్దు, వాయిదా సబబేనని తెలంగాణ హైకోర్టు వ్యాఖ్యానించింది. ప్రశ్నపత్రాల లీకేజీ కేసు వ్యవహారంలో కాంగ్రెస్ నేత బల్మూరి వెంకట్ దాఖలు చేసిన పిటిషన్‌పై ఉన్నత న్యాయస్థానంలో విచారణ జరిగింది. సిట్ దర్యాప్తు సరిగా జరగడం లేదని పిటిషనర్ తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. "సిట్ దర్యాప్తుపై రాజకీయ ఒత్తిడి, మంత్రి కేటీఆర్ జోక్యం ఉంది. మంత్రి చెప్పినట్లే సిట్ దర్యాప్తు చేస్తోంది. లీకేజీలో ఇద్దరికే ప్రమేయం ఉందని కేటీఆర్ ముందే చెప్పారు. ఐటీ అంశాలపై దర్యాప్తునకు సిట్‌లో సాంకేతిక నిపుణులు లేరు" అని కోర్టుకు తెలిపారు. విచారణలో భాగంగా ఇప్పటివరకు సిట్ 40 మంది సాక్షులను ప్రశ్నించిందని ప్రభుత్వం తరఫున హైకోర్టుకు ఏజీ తెలిపారు. 12 కంప్యూటర్లను సిట్ సీజ్ చేసినట్లు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ధర్మాసనం స్పందిస్తూ.. సిట్‌లో ఐటీ నిపుణులు ఉన్నారా అని ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. ఐటీ అంశాల దర్యాప్తునకు మళ్లీ ఔట్ సోర్సింగ్‌కు వెళ్తారా? అని వ్యాఖ్యానించింది. భాజపా, కాంగ్రెస్ నేతలను ఎందుకు విచారణకు పిలిచారు? నేతల నుంచి ఏదైనా సమాచారం సేకరించారా? అని కోర్టు ప్రశ్నించింది. ఈ వ్యవహారంపై ఈ నెల 28న మధ్యంతర ఉత్తర్వులు జారీ చేస్తామని ధర్మాసనం తెలిపింది.



Printed, Published and owned by VISHWANATH V, Printed at Ratan Graphics D.No. 2-3-703/7, Ameerpet, Hyderabad - 500013 Telangana State and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State. Editor : V. VISHWANATH, M.A. Journalism
Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : garudavartha@gmail.com